భారతి

ఆగస్టు 1968

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒక రూపాయి

భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

ఆగస్టు 1968

★

సంపుటము : 45 : సంచిక : 8 :

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఆగస్టు 1968

తొలకరి జల్లు

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

మురిపించి మురిపించి చిరునవ్వు వెన్నెలల్
చిలికించు జవరాలి పలుకులవలె
చిరుగాలి తాకగా మురిసి లతాతన్వి
కురిసెడు క్రొంగ్రొత్త విరులవోలె
లేజవ్వనపు దేటి ప్రియునకు విందుగ
సిద్ధించు పూదేనె చినుకులవలె
తమి వేచికొను చకోరములకు కుముద బాం
ధవు డిచ్చు నమృతబిందువుల వోలె

దుస్సహ దినేశ కిరణ సందోహతప్త
సకలధరణీతలప్రాణి సంశయ శ్ర
మాపనోదంబుగా హాయిదోప నిదిగొ
చల్లచల్లగ తొలకరిజల్లు వచ్చె.

తడిసిన తాళవృంతములచే సమకూరు
గాలి చల్లదనంబు క్షణికమగుచు
పలుచగానున్న దుస్తులు సైత మొంటిపై
గడియయైన ధరింప గష్టమగుచు
వాకిళ్లలో నారుబయట రాత్రుల నాడల్
స్వేదాంబుపూర సంసిక్తమగుచు
మేనుమేనుముదాకనీని యుక్కకు లొంగి
యువదంపతులకు వియోగమగుచు

ఒక్కొక నిమేష మొక్కొక్క యుగమువోలె
గడపుచు తపించు మనుజ లోకంబునకును
హాయి గూర్చెడు నమృత నిష్యందమగుచు
చల్లచల్లగ తొలకరిజల్లు వచ్చె.

శ్రీమదనంతవర్మ చోడగంగదేవుని తెంబూరు తామ్రశాసనము

శ్రీ బి. ఎన్. శాస్త్రి



ఏడు రేకులుగల ఈ తామ్రశాసనమును శ్రీమదనంతవర్మ చోడగంగ దేవుఁడు తన ఆప్తభృత్యులకు ప్రీతితో కళింగదేశమందలి ఎలఆద విషయమందుగల షోడశ గ్రామములను తన తండ్రియగు రాజరాజ యశోభివృద్ధికై దానమిచ్చు సందర్భమున వేయించెను. ఈ శాసనమును డాక్టర్ గిడుగు వేంకట సీతాపతిగారు నాకు దయతో నొసంగిరి. శాసనము శ్రీకాకుళంజిల్లా పాతపట్నంతాలూకా లోని తెంబూరు గ్రామ సమీపమున లభించినది.

ఈ శాసనపు రేకులు కడియమున కమర్చబడియున్నవి. కడియమునకు నందివిగ్రహమున్న రాజముద్రిక అమర్చబడినది. శాసనపు రేకులలో మొదటి రేకులో ఒక ప్రక్క వదిలివేయబడినది. అట్లే ఏడవ రేకు రెండవ ప్రక్క వదిలి వేయబడినది. శాసనము ఏడవరేకు మొదటి ప్రక్క 2/3 వంతు మాత్రమే చెక్కబడినది. అక్కడికి శాసనము ముగిసినది.

ఈ శాసనము అకారమున పెద్దదిగా నున్నది. శాసనలేఖకు డంచుల వరకు అక్షరములను చెక్కినాడు. అచ్చటచ్చట అక్షరము లొక వరుసలోనివి రెండవ వరుసలోని అక్షరములలో కలిసిపోయినవి. శాసనమున కళింగరాజుల వంశక్రమము వర్ణింపబడినది. అనంతవర్మ చోడగంగుని కొర్ని శాసనమున నున్న గాంగవంశక్రమము యీ శాసనమున వర్ణింపబడిన వంశక్రమము ఒకే విధముగా నున్నవి.

ఆకారాదికములు :— ఈ శాసనములోని ఒక్కొక్క రేకు పొడవు 25 సెం. మీ; వెడల్పు 12.5 సెం.మీ; ఈ ఏడు రేకులును నంది విగ్రహముతో గూడియున్న రాజముద్రికగల కడియమునకు గుది గ్రుచ్చబడినవి. కడియము చుట్టుకొలత 40 సెం. మీ; కడియముయొక్క వ్యాసము 10 సెం. మీ.

శాసనపు కడియమునకుగల రాజముద్రిక పైనున్న నంది విగ్రహము చుట్టు అక్షరములు చెక్కబడినవి. అవి నగిషీ చెక్కినట్లు కనిపించుచున్నవి. చిలుము పట్టుటవలన అక్షరములు చదువుటకు వీలు లేకుండ నున్నవి. నంది విగ్రహమున కభిముఖముగ నున్న రాజముద్రిక భాగము విరిగిపోయినది. రాజముద్రిక గుండ్రముగను పలుచగను ఉన్నది. మధ్యలో నంది విగ్రహము కలిగియుండుటవలన చూచుట కందముగ నున్నది. శాసనపు రేకుల అంచులు అక్షర

ములు చెదిరి పోకుండ తీర్చబడినవి. అచ్చటచ్చట తీర్చిన అంచులపైనను శాసనాక్షరములు చెక్కబడినవి. శాసనపు రేకుల మందము 0.6 సెం. మీ. కొన్ని రేకులు 0.6 సెం. మీ. కన్న తక్కువ మందముగా నున్నవి. ముఖ్యముగ ఏడవరేకు పలుదగ నుండి ఎడమవైపుననున్న రంధ్రమువద్దను, రేకు మధ్యలోను రంధ్రము ఏర్పడి పగిలిపోయినది. అక్కడ శాసనాక్షరములు చెక్కబడి లేవు. శాసనపు రేకులకు ఎడమ పక్క 1.5 సెం. మీ. వ్యాసముగల రంధ్రము లున్నవి.

శాసనపు రేకుల తూక మీ క్రింది విధముగా నున్నది.

మొదటి రేకు తూకము	680	గ్రాములు
రెండవ రేకు తూకము	685	,,
మూడవ రేకు తూకము	685	,,
నాలుగవ రేకు తూకము	700	,,
ఐదవ రేకు తూకము	625	,,
ఆరవ రేకు తూకము	615	,,
ఏడవ రేకు తూకము	410	,,
కడియము సీలుతో సహా	630	,,

మొత్తము శాసనము తూకము 5030 గ్రాములు. అనగా 5 కిలోల 30 గ్రాములు.

శాసనపు రేకులు పెద్దవిగానున్నను, శాసనాక్షరములు చెదిరి పోకుండ అంచులు తీర్చియున్నను శాసనము చెక్కిన శిల్పి అక్షరములను దగ్గర దగ్గరగా చెక్కినాడు. శాసన విషయ మెక్కువగా నుండుట వలన శిల్పి ఒకదాని కొకటి తాకునట్లుగా అక్షరములను చెక్కుట తటస్థించినది.

శాసనాక్షరము లొక్కొక్క చోట పెద్దవిగను, ఒక్కొక్కచోట చిన్నవిగను ఉన్నవి. మొదటి రేకు రెండవప్రక్క క్రింది భాగమునమన్న అక్షరములు చిలుముపట్టి చెదిరిపోయినవి. రెండవ రేకు రెండవ ప్రక్క క్రిందిభాగమున ఎడమవైపునను కుడివైపునను మూఁడవరేకు రెండుప్రక్కల క్రింది భాగములందును, నాలుగవరేకు మొదటిప్రక్క చివరి పంక్తిలోని కొన్ని అక్షరములును, నాలుగవ రేకు రెండవప్రక్క క్రిందివైపు మధ్యభాగమును, ఐదవరేకు మొదటి ప్రక్క అచ్చటచ్చటను, ఐదవరేకు రెండవప్రక్క అచ్చటచ్చట కొన్ని అక్షరములును, ఆరవరేకు మొదటి ప్రక్క చివరి పంక్తిలోని అక్షరములును, ఆరవరేకు రెండవప్రక్క క్రిందిభాగమున కుడివైపునగల అక్షరములును, ఏడవరేకులో ఎనిమిదవ పంక్తిలో రంధ్రము లున్న చోటును అక్షరములు చదువుటకు వీలు లేకుండ నున్నవి.

ఈ శాసనమందలి పంక్తుల సంఖ్య 157.

మొదటి రేకు	— రెండవప్రక్క	13	పంక్తులు
రెండవ రేకు	— మొదటిప్రక్క	12	,,
రెండవ రేకు	— రెండవప్రక్క	14	,,
మూఁడవ రేకు	— మొదటిప్రక్క	13	,,
మూఁడవ రేకు	— రెండవప్రక్క	13	,,
నాలుగవ రేకు	— మొదటిప్రక్క	14	,,
నాలుగవ రేకు	— రెండవప్రక్క	14	,,
ఐదవ రేకు	— మొదటిప్రక్క	14	,,
ఐదవ రేకు	— రెండవప్రక్క	13	,,
ఆరవ రేకు	— మొదటిప్రక్క	13	,,
ఆరవరేకు	— రెండవప్రక్క	15	,,
ఏడవ రేకు	— మొదటిప్రక్క	9	,,
మొత్తము		157	పంక్తులు.

శాసనలిపి:—ఈ శాసనమందలి లిపి ప్రాచీన కన్నడ–తెలుగు లిపి; శాసనాక్షరములు దగ్గరదగ్గరగానుండి ఒక వరుసలోని యక్షరములు రెండవ వరుసలోని యక్షరములతో కలిసిపోయినవి. శాసనలిపి అనంతవర్మచోడగంగు వేయించిన శక సంవత్సరము 1040 నాటి శాసనలిపిని,[1] శక సంవత్సరము 1034 లో వేయించిన కొర్నిశాసనలిపిని[2] పోలి యున్నది. శాసనకవి, శాసనాధికారి భాస్కరభట్టు. శాసనలేఖకుఁడు చాలుక్యగంగాచార్యుని జామాతయగు మాంకనాచార్యుడు. ఈ శాసనమున కొన్నిఅక్షరములు చిన్నవిగను కొన్నిపెద్దవిగను ఉన్నవి. శాసనవిషయము పెద్దదిగా నుండుటవలన శాసనాక్షరములు కొన్నిచోట్ల ఒక వరుసలోనివి రెండవ వరుసలోని యక్షరములకు తాకుచున్నట్లు చెక్కబడినవి. లేఖకుని అజాగ్రత్త వలన అచ్చటచ్చట అక్షరములు వదలివేయబడినవి. మూఁడవ రేకు రెండవప్రక్క తొమ్మిదవ పంక్తిలో

1. Indian Antiquiry-Vol XVIII.


2. భారతి—క్రోధన సంవత్సరము—కళింగదేశ చరిత్రాసంబంధము Page 65–78.

'.......తత్తనయో + ణాణవః......'తత్తనయో'
ర
తరువాత 'ర' యక్షరము మరచి తరువాత + గుర్తు 'యో' ప్రక్కనచెక్కి యో, ణా అక్షరముల మధ్య క్రిందుగా 'ర' చెక్కినాడు. అచ్చటచ్చట కొన్నియక్షరములను మరచిపోయినాడు. శాసనమూలమున కుండలీకరణమున వాటిని చేర్చడమైనది.

భాష :—శాసనము 7 రేకులు గలిగి 157 పంక్తులతో కూడియుండి గాంగవంశచరిత్ర వర్ణింపబడియున్నది. అనంతవర్మచోడగంగు వేయించిన కొన్ని శాసనములలోనున్న గంగవంశపురాజుల చరిత్ర, వంశోత్పత్తి, వంశానుక్రమము, ప్రశస్తి మొదలగు విషయము లీ శాసనమునందున్న విషయములతో సరిపోవుచున్నవి. ఈ శాసనభాషయంతయు సంస్కృతము. శాసనము 157 పంక్తుల గ్రంథము. శాసనకవి భాస్కరభట్టు. సంస్కృత పండితుడు. కవి. చక్కని కవిత్వము వ్రాయగలవాడు. ప్రబంధశైలిలో గ్రంథరచనచేయు సమర్థుడు. ఈ శాసనమున రెండు పంతులు శ్లోకములు, ఒక పంతు వచనము ఉన్నది. కళింగదేశమున ప్రజలు నిత్యవ్యవహారమున తెలుగుభాష మాట్లాడినను, శాసనములు పండ్రెండొలది తెలుగు భాషలో వేయింపబడినను ఈ శాసనమున గ్రామ సరిహద్దులు చెప్పునప్పుడైనను తెలుగు మాటలువాడక, సంస్కృత శబ్దములనే శాసనకవి ఉపయోగించినాడు. శాసనముగలవర్ణనములు కవి రచనాశక్తిని పాండితీ ప్రభావమును తెలుపును. దానివలన అనంతవర్మ చోడగంగు మహారాజు సంస్కృత భాషాభిమాని యనితెలియుచున్నది.


శాసనమున ద్విత్వాక్షరములు, సంయుక్తాక్షరములు, పూర్ణానుస్వారములు సంస్కృత సంప్రదాయానుసారముగ వ్రాయబడినవి. 'ణ' పంక్తి ఆరంభమున పూర్ణానుస్వారము వ్రాయుటకూడ ఈ శాసనమున కనిపించును.

శాసన విషయము:—ఈ శాసనమున గాంగ వంశాను క్రమము వర్ణింపబడినది. వంశమునకు ప్రాముఖ్యము కలుగుటకు చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి వంశీయులు, విజయనగరాధీశులు తమ తమ వంశములకు మూలపురుషులు విష్ణువును, తారాపతిని, సూర్యుని చెప్పుకొనినారు. అట్లే గాంగవంశ రాజులు తమ వంశమునకాది పురుషుడు శ్రీ మహావిష్ణువును చెప్పుకొనినారు. ఈ శాసనమున వరుసగా విష్ణువు, బ్రహ్మ, అత్రి, చంద్రుడు, బుధుడు, పురూరవుడు, ఆయువు, నహుషుడు, యయాతి, పసువు గాంగేయుడు, విరోచనుడు, సంవేద్యుడు, భాస్వంతుడు, దత్తసేనుడు, సౌమ్యుడు, అంశుమంతుడు, సౌరాగుడు, చిత్రాంబరుడు, సారధ్వజుడు, ధర్ముడు, పరీక్షితుడు, జయసేనుడు, విజయసేనుడు, జితవీర్యుడు, వృషధ్వజుడు, ప్రగల్భుడు, కోలాహలుడు విరోచనుడు విరోచనుని యనంతరము 81 మంది రాజులు పాలించిన పిదప వీరసింహుడనురాజు కళింగాధిపతియయ్యెను. వీరసింహుని యనంతరము కామార్ణవుడు 36, దానార్ణవుడు 44, రెండవ కామార్ణవుడు 55, రణార్ణవుడు 5, రెండవ వజ్రహస్తుడు 15, మూడవ కామార్ణవుడు 21, గుణార్ణవుడు 27, పోతాంకుశుడు 15, కలింగలాంకుశుడు 12, గుండమహారాజు 7, నాల్గవ కామార్ణవుడు 25, వినయాదిత్యుడు 3, నాల్గవ వజ్రహస్తుడు 35, ఐదవ కామార్ణవుడు అర్ధ సంవత్సరము, రెండవ గుండ మహారాజు 3, ఆరవ మధుకామార్ణవుడు 21, వజ్రహస్తుడు 30, రాజరాజు 8 సంవత్సరములు పాలించినట్లు వర్ణింపబడిన పిదప అనంతవర్మ చోడగంగు శక నవరంధ్రగ్రహగణితమగు దాని యందు (999) కుంభస్థమగు దినమందు రేవతీ నక్షత్రయుక్త విూనలగ్నమందు విశ్వవిశ్వంభరా చక్రమును రక్షించుటకు పట్టాభిషిక్తుడయ్యెను. ఆతని గుణగణములు, పరాక్రమాతిశయములు వర్ణించిన పిదప చోడగంగుడు తన ఆప్తభృత్యులకు ప్రీతితో కళింగదేశమందలి ఎలద విషయమందుగల షోడశ గ్రామములను తనతండ్రి యశోభివృద్ధికి దానమొసంగినట్లు వర్ణింపబడినది. ఆ దానము మిధున కృష్ణ ద్వాదశీ ఆదిత్యవారమున పూర్వాహ్ణమున చోడగంగుని విజయరాజ్యసంవత్సరమున ధారాపూర్వకముగా అచంద్రతారార్కము సర్వభోగార్హ విూయబడినది. గోద్దాళి ఆది చతుర్దశ గ్రామములకు తోడు కనుమద్ది, ముక్రోలు, పల్లివాడ అను మూడు గ్రామములు దేవభోగములుగా వీయబడినవి. ఈ గ్రామములకు సరిహద్దులు చెప్పబడినవి. ఆటుపిమ్మట సంప్రదాయానుసారముగ వ్రాయు శ్లోకములు, శాసనాంతమున కవిశాసనాధికారియగు భాస్కరభట్టు పేరును, లేఖకుడు శాసనాధికారి చాళుక్యగంగాచార్య జామాత మాంకాచార్యుని పేరును ఉల్లేఖింపబడినవి.




మొదటి రేకు - రెండవ ప్రక్క

1. ఓం లక్ష్మీనిషేవ్య ముడురాజకలంకకాంతిబాహాచతుష్టయ చణం వపు రా
2. దధానః । ప్రాదుర్బభూవ భువనత్రితయం విధిత్సు ర్విశ్వప్రసూతి జఠరో
3. భగవా ననంతః । తన్నాభిసరసి జా ద్బభూవ భువన ప్రారంభదీక్టారతో
4. బ్రహ్మా వేదపరంపరాం(ప)రిషధద్వ్యక్తై శ్శృతుర్భి ర్నృతః । ప్రాజాపత్యధురాధిరూ
5. ఢ మహసా మృతి మ్మునీనాం ప్రభు ర్జ్యాతి స్సర్వజనీన దివ్యతపసాం ప్రా
6. తో వపుష్మా నివ॥ అత్రేః పుత్రో బభూవ త్రిపురహరజటాజూటనేపథ్య
7. రత్నం నేత్రవ్యాపారదేశః స్మరచరితమహానాటికాసూత్రధారః । దృ
8. ష్టంతో దాక్షిణాత్యముఖముకురరుచాం శర్వరీ(రీ)జీవితేశ(ః) త్ర(త్రై)లోక్యానంద కం
9. దొ గగనతలమహాంభోధిశంఖ శ్శశాంకః । తతో జగత్తాపభిషజ్జి తత్విష శ్శుభ
10. గ్రహోఽ భూ ద్బుధాగ్రణి ర్బుధః పురూరవా స్తత్తనయో యదుల్లసద్భుజే
11. భుజిష్యాం బుభుజే వసుంధరాం॥ తస్మా దాయు శ్శుభంయు స్త్రిభువనవిదితో
12. జన్మ లేభే తదీయః పుత్రోఽ భూ జ్జైత్రబాహు ర్నహుష నరపతి ర్భూర్భృతా మగ్రగణ్యః
13. యః పృథ్వ్యా మేకపత్న్యా మన(ను)భవవిముఖో భూరిజాత ప్రజాయాం స్వ




రెండవ రేకు - మొదటి ప్రక్క

1. వ్వేఞాశ్యాం ఖణ్డేతేంద్రాం ప్రణయ పరవశః పౌరుషేణాన్వభుక్త। తతో యయా
2. తి వ్విఞాఖలాధియాతి జ్ఞఞజ్ఞే తత స్సృప్వఞాము రుప్వఞారప్వః స పూప్వఞాగివ్వాఞాణగురో
3. మ్మఞాహిమ్నా మాతా మహస్యైరపి సంప్రవృద్ధం॥ అపుత్రిత్వం ప్రాప్త స్సుచిర మ
4. తిఖిన్నో వృపవృష ప్ప గంగా మారాధ్యంవియతిగతి రారాధ్య వరదాం। ఒజేయ
5. ం గాంగేయం సుతి మలభతారభ్య చ తదా క్రమ న్త్వద్వంశ్యానాం భువి జయతి గ
6. ంగాన్వయ ఇతి॥ అప్యేసీ త్తవయో విరోచనవిభు వ్యైఞారిగ్రహోస్త్వచలః
7. క్ష్టీజీనాధకిరీటవక్త్రమకరీలగ్నాంఘ్రిరేణాత్కరః లక్ష్మీవాగ్వనితా
8. మహాకులనదీసంవేద్య ముద్యోగినం పంవేద్యం నమజీజన త్స్నపతి గ్గఞాంగా
9. న్వయోత్తంసకం॥ పంవేద్యతో మణిరివా జని వాము భాస్వాన్ భూపాలమౌలిమ
10. కుఙ్టై రుపలాలనీయః। త్రాపాదిదోషరహిత స్ప బలగానవృత్తి యత్సంవనా వి
11. ధి రజాయత దత్తపేనః॥ తస్యోప్వఞాశ్వరవహ్నితి మణ్డనమనే రాసీ దపాధారణాం బి
12. భ్రాణో వృపతిశ్రియం ప్రియసుత స్సామ్యో తిరమ్యాకృతిః। తస్మై ద పృథపాది




రెండవ రేకు - రెండవప్రక్క

1. మోదితజగచ్చక్రోం శుదత్త స్తత స్సోరగో భవ దన్యరాడ్గజ ఘటాపాత్రకియా
2. పాకలః॥ తస్మా చ్చిత్రాంబరో భూత్సిత్రితలవలయే రాజ ఃబి _క వాచ్య స్సామ ప్సారధ్యజో౽ప్య।
3. భవ దఖిలభువా మాధిపత్యప్రమూలి(ః)। ధర్మార్ణాధి తత్తనూజో వ్రజనయుపబీహం
4. థముత్సో విరేశ్ర బభ్రా జాపత్యం మన్య క్షితి జయపరవా వేకధన్వా పరీక్షిత్। నమ
5. హీపతి స్సుత మహావ మానినం జయుపేన మన్యన్నవ దప్పణ శాతనం। అభవ త్సుతో
6. వ్య (జ) యపేన సంజ్ఞితః ప్రథయన్ దిశాం పితదుకూలితయశః। జితవియ్యణ మపి
7. వజీజన త్సచ భూపాలవృషం వృషధ్వజః। సహశక్తి మలంఘ్యశాసనం వి
8. జితేమం సపిరోధిభీషణం॥ తస్య ప్రాగల్భ స్తనయో౽ా బభూవ క్షితీశమాగ్గణ
9. చరణప్రాల్యః యః ఖడ్గధారాజలధౌత వైరివారీ కపోలస్తలపత్రభంగః। అపి
10. దేకపితాతపత్ర తిలకః కోటీశత్రు దస్యాత్మజో వీరశ్రీపవితా స్వయంప్రతపతి ద్వేణ
11. వ స్స కోలాహలః నిమ్మాణ యోజ్ఞితగంగవాడివిషయే కోలాహలాఖ్యం పురం య
12. శ్చక్రే సురసద్మ వీక్షణరసప్రత్యూహ మఖ్ణం హరేః॥ తత్సుతో ధృతశరాసనయుపి ట
13. గ్రాగ్ణమరక్షదవపజ్ఞితచౌర్యణః। శాసనప్రథితపాశ విశ్రేయా మేక ఏవ స విరోచ
14. న సంజ్ఞః॥ గతే తత్ర నరేంద్రాణాం కోలాహల పురీభుజాం। ఏకాశీత్యంచ తద్వంశ్యే



మూడవ రేకు - మొదటి ప్రక్క


1. వీరసింహోఒభవ న్నృపః॥ తస్యకామార్ణవ స్సూను ర్దానార్ణవగుణార్ణవౌ। మారసి
2. ంహ ఇతి ఖ్యాతో వజ్రహస్త్యాఖ్యపంచమః॥ అథకామార్ణవో దత్వా పితృవ్యాయ
3. విజా మ్మహీం। ప్రాయాత్పృథ్వీం ధ్రువం జేతు మ్మహేంద్రంద్రాత్పృథి గ్గిరిం॥ తత్ర చ సకల
4. సురాసురసిద్ధసాధ్యకిరీటకోటి సఘృష్టమసృణ చరణ పీఠ మారాధ్య గోకర్ణస్వామి
5. న మస్య ప్రసాదా త్సమాపాదిత వరవృషభలాంఛన స్సముపలబ్ధ సకల సాంబ్రాజ్యలి
6. ప్సా ప్రశోభమాన స్స నరేంద్రో మహేంద్రాచల శిఖరా దవతీర్య యుధిష్టిర ఇ
7. వ చతుర్భి రనుజై రనుగమ్యమాన స్సమరశిరసి శబలాదిత్యం నిహత్య
8. కామార్ణవః కలింగా న్నగ్రహీత్। తస్య చాపహసిత సురేంద్రపురం దంతామరన్నామ
9. నగరీ రాజధా న్యాసీత్। అసౌ దానార్ణవ మనుజం కంఠికాబంధురకంధరం విధాయ గు(ణార్ణ)
10. వాయాంబవాడివిషయం మారసింహాయ సోదామణ్ణలం వజ్రహస్తాయ కంటక వర్త
11. నీ మదాత్। ఏవంచ క్రమేణ షట్త్రింశద్వర్షాణ్ కలింగా నపాలయత్। తస్యచ శ్రీమతా
12. మశేషభువన భూపాలవర్గాళి మాలాలంకారయశసా న్నిజరాజ్యసంప దసహిసి
13. తమహేంద్రాదా మ్మహేంద్రాచలామలశిఖర ప్రతిష్ఠి తస్య సకలభువన



మూడవ రేకు - రెండవ ప్రక్క


1. విమ్మాణైకసూత్రధారస్య చరాచరగురో ర్భగవతో గోకర్ణస్వామిన ప్రసా
2. రాధనలబ్ధ నిఖిలమనోరథానా మాత్రేయగోత్రాణాం గంగానాం కుల మలంక
3. రిష్ణు ర్విష్ణు రివ విక్రమాక్రాంత సకలమహీమండలస్య కా(మా)ర్ణవ స్యానుజో దానార్ణ
4. వ శ్చత్వారింశత మబ్దకాన్ రాజ్య మకార్షీత్॥ తత్సూను ర్ద్వితీయః కామార్ణవః ప
5. ంచాశద్వర్షా న్మహీమండల మమండయత్ తస్య తిరస్కృతత్రివిష్టపం నగర
6. న్నామ పుర మాసీత్॥ తస్మిన్ సోపి మధూకవృక్షజనవాథీశస్య లింగాకృతే
7. ః కృత్వా ఖ్యాం మధుకేశ ఇ త్యరచయ త్ప్రాసాద మభ్రంకషం। యద్వారోదంర్వ విచిత్ర వ
8. త్రలలికాచిత్రాణి వా పశ్యతాం సౌధా వ్యంబరపత్తి(నా)నాం హృది భవే న్నానం వి
9. మానారుచిః॥ తత్తనయో రణార్ణవః పంచవర్షా న్మహీ (మ)పా(ల)యత్। తత్సూను ర్ద్వితీయో వజ్ర
10. హస్తః పంచదశసమాః క్షమా మరక్షత్। తస్యానుజ స్త్రితీయః కామార్ణవో ర్ణవమేఖ
11. లా మేకోనవింశతి సంవత్సరా న్నమవర్ధయత్। తత్సుతో గుణార్ణవ స్సప్తవింశ
12. తి మబ్దా నబ్ధిరశనాం వశ మనైషీత్। తదాత్మజః పోతాంకుశః పంచదశవత్సరాన్ మ
13. హీ న్నిస్సపత్న్య మకార్షీత్। తత స్తద్భ్రాతు స్సుతః కలి(ం)గలాంకుశో ద్వాదశవత్సరా

2




నాలుగవ రేకు - మొదటి ప్రక్క

1. ః కలింగా నలంచకార। తత స్తస్య పితృభ్రాతా సప్తవర్షాణి గుండమరాజో మహీమణ్డల
2. మణ్డనో బభూవ। తస్యానుజ శ్చతుర్ణ్ణా కామార్ణవః పంచవింశతివర్షాణ్ వసు
3. ంధరా మనుబభూవ। తయోః కనీయా న్వినయాదిత్యో వర్షత్రయం ధరిత్రీ మ
4. త్రాయత। తతస్తజ్జ్యేష్ఠస్య కామార్ణవస్య సుత శ్చతుర్థో వజ్రహస్తః పంచ
5. త్రింశత మబ్దాన్। యద్వత్తదంతి సహస్రదానవారిణా దాన వారిణాచ కువలయం
6. పంకిల మాసీత్। తత స్తత్సుతః పంచమకామార్ణవోర్ద్ధసమాం। తత్ర స్తదను
7. జో ద్వితీయో గుణ్డమరాజ స్త్రీణి। తస్య ద్వైమాతురో భ్రాతా షట్ మధు
8. కామార్ణవ ఏకోనవింశతి వర్షాణి। తత స్తదీయనందనో వజ్రహస్త స్త్రిం
9. శత మబ్దాన్। తద్వర్ణనే॥ వ్యాప్తే గంగకులోత్తమస్య యశసా దిక్చక్రవాలే తి
10. ప్రద్యోతామలవేన యస్య భువన ప్రహ్లాద సంపాదిన సింధూరైః రతి సాంద్రపం
11. కపటలైః కుంభస్థలిం పట్టకే ప్రాలింపంతి పునః పునశ్చ హరితా మాధోరణా వారణాన్।
12. అనురాగేణ గుణినో యస్య వక్త్రముఖాబ్జయోః। ఆసీత్ శ్రీ సరస్వత్యా వ
13. సకూలే విరాజితః॥ న నామతః కేవల మర్థతోపి స వజ్రహస్త స్త్రికలింగనా
14. థః। కో వజ్రహస్తా దపరః పృథివ్యాం వజ్రంపత ద్వారయితుం సమర్థః॥ తత్సుతో




నాలుగవ రేకు - రెండవ ప్రక్క

1. రాజరాజోప్యవప్య (శ్య) రాన్। తద్వ్యజాతావే। స రాజః ప్రథమం జయశ్రియః పతి ర్భూ
2. భూవ ద్రమిలావాహోత్ప విరాజమానా మధ రాజసుందరీ ముదూఢవాం శ్చోడ
3. మహీంభుజాత్మజాం। త్యక్త్వా వేంగిం సపది పరిణామోదయే ద్యామి వాన్యాం చోడవ్యా
4. జే మహతి విజయాదిత్య మబ్ధా మిను(ం)కు। ఆపన్నానాం పరమశరణం రాజ
5. రాజో విచిత్రం లక్ష్మీభాజం సుచిరమకరో త్పశ్చిమాయాం దిశాయాం॥ తస్యాపి
6. ద్రగనూనః పృథుల నిజభుజావిక్రమార్జ్జిత్యపార స్వత్య ల్యాగైకసీమా విమ
7. లతర యశశ్చంద్రికాధౌతలోకః। వాగుల్లంఘి ప్రతాపశ్ శుభచరితనిధి
8. ర్భార్గవ్య సౌభాగ్యరాశిః కోట్టీశ్రీప్రాణాధినాథ ప్పకలరిపు మనోభంగ
9. ద శ్చోడ గంగః॥ శాకాబ్దే నంద రంధ్రగ్రహ గణగణితే కుంభసంస్థే దినేశే శుక్లే పక్షే తృ
10. తీయాయుజి రవిజదినే రేవతీభే వృయుగ్మే। లగ్నే గంగాన్వయాయూ బుజసదిన
11. కృద్విశ్వవిశ్వంభరాయా శ్చక్రం సంరక్షితుం సద్గుణవిధి రభిస శ్చోడగంగో భిషిక్తః॥
12. వీరశ్రీ భుజదణ్డయుగ్మకలితా యస్యారి దర్పాచ్ఛిద స్తంభ ద్వంద్వనియంత్రితైకకరి
13. ణీ పాదృశ్య మాశ్లిష్యతి। యత్పాదద్వితయాంతరాల మిలితాః కోట్టీశభూతావన్మా
14. లయ స్థాయుత్పద్మయుగానుసారిమధుపశ్రేణీ శ్రియం బిభ్రతి॥ పూర్వాస్యాం ది




ఐదవ రేకు - మొదటిప్రక్క

1. తి పూర్వా ముత్కలపతిం రాజ్యే విధాయాద్ధృతం పశ్చా త్పశ్చిమదిక్తటే విఘటితం వేంగీ
2. శ మప్యేతయోః। లక్ష్మీం వందనమాలికా మివ జయశ్రీతోరణస్తంభయో ర్బధ్నాతిస్మ
3. సమిద్ధకీర్తివిభవ శ్రీగంగచూడామణిః ॥ య స్సంఖ్యే జయగన్ధచోడ మవధీ ద్య
4. స్తీక్ష్ణబాహాసినా ప్రత్యక్ప్రత్యగ్రబల త్రిలోచనగలేంద్రక ప్రవాహ్యాద్ధ్రువం। సంగ్రామా బ్ధిం
5. మపూరయత్ స్ఫుటతరం యః కర్ణరాయం రణే సర్వస్వంచ విజిత్య చోత్కలభు
6. వ స్సామ్రాజ్యలక్ష్మీ మదాత్॥ స శ్రీమదనంతవర్మా మహారాజో రాజాధిరాజో రాజపరమే
7. శ్వరః పరమభట్టారకః పరమ వైష్ణవః పరమబ్రహ్మణ్యః మాతాపితృపా
8. దానుధ్యాత శ్రీ గంగ్గదేవః కుశాలి కాలింగదేశే ఎఱాడవిషయే రాష్ట్రకూటప్రము
9. ఖా న్కుటుంబిన స్సర్వా నాహూయేత్థమాజ్ఞాపయతి విదితమస్తు వో మంత్రిపురోహితసే
10. నాపతియువరాజదౌవారిక సమక్షం యథా। ఆసీత్సంబళామనాయకో గుణనిధి ర్వి
11. ప్రాగ్రణీ స్సత్యభూ స్తత్పుత్ర స్సుజనైకబంధురతుల శ్రీబ్రాహ్మణ్యయాఖ్యః కృతీ తద్భార్యా గుణభూ
12. షణం సుచరితా శ్రీచోడగంగప్రభో.. నామ ధేయసహితా సత్యాన్వితా త్యాగ
13. భూః। తాభ్యాంజాతస్సుపుత్ర ప్రకటగుణనిధి శ్శస్త్రశాస్త్ర ప్రవీణ స్సత్రి శ్రీచోడగం
14. గ్గవిమలభుజబల ప్రత్యనీకప్రమాథీ ॥ శ్రీమత్కామార్ణవస్య స్థిరతరయశసః స్సే




ఐదవ రేకు - రెండవ ప్రక్క

1. దరః శౌర్య్యాభిరామ స్వహస్తేనం ప్రభూతం సకలనృపతశే శ్చోడగంగాధిపస్య॥ తస్మై శ్రీ
2. చోడగంగయాస్మాక మాప్తభృత్యాయ ప్రీత్యై రస్మాభిః కలింగదేశే ఏఅదవిషయే గోర్ద్దాభిధా
3. మ సంభోగః శోడశగ్రామై స్సమేతస్సజలస్థల స్సర్వ్వపీడావివర్జితః పిత్రో రాత్మనశ్చ పుణ్య
4. యశోభివృద్ధయే శకాబ్దే ష్వేకపంచాశదుత్తర సహస్రేషు శ్రీచోడ గంగదేవ విజయ
5. రాజ్యసంవత్సరేషు పంచపంచాశమత్కలదేశే నివాలి నామ రాజధాన్యాం స్థితైర్మ్మాఘ
6. నక్షత్రదశమ్యా మాదిత్యవారే పూర్వాహ్నె ధారాపూర్వ్వక మాచంద్రార్క్క సర్వ్వకరపరి(హా)
7. ర్య్య(o) ముపభోగార్థాం ప్రదత్తః ఇతి॥ అత్ర నకేచిద్బాధః కర్త్తవ్యా। తత్రగ
8. మనామాని లిఖ్యంతే॥ గోర్ద్దాభి వేలావాము గొసేలు వరింకాము లాడివడ
9. తొత్తరాణ చేంవ్యము గుంప్రింబాము గందివడ నడుపల్లి క్రొవ్వడ వృద్ధి
10. గ్రామ కంచరణ ఇతిచర్దశ (చతుర్దశ) గ్రామాః కనుమద్ది మున్క్రోమ వేల్పివాడ
11. ఇతి త్రయోగ్రామా దేవభోగాః ఇతి మిలిత్వా సప్తదశ గ్రామాః గోర్ద్దాభిధ
12. ంభోగస్య సీమా(మా)లింగానిలిఖ్యంతే। పూర్వ్వతః గర్త్తా। ఆగ్నేయతః దేవాడ సి
13. మ్ని తింత్రిణీవృక్షః పశ్చాతకోణంచ చోంపియాశ్రైముఅలబోడువాపీ




ఆరవ రేకు - మొదటి ప్రక్క

1. వాం త్రికూటే త టాకపాలిస్థితతింత్రిణీ (వృ)క్షసమూహః పరత తింత్రిణీ వ్రి
2. క్షః। దక్షిణతః తాత్కడా గొద్దివాడవోామ్మార్గమధ్యే తింత్రిణీవృక్షః కపిత్థశ్చ। తత
3. ః గుంపాము అాంగోలి మార్గసీనాదానాం త్రికూటే తింత్రిణీవృక్షాః చికురేంగు వృ
4. క్షాస్సంతిచ। తతో గంణ్డివాడ (ం) అంపాడయో మ్మార్గమధ్యే దిగ్వ్యసేతుః చికురేంగు
5. వృక్షాః। తతో నడుపల్లి క్రొవ్వల్యో మ్మార్గమధ్యే ఖలిందివృక్షః నిములవృక్ష తింత్రి
6. ణీవృక్షాశ్చ। నైరృత్యాం నడుపల్లి క్రొవ్వల్యోర్మధ్యగతా ర్గ తింత్రిణీ వృక్షా
7. శ్చ తతో గణ్డివాడ నడుపల్లి క్రొవ్వల్లినాం త్రికూటే వాపీస్థలివల్మీకా స్తత
8. ః తింత్రిణీవృక్షాశ్చ। తతః క్రొవ్వాడ గణ్డివాడ క్రొవ్వలినాం త్రికూటే తింత్రిణీవృక్షా
9. ః వల్మీకాశ్చ పరత పాలణ్డ్ల క్రొవ్వల్లి మోమువాం త్రికూటే పాషాణ గర్తాః తతః కరంజ
10. వృక్షాః పరతో తింత్రిణీవృక్షాశ్చ పశ్చిమతః క్రొవ్వాడ మోముపృద్దినాం త్రికూటే తిం
11. త్రిణీవృక్షాః కపిత్థశ్చ వల్మీకాశ్చ। పరతః రేంగాము తాలణ్డ మోము గ్రామాణాం త్రి
12. కూటే ఖలిందివృక్షాః రేంగాము మోము గ్రామయోర్మార్గమధ్యే తింత్రిణీవృక్షాః।
13. తతః దృ (కి) మాము...గ్రామాణాం త్రిమాటే తింత్రిణీవృక్షాః తతః...



ఆరవ రేకు - రెండవప్రక్క

1. గ్రామయోా మ్మర్ధ్యే తింత్రిణీవృక్షః। తతోధవలమాడికివృక్షః॥ తతో వృషిత్పాలా
2. ముఖుంగొలి గ్రామాణాం త్రికూటే తటాకః తతః పొల్పాడ జాగొలి గ్రామయోామ్మ
3. ర్ధ్యే తింత్రిణీవృక్షః। తతః క్షీరవృక్షః। తత స్తటాకమధ్యే మహాటక పిత్పవృక్షః।
4. తతో ముక్రోమడోంగొలిసిరికాము గ్రామాణాం త్రికూటే తింత్రిణీ వృక్షసమూహా
5. ః। తతోముక్రోమసిరికాము గ్రామయోామ్మర్ధ్యే ధవలమూషికవృక్షః। స్తతః క్షీ
6. రవృక్షః। తతః పాషాణసహిత దిగ్పపాలి। తతో దాకమహా తింత్రిణీవృక్షః। వాయు
7. వ్యతః గోద్దర్భితాలణ్ణదిమ్మ గ్రామాణాం త్రికూటేవవ్వర్తత స్తతః పవ్వర్తత కోటి
8. భృదఉత్తరతః కనుమద్ది కలుమడుము గ్రామయోామ్మర్ధ్యే పవ్వర్తతః
9. మర్పివాడ కలిమడుమ వేలివాడ గ్రామాణా(ం) త్రికూటే పవ్వర్తతవాక
10. కొణ్ణధిప్వర్ వల్మీకాః। తతో మర్పివాడ వాల్పివాడయోామ్మర్ధ్యే తింత్రిణీవృక్షః। తతోవార
11. ంజివృక్షః। ఈశానతః దొరపుణ్డిమల్యాడ వెలివాడానాం త్రికూటే గర్తాః। వెలణ
12. ముదొరపూణ్ణ గ్రామయోామ్మర్ధ్యే గిర్తావరకూటే తింత్రిణీవృక్షతతః తింత్రిణీవృ
13. క్ష పమూహా నవిాప (భగ్నః) తడాకమధ్యమహద్వల్మీకః తతోచకస్థలి। మఉవర్మి
14. మఉముదొరపుణ్డిగోద్దర్భి గ్రామాణా త్రికూటే స్థలసహిత పాలినమవ తి
15. ంత్రిణీద్వయం। వేతెమ గ్రామయోామ్మర్ధ్యే క్షీరవృక్షః। తతోవల్మీక



ఏడవ రేకు - మొదటి ప్రక్క

1. తింత్రిణీవృక్షః॥ తతో గోద్వార్భిద్గ్రాముపేలఅము గ్రామాణాం త్రికూటే భిన్నతడాపి
2. లి సింతలింత్రిణీవృక్షః। తతో గోద్వార్భియా గ్రామగ్రామయో మ్మార్ధ్యే మంశగుల్మవ
3. హితస్సపగత్వా తతోవం డికవృక్షః॥ తతో గత్వా పరతః ఉగ్రాణగోద్వార్భిసేం
4. వ్యము త్రికూటే తింత్రిణీవృక్షసమూహశ్చ॥ బహుభి ర్వసుధా దత్తా బహుభి
5. శ్చానుపాలితా యస్యయస్య యదా భూమి స్తస్యతస్య తదాఫలం స్వదత్తాం పరద
6. త్తాం వా యో హరేత వసుంధరాం। షష్టింవర్ష సహస్రాణి విష్ఠాయాం జాయతే కృ
7. మిః॥ షష్టి వర్ష సహస్రాణి స్వర్గే తిష్ఠతి భూమిదః ఆక్షేప్తా చానుమం
8. తా చ తాన్యేవ నరకే వసేత్। కవి శ్చాసనాధికారీ భాస్కరభట్టః। లే
9. ఖకః పాశవాధి (శాసనాధి) కారీ చాలుక్యగంగాచార్య జామాతా మాంకనా చార్యః॥

అనువాదము:— ఓం లక్ష్మీ విశేష్యమైనదియు, తారాపతి కలంకకాంతివంటి కాంతి కలిగి, శక్తివంతములగు చతుర్భుజములతో గూడినట్టిదియు నగు శరీరమును ధరించుచున్నవాఁడై, ముల్లోకములను సృష్టించు కోరికతో విశ్వప్రసూతిజారుఁడై భగవంతుడగు వసంతు డుద్భవించెను. అతని నాభికమలమునుండి భువన ప్రారంభ దీక్షారతుఁడగు బ్రహ్మ, వేదపరంపరను ధరించు చతుర్ముఖములతోఁ బుట్టెను. అతనినుండి ప్రజాపతి పదవి నలంకరించిన మునీశ్వరుఁడగు నత్రి జనించెను. అతఁడు త్రిలోకవాసుల దివ్యతపశ్శక్తి పుంజమే రూపుగొనినట్లుండెను. త్రిపురహర జటాజూట నేపథ్య రత్నమును, దర్శనీయుఁడును, స్మరచరితమహానాటికా సూత్రధారుఁడును, దాక్షిణాత్యుల ముఖముకురములకు (అద్దములకు) దృష్టాంతమైనవాఁడును శర్వరీ జీవితేశుఁడును, త్రైలోక్యానందకందుడును, గగనతల మహాంబోధిశంఖుఁడును నగు చంద్రుడు పుట్టెను. ఆ చంద్రునకు సూర్యాధిక తేజుఁడును, శుభగ్రహమును, విబుధాగ్రణియునగు బుధుఁడు జనించెను. అతనినుండి పురూరవు డుద్భవించెను. అతని పరాక్రమోపేతములగు భుజములచేత వసుంధర యనుభవింపఁబడెను. అతనికి ఆయువు అను నతఁడు త్రిజగ

ద్విఖ్యాత కీర్తి జనించెను. అతనికి పరాక్రమవంతుఁడగు నహుషనరపతి రాజాగ్రగణ్యుఁడైనవాఁడు పుత్రుఁడయ్యెను. ప్రజాబాహుళ్యముగల భూమిని యతఁడనుభవించి యామెకు విముఖుఁడై దేవవేశ్యను ఇంద్రునిపై ఖండితవాయికముగా జేసి ప్రణయపరవశుఁడై స్వపౌరుషముతో ననుభవించెను. అతనికి శత్రుంజయుఁడగు యయాతి పుట్టెను. అతనికి ఊర్వశియందు వసువు జన్మించెను. అతఁడు పూర్వగీర్వాణగురువగు శుక్రునియొక్క మహిమచేత మాతామహుని వక్షస్థలమందు ఊగెను. చిరకాల మాతఁడనపత్యుఁడై దుఃఖితుఁడై యా రాజశ్రేష్ఠుఁడు నిష్ఠాగరిష్ఠుఁడై పూజించినచో వరముల నిచ్చు గంగాదేవి నారాధించి యజేయుఁడగు గాంగేయుఁడను కుమారుని పొందెను. అది మొదలు క్రమముగా తద్వంశ్యులకు భూమియందు గంగాన్వయులు (గంగాన్వయము) అను పేరు వచ్చెను. అతని కుమారుఁడు విరోచనప్రభువు. అతఁడు వైరిగ్రహముల కస్త్రాదియగువాఁడు. అతని అంగరేణు సమూహము (పాదధూళి) యితరరాజ చక్ర కిరీట న్యస్తమకరములయందు లగ్నమైనది. లక్ష్మీభాగ్యవిలాస మహోత్సవములకు దెలియు కార్యారంభముగల సంవేద్యుని. గంగాన్వయోత్తముని యా రాజు (విరోచనుఁడు) కనెను. సంవేద్యుని నుండి, కాంతి సంతమగు మణివలె రాజకిరీట సంగత రత్నములచేతను, రాజులచేతను లాలింపఁబడినవాఁడును త్రాపాది దోషరహితుఁడును సంపన్నిధియునగు దత్తసేనుఁడు జనియించెను. ఆ పృథ్వీశ్వరనాళిమండనమణికి నపారధారణమగు సన్నశిని వహించు నొక ప్రియసుతుఁడు అతి రమ్యాకృతియగు సౌమ్యుఁడను వాఁడు పుట్టెను. అతనికి శౌరాగుఁడు అన్యరాడ్జఘటావాశకుఁడు పుట్టెను. అతనికి చిత్రాంబరుఁడను కుమారుఁడు పుట్టెను. అతఁడు భూమండలమున కేకైకమగు నర్తకలవాఁడు. అతని కుమారుఁడు పారధ్వజుఁడు. అతఁడు సమస్త భువనాధిపత్యమునకుఁ బ్రసూతివంటివాఁడు (జనకుఁడు). అతని కుమారుఁడు ధర్ముఁడు. అతఁడు రాజనీతిజ్ఞుఁడు. జయశీలియు వేదధన్యుఁడును (పరాక్రమశాలియు) నగు పరీక్షితుఁడతని కుమారుఁడయ్యెను. ఆరాజు అన్యనృపదర్పశాతనుఁడును, అభిమానవంతుఁడునునగు జయసేనుని పుత్రునిగా బడసెను. అతనికి విజయసేనుఁడను కుమారుఁడు తనకీర్తిచే దిశలనతి ధవళముగాఁ జేయుచు బుట్టెను. అతఁడు జితవీర్యుని కనెను. అతఁడు రాజవృషభుఁడగు వృషధ్వజుని కనెను. అతఁడు శక్తివంతుఁడును నమల్లంఘనీయ శాసనుఁడును, విజయేచ్ఛువును, విరోధిభీషణుఁడును నైయుండెను. అతనికి ప్రగల్భుఁడు తనయుఁడయ్యెను. అతడు క్షితీశ మార్గాచరణమునందు ప్రగల్భుఁడు. అతఁడు తన ఖడ్గధారాజలముచేత వైరినారీకపోలస్థల రచిత పత్రభంగములను గడిగివైచెను. అతనికి ఏకపితాతపత్రతిలకుఁడును వీరుఁడును శ్రీనవితా స్వయంవృతపతియును నగు కోలాహలుఁడను కుమారుఁడు కలిగెను. అతఁడు గొప్పదగు గంగవాడి దేశమున కోలాహలమను పురమును (వైష్ణవాలయమును) విస్తృతవకాశముగల స్వర్గలోకదర్శన కుతూహలమున కవరోధముగా నుండునట్లు నిర్మించెను. అతని కుమారుఁడు విరోచనుఁడనువాఁడు శరాసనయష్టిని పట్టుకొని చోరబాధావివర్జితముగా భూమిని రక్షించెను. స్వశాసనదిక్కృతి ఎఱుఁగనివాఁడతఁడొక్కఁడే. కోలాహలపురీభుజులగు నా వంశపురాజులు (81) ఎనుబదియొక్కమంది పాలించిన పిదప వీరసింహుఁడనువాఁడు రాజయ్యెను. అతనికి కామార్ణవుఁడు, దానార్ణవుఁడు, గుణార్ణవుఁడు, మారసింహుఁడు, వజ్రహస్తుఁడు, అను నైదుగురు కుమారు లుదయించిరి. అంత కామార్ణవుడు తన రాజ్యమును పితృవ్యున కప్పగించి (తండ్రి సోదరుఁడు) దిగ్విజయమునకై నలుగురు సోదరులతో మహేంద్రగిరికిఁ బయనమయ్యెను. అచ్చట సురాసురసిద్ధసాధ్యకిరీటకోటినిఘృష్టమసృణ చరిత పీఠుఁడగు గోకర్ణస్వామి నారాధించి, నమస్కరించి, తత్ప్రసాదమున వృషభలాంఛనము నంది, సకల సామ్రాజ్య చిహ్నములను పొంది ప్రకాశించువాఁడై యా రాజు (కామార్ణవుఁడు) మహేంద్రాచల శిఖరమున దిగి యుధిష్ఠిరునివలె నలుగురు సోదరులతో ననుసరింపఁబడువాఁడై యుద్ధభూమిలో శబరాదిత్యుని చంపి, కాళింగదేశమును గ్రహించెను. ఆ దేశమునకు ఇంద్రుని పరిహసింపజాలు పురదంతాపురమను పట్టణము రాజధానిగా నుండెను. కామార్ణవుఁడు దానార్ణవునకు పురదంతాపురమును, గుణార్ణవునకు అంబవాడి విషయమును, మారసింహునకు సోదామండలమును వజ్రహస్తునకు కంటకావర్తమును ఇచ్చెను. ఈ విధముగా (36) ముప్పదియారు

సంవత్సరములు కామార్ణవుఁడు కళింగదేశమును పాలించెను. శ్రీమంతులును, అశేషభువనభూపాలమౌళి మాలాలంకారయశస్కులును అనవరతరాజ్యవినోదోపహసిత మహేంద్రులును, మహేంద్రాచలామల శిఖరప్రతిష్ఠితుఁడును, సకలభువన నిర్మాణైక సూత్రధారుఁడును నగు గోకర్ణస్వామియొక్క సమారాధనవలన పొందిన నిఖిలమనోరథులును అగు గాంగరాజులయొక్క కులము నలంకరించువాఁడై, విష్ణువువలె విక్రమముతో నాక్రాంతసకలమహీమండలుండగు కామార్ణవునియొక్క అనుజుఁడు దానార్ణవుఁడు నలుబది నాలుగు (44) సంవత్సరములు రాజ్యము చేసెను. అతని కుమారుఁడు రెండవ కామార్ణవుఁడు ఏబదియైదు (55) సంవత్సరములు రాజ్యము గావించెను అతనికి త్రివిష్టప తిరస్కారియగు నగర మను పేరి పురము రాజధానిగా నుండెను. మధూకవృక్షమునుండి పుట్టుటచేత లింగాకృతినున్న యీశ్వరునకు మధుకేశ్వరుఁడను పేరిడి ఆ నగరమందు నభంకషమగు నొక ప్రాసాదమును నిర్మించెను. ఆ ప్రాసాదపు ద్వారోర్ధ్వ ప్రదేశమందలి విచిత్రవస్త్రలతికాచిత్రములను చూచు దివౌకసులకు తమతమ భవనముల మీద (స్వర్గభవనములమీద) తిరస్కారభావము కలుగును. అతని కుమారుఁడు రణార్ణవుఁడు (5) ఐదు సంవత్సరములు భూమిని పాలించెను. అతని కుమారుఁడు రెండవ వజ్రహస్తుఁడు (15) పదిహేను సంవత్సరములు భూమిని పాలించెను. అతని సోదరుఁడు మూఁడవ కామార్ణవుఁడు భూమిని (21) ఇరువదియొక్క సంవత్సరములు పాలించెను. అతని కుమారుఁడు గుణార్ణవుఁడు (27) ఇరువదియేడు సంవత్సరములు భూమి నభివృద్ధికరముగఁ బాలించెను. అతని కుమారుఁడు పోతాంకుశుఁడు (15) పదిహేను సంవత్సరములు భూమిని నిస్సపత్నముగఁ జేసెను. పిదప నాతని సోదరుని కుమారుఁడు కలింగలాంకుశుఁడు (12) పన్నెండు సంవత్సరములు కలింగదేశము నలంకరించెను. పిదప నాతని పితృభ్రాతయగు గుండమహారాజు (7) ఏడుసంవత్సరములు భూమండలమండనుఁడయ్యెను. అతని సోదరుఁడు నాల్గవ కామార్ణవుఁడు (25) ఇరువదియైదు సంవత్సరములు భూమి ననుభవించెను. వారిద్దరికన్న చిన్నవాఁడగు వినయాదిత్యుఁడు మూఁడు (3) సంవత్సరములు భూమిని పాలించెను. పిదప వారిలో జ్యేష్ఠుఁడగు కామార్ణవుని కుమారుఁడు నాల్గవ వజ్రహస్తుఁడు ముప్పదియైదు (35) సంవత్సరములు పాలించెను. అతనిచే దానము చేయఁబడిన వేలకొలఁది ఏనుగుల దానవారిచేత భూమి పంకిలమయ్యెను. తరువాత నాతని సుతుఁడు పంచమ కామార్ణవుఁడు అర్ధసంవత్సరమును, పిదప నాతని సోదరుఁడు రెండవ గుండమహారాజు (3) మూఁడు సంవత్సరములు, అతని ద్వైమాతురుని సోదరుఁడగు (మారుతల్లి లేక రెండవ తల్లి) ఆరవ మధుకామార్ణవుఁడు (21) ఇరువదియొక్క సంవత్సరములు పాలించెను. పిదప నాతని నందనుఁడగు వజ్రహస్తుఁడు (30) ముప్పది సంవత్సరములు పాలించెను. ఆతని వర్ణనయందు:— గాంగకులమునం దుత్తముఁడును భువనానందకరుఁడును అగు నా వజ్రహస్తుని చంద్రకాంతివంటి కీర్తి దిక్చక్రవాళమున వ్యాపించగా తమ ఏనుగులను గుర్తుపట్టలేక దిగ్గజముల మావటీండ్రు వాని (దిగ్గజముల) కుంభస్థలములయందును పట్టకములం దట్టమైన సింధూరముతో పూయుచున్నారు. గుణవంతుఁడగు నాతనియందలి యనురాగముచేత హృదయముఖాబ్జములయందు శ్రీ సరస్వతులు ఉపవిష్టలై యతని కనుకూలలుగా నుండిరి. త్రిలింగనాథునికి వజ్రహస్తనామము కేవలము నామము కాక సార్థకమైనది. వజ్రహస్తుఁడుతప్ప మఱొక దేవుడు భూమియందు నడుచున్న వజ్రము నాన నోపును! అతని పుత్రుఁడు రాజరాజు. అష్టదమ సకు రాజు. ఆతని వర్ణనమునందు:—ఆ రాజు ముందు లక్ష్మిని జయించెను. యుద్ధోత్సాహముకలవాఁడై చోడరాజు కుమార్తెను వివాహమాడెను. వేంగిని వెంటనే వదలెను. అది ఉదయకాలపు టాకాశమువలె నుండెను. చోడరాజ్యమునందు విజయాదిత్యునికి పట్టము గట్టెను. ఆపన్నులకు పరమశరణ్యుఁడును, లక్ష్మీసంసేవ్యుఁడునునగు విజయాదిత్యుని పశ్చిమదిక్కునందు రాజును చేసెను. అతనికి పెద్ద కుమారుఁడు చోడగంగుఁడు. అతఁడు నిజభుజావిక్రమార్జితపారసత్త్వుఁడు. సత్యత్యాగైకసీమ. విమలతర యశశ్చంద్రికాధౌతలోకుఁడు. నాగుల్లంఘ్యప్రతాపుఁడు. శుభచరితనిధి. భాగ్యసౌభాగ్యరాశి. క్షోణీప్రాణాధినాథుఁడు. సకలరిపుమహోభంగకారియు నగువాఁడు.

(999) శకాబ్దములు నందరంధ్రగ్రహగణితమగు దాని యందు కుంభసంస్థమగుదినమందు రేవతీనక్షత్రయుక్తమైన లగ్నమందు గంగాన్వయమను తామరసవనమునకు దినకరుఁడును విశ్వవిశ్వంభరాచక్రమును రక్షించుటకు గాను సద్గుణనిధియు, నధిపుడునునగు చోడగంగుడు పట్టాభిషిక్తుఁడయ్యెను. శత్రుగర్వమును నాశనము చేయు అతని భుజదండయుగ్మకలితమై వీరలక్ష్మి భుజస్తంభద్వయనియంత్రితమగు కరిణీసాదృశ్యము నందుచున్నది. అతని పాదద్వంద్వము కోటిభృత్యుల మౌళుల సంపర్కము కలదై మధుపశ్రేణీసమాశ్రితమగు పద్మశోభను వహించుచున్నది. తూర్పుదిక్కున ముందుగా ఉత్కలపతిని రాజపీఠమునుంచి యుద్ధృతముగా, తరువాత పశ్చిమదిక్కున వేంగీశుని సుప్రతిష్ఠితునిచేసి వీరిద్దరి రాజ్యలక్ష్ములకు వందనమాలికను జయశ్రీ తోరణస్తంభములకువలె కట్టి దానివలన మహాకీర్తిని శ్రీ గంగచూడామణి యందికొనెను.

మహారాజ, రాజాధిరాజ, రాజపరమేశ్వర పరమభట్టారక, పరమవైష్ణవ, పరమబ్రహ్మణ్య, మాతాపితృపాదానుధ్యాతుఁడైన శ్రీ చోడగంగదేవుడు రాష్ట్రకూట ప్రముఖ పరివారముల నాహ్వానించి ఆజ్ఞాపించుచున్నాడు. విదితమగుగాక! మంత్రి పురోహిత సేనాపతి యువరాజ దౌవారికసమక్షమునం దీరీతిగా తెలుపఁబడినది.

చోడగంగు మహారాజాధిరాజా, క్షత్రియోత్తముం పారిటి మహేంద్రుఁడు. ఆయన భార్య గుణభూషణ, సుచరిత. శ్రీ చోడగంగు ప్రభునికి ఛాయానుగ అయినట్టిది. త్యాగశీలయు సత్యోన్నతయు నగు ఆమె అన్వర్థనామధేయ. వారిరువురికి కలిగిన సుపుత్రుఁడు శస్త్రాస్త్ర విద్యాప్రవీణుడు సరస్వతీ పుత్రుఁడైన శ్రీమత్కామార్ణవుడు. ఆచోడ గంగుడు తన ఆప్తభృత్యులకు ప్రీతితో కళింగదేశ మందలి ఎలద విషయమందు తన తండ్రి యశోభివృద్ధికి షోడశ గ్రామములను దానమిచ్చెను.


శకవర్షములు పంచాశదుత్తర సహస్రమున నెరియగు చోడగంగదేవుని విజయరాజ్య సంవత్సరమున పంచపంచాశదుత్కళదేశమున నివ్వెర అను రాజధానియందు మిధున కృష్ణ ద్వాదశి ఆదిత్యవారమున పూర్వాహ్ణమున ధారాపూర్వకముగా ఆచంద్ర తారార్కము సర్వభోగార్హమీయఁబడినది. ఇచ్చట మరి వేరు భావములేదు. అందుచేత ఇచట గ్రామ నామములు వ్రాయబడుచున్నవి. గోర్దణాలి వేలుము గోసేలు పరింకామ తాడివడ తొత్తడణ పిప్యాము గ్రుంపియము గందివడ నడుపలి క్రొవ్వడ వృద్ధిగ్రామము కంచరణ అనుచతుర్దశ గ్రామములు కను మద్ది, ముక్రాము, పల్పివాడ అనుమూఁడు గ్రామములు దేవభోగములుగా నివ్వగా మొత్తము పదునేడు గ్రామములగుచున్నవి. ఈగ్రామములకు పరిహద్దులు వ్రాయబడు చున్నవి

గోర్దణాలి:—పూర్వదిశను గర్త ఆగ్నేయముగా చింతచెట్లు పశ్చిమముగా కోణముగా గ్రుంపియము ముజబోడు, చెలువు, త్రికోణములోగల చింతచెట్లు, పడమరగల చింతచెట్టు, దక్షిణముగా తొత్తడ, గొర్ద్దివాడల మధ్యగల చింత, వెలగచెట్లున్న కలవు. తరువాత గ్రుంపియము నడుపల్లి, పల్పివాడల త్రికూటమునగల చింతచెట్లు గారచెట్లుగల భూమియున్న ప్రదత్తము. తదుపరి గందివడ అంతరం మధ్యగల సేతువు దానిదగ్గరనున్న గారచెట్లు, తరువాత నైఋతిలోగల గడుపల్లి, క్రొప్పల్లి మధ్య భూమిలోగల ఇలింది వృక్షములు ఎఱ్ఱ గన్నేరుచెట్లు, తరువాత గండివడ నడుపల్లి క్రొప్పల్లి త్రికూట ములోగల వాపీన్మలి పుట్టయున్న చింతచెట్లున్న తరువాత క్రొవ్వాడ, గండివడ, క్రొప్పల్లి త్రికూటము నందుగల చింతచెట్లు పుట్టలున్న పడమర తాడివడ. తాలండి, క్రొప్పల్లి త్రికూటమునగల రాతి గర్త, పులిగోరుచెట్లున్న ప్రక్కన చింతచెట్లు, దానికి పడమర క్రొవ్వాడగ్రామ, వృద్ధి త్రికూట ములలో చింత వెలగచెట్లు పుట్టలున్న ప్రక్కన రేంగాము, తాలండ, గ్రామము గ్రామముల త్రికూట ములలోగల ఇలింది వృక్షములు, రేంగాము గ్రామ గ్రామముల మధ్యగల చింతచెట్లు తరువాత—

వృద్ధిగ్రామముల త్రికూటములోగల తింత్రిణీ వృక్షములు, తరువాత ధవళమాడిద వృక్షములు అటుపిమ్మట మలుంగోలి గ్రామముల త్రికూట ములోగల తటాకము—తరువాత పాల్వాతి—రోంగాలి గ్రామముల మధ్యగల తింత్రిణీ వృక్షములు. తర్వాత గల పాలచెట్లు తరువాత చెలువు మధ్యగల మహాటక

పిత్స వృక్షములు తదుపరి మక్కోము అంగోలి పిరికాము గ్రామముల మధ్యగల తెల్ల ఎలుకచెట్లు తరువాత పాలచెట్లు, వాయవ్యముగ గొట్ట (గత్త) చిత్తాలండ-దేమ్య త్రికూటమునగల పర్వతము తరువాత కొండవేల-ఉత్తరముగ కనుమద్దికలుమడుగు గ్రామముల మధ్యగల పర్వతము, పల్వాడ, కలిమటు మదేలి-వాడ గ్రామముల త్రికూటమునగల పర్వతము. కొండగల పుట్టలు తరువాత మల్వాడలివాడల మధ్యగల చింతచెట్లు తరువాత వారింజచెట్లు ఈశాన్యమున దొంపూండి మవ్వాడ, వెలివాడల త్రికూటస్థలి వార్ష్మ దొరవూడి గ్రామముల మధ్య త్రికూటమున తింత్రిణీ వృక్షములు, వాటిప్రక్కనగల వెలుపులోగల పెద్దపుట్ట తరువాత చకస్థలి మటుపల్లి, మరుము దొరవూండి, గోర్దధి గ్రామాల త్రికూటస్థలిలో తింత్రిణీ ద్వయము-వేటుము గ్రామముల మధ్యమునగల పాలచెట్లు తరువాత పుట్టగల చింతచెట్టు, తరువాత. గోర్ద్ధి గ్రామము, వేటుము గ్రామముల త్రికూటముదగ్గఱగల తింత్రిణీ వృక్షములు-తరువాత గోరంధిలో గ్రామములమధ్యగల ఎత్తువేంపైగల గుల్మవృక్షములు, తరువాత ఆ ప్రదేశము ప్రక్కగల ఉగ్రగణ గోర్దధి పంప్యము గ్రామ త్రికూటమునందుగల తింత్రిణీ వృక్షసమూహములు-

తరువాత శాసనాంతమున సంప్రదాయానుసారముగ వ్రాయు శ్లోకములు. శాసనము చివర శాసనాధికారియగు భాస్కరభట్టుపేరు, శాసనలేఖకుడు శాసనాధికారి చాళుక్య గంగాచార్య జామాత మాంకవాచార్యుని పేరు పేర్కొనబడినవి.



కాలు కదపని అదృష్టం

శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి

"అమ్మగారండీ! అమ్మగారూ!" అంటూ గొల్లవాడు గేదెని తెచ్చి, వాకిట్లో నిలబెట్టి అర్ధగంటనించీ గొంతు చించుకొని అరుస్తున్నాడు. రాజామణికి ఆ పాలవాడి కేకలు, కలలోనికి మల్లె వినిపించుతున్నాయి. బద్ధకంగా అటు ఇటు వత్తిగిల్లి విసుక్కుంటూ, 'అబ్బ! వూ...' అంటూ దీర్ఘంగా మూలిగింది. 'ఏయ్! ఏమిటీ బద్ధకం? లే! లేచి, పాలు పితికించుకో! ఆరుగంటలు దాటుతున్నా, కాళ్ళు తన్నిపెట్టి, ముసుగుతన్ని పడుక్కునే ఆడదాన్ని, నిన్నొక్కర్తెనే చూశాను' అని పక్క మంచంమీద పడుక్కున్న రమణ విసుక్కున్నాడు. తన మటుకు తను కాళ్ళదగ్గర చెదిరిన దుప్పటిని గుండెలదాకా లాక్కుని, ఇంటి పైకప్పుకేసి చూస్తూనే వున్నాడు. 'అబ్బబ్బ! వెధవగోల! అప్పుడే తగలడ్డాడా!' అని గొణుక్కుంటూ లేచి, దబీదబీమని తలుపులు చప్పుడుచేస్తూ వంటింటిలోనికివెళ్ళి స్టీలు గ్లాసూ, స్టీలు గిన్నె తీసుకుని, వీధి వసారాలోనికి వచ్చింది రాజామణి. అప్పటికే గొల్లవాడు చెంబు నిండుకూ పాలు నురగవచ్చేలా పితికేశాడు వీధిగేటుకి ఒకప్రక్కగా గేదెని నిలబెట్టాడు వాడు గేదె 'చిట్టు బంగిడి' లోని చిట్టు పూర్తిచేసేసి, ఖాళీ బంగిడిని బరుకు బరుకూ నాకుతోంది. రాజామణి పాలు పితికేసి రెక్షిగా నించున్న గొల్లవాడిని చూసి నుదురు చిట్లించింది.

'అప్పుడే పితికేశావా? నీకెన్నిసార్లు చెప్పాను నేను లేచి ఖాళీచెంబు చూస్తేకాని పితకొద్దని? నీలా పాడుబుద్ధులు మీరు పోనిచ్చుకోరు. మేము ఎంత డబ్బు పోసినా సరే!' అంటూ కేకలేసింది.

'నీ ఝామునించీ అరుస్తున్నానమ్మా! ఎంతకీ రారాయె! గేదె చిట్టుదాగరాలో కలియబడ్డాది. ఆ కూసంతా కాజేసిందంటే 'పిరాలు' తాకనిస్తదా తల్లీ! కంగారుపడి పితికేశాను' అన్నాడు నమ్రతగా గొల్లవాడు. పైపై నురగవున్నది. జానెడు స్టీలుగ్లాసుతో నాలుగు గ్లాసులూ కొలిచిపోసాడు రాజామణి గిన్నెలో. పైన అర్ధగ్లాసుడు పాలు మిగిలాయ్. 'అంతా నురగతో కొలిచేసావు. ఆ కాసినీ ఒంపెయ్యి!' అంది మణి.

'అయ్యోతల్లీ! ఆ కాసిని వున్నయ్యా! పావులా పాలు అయ్యి' అంటూ చెంబు పుచ్చుకుని వెళ్ళిపోబోయాడు.

'పావులా పాల! దాంట్లో సగానికిసగం నీళ్ళు కలిపేసావు. అక్కణ్ణించి నేనులేచి చెంబుచూస్తేకాని పాలుపిండితే నేను పుచ్చుకోను ఒకసారి కేకవేసినట్లు వేసి ఉడుకూ ఉడుకూ పిండేస్తావు!' కోపంగా గట్టిగాఅంది, రాజామణి.

'అంత కోపం దేనికి తల్లీ! ఈ పాల కాసినీ మీరే తీసుకోండి! అయ్యాల ఒంట్లో జ్వరం తగిలి నట్టుండాది. కాఫీనీళ్ళు కాయించుకుందారని వుంచ్చాను ఆ పాలు! కూస్త కాఫీనీళ్ళు పోయించేండి' అంటూ, ఆ పాలు రాజామణి గిన్నెలోనికి వంచేసి, 'ఇస్స్! రామా!' అంటూ వసారాస్తంభానికి జేరబడి కూలబడ్డాడు గొల్లవాడు. పాలగిన్నె పుచ్చుకుని లోనికి వెళ్ళబోతూ యాధాలాపంగా పక్కింటి వసారాకేసి చూసింది రాజామణి. ఆమె చూపులు అక్కడ నిలబడ్డాయ్! ప్రక్కింటి వసారాలో లేత ఉదయపు చల్లని వెలుగుతో కూడిన నీరెండ పడుతూంది. ఆ ఎండ కాళ్ళమీదకు వచ్చేట్లు ఒక పేముకుర్చీలో కూర్చుంది జయమ్మ! పక్కన ఒక కుర్చీలో ఆమె భర్త కూర్చున్నాడు. ముందున్న చిన్న టీపాయ్ మీద ట్రేలో పింగాణీ కెటిలూ, కప్పులూ, సాసర్లూ వున్నాయి. ఆయన కెటిలులోని డికాక్షన్ కప్పుల్లో

నీకి వంపి, పాలూ, పంచదారా కలిపి, ఒక కప్పూ, సాసరూ, జయమ్మకిచ్చి, ఇంకోటి తానుతీసుకున్నాడు. మణివాళ్ళింటికీ, జయమ్మ యింటికీ మధ్యన, వాలు గడుగుల ఎత్తున సిమెంటు ప్రహరీగోడ వుంది. ఇళ్ళు బాగా ఎత్తున కట్టబడివుండటంవల్ల, ఒకళ్ళ వసారాలో నిలబడితే ఇంకొకళ్ళకి బాగా కనబడుతుంది. అందులో ప్రహరీగోడకి వసారాలకి, అయిదారు అడుగుల దూరంకన్నా ఎక్కువలేదు. దావా దీవా. ఒకింటిలోవాళ్ళు ఒకింటికి స్పష్టంగా కనబడుతారు. తూర్పుదిక్కుగా తలవాకిళ్ళున్న ఇళ్ళు అవి. అంచేత సూర్యోదయాలు ఎంతో ఆహ్లాదకరంగా వుంటాయి. రాజామణివాళ్ళు ఆ వూరు బదిలీ అయి వచ్చి పది రోజులయ్యింది. ఈ పది రోజులుగా, మణి ప్రక్కవాళ్ళని ఆట్టే గమనించలేదు. ఇల్లంతా సామాన్లు సర్దుకోవడం, హడావిడి సరిపోయింది. ఇవ్వాళ తీరిగ్గా వుండని, జయమ్మ వసారాకేసి చూస్తూ నిలబడిపోయింది. జయమ్మ హాయిగా, ప్రత్యూష పవనాలను అనుభవిస్తూ, భర్త చెప్పే కబుర్లకి, సున్నితంగా నవ్వుతూ, ఉదయపు కాఫీ తీసుకుంది. జయమ్మ పెద్దకూతురు, పది పదహారేళ్ళుంటాయి. వోణీలేసుకుంటోంది. హంసలా నడిచి వచ్చి ఖాళీ ట్రే తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి పేరు సుజాత. ఆమెకి సుజాతకాక ఇంకా ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూ వున్నారు. పన్నెండేళ్ళూ, ఆరేళ్ళ మధ్య పిల్లలు వాళ్ళు. తెల్లవారేసరికి చక్కగా స్నానాలుచేసి, శుభ్రమయినబట్టలు కట్టుకుని, వసారా చివరన జంపకానా పరుచుకొని చదువుకొంటూ వుంటారు. జయమ్మ భర్తకి తొమ్మిది గంటలయ్యేసరికల్లా జీప్ వస్తుంది. అందులో ఆయన వెళ్ళిపోతాడు. జయమ్మ చాలా నాజూకుగా, తెల్లగా, వెన్నెలదారంలా వుంటుంది. అయిదుగురు పిల్లల తల్లిలా వుండదు! చాలా ఖరీదైన చీరలు, పాము కుబుసంలా పాలమీగడలా ముట్టుకుంటే జారిపోయే చీరలు, గుప్పిటలో ఇమిడిపోయే చీరలు ధరిస్తుంది. ఆ చీరలవల్ల ఆ పొందికయైన శరీరానికే లావణ్యం వచ్చేదో! ఆమె శరీరపు వన్నెచేత, చీరలే సొగసుగా కన్పించేవో! ఏది ఏమయినా, పరస్పరాశ్రయంచేత చీరల సొగసూ, జయమ్మ శరీరపు లావణ్య దీప్తి పోటీలుపడుతూ చూపరుల కళ్ళను తమవైపు బలీయంగా ఆకర్షించుకునేవి!

'ఏమే! కాఫీ అయ్యిందా! లేదా?' అని రమణ కేక వేయటంతో రాజామణి బలవంతంగా కళ్ళు తిప్పుకుని విసవిసా లోపలికి వెళ్ళింది.

'లేదా?' మళ్ళీ అడిగాడు రమణ.

'ఒక్క అయిదు నిమిషాలుండండి' అంటూ కుంపటి రాజేసి, గిన్నెలో కాఫీ డికాక్షన్‌కి నీళ్ళు పెట్టింది. తర్వాత రెండు టూత్‌బ్రష్‌ల మీద వేప గింజంత టూత్‌పేస్టు వేసి, స్టీలు మరచెంబుతో నీళ్ళూ, స్టీలు టంగ్ క్లీనరూ... ముందు గదిలో టేబిలుమీద పెట్టి, తను ఇత్తడి చెంబుతో నీళ్ళు ముంచుకొని పెరట్లోకి ముఖం కడుక్కొందుకు వెళ్ళింది. రమణ వీధివసారాలో కూర్చుని ముఖం కడుక్కొని, చెంబు వంటింట్లోకి తెచ్చిస్తూ,

'తువ్వాలే?' అన్నాడు.

'ఆ తలుపుమీద వుంది. తీసుకోరాదూ?' అంది రాజామణి. తువ్వాలు తీసుకుని వంటింటి గడపమీద కూర్చుని ముఖం తుడుచుకుంటూ,

'ఇంకా నువ్వు ముఖం కడుక్కోలేదూ? అవునులే! అపరాహ్ణ పర్యంతం దంతధావన పుణ్యకాలః అన్నారు మన పెద్దలు! మరేం ఫరవాలేదు! ఇరవయినాలుగ్గంటల కాలంలో, రెండుసార్లు కాఫీలు, రెండుసార్లు భోజనాలు చేయలేకపోతామా?' సాధింపుగా అన్నాడు.

రాజామణి మూతి మూరెడు చేసుకుని, చెంగుతో ముఖం తుడుచుకుంటూ వచ్చి,

'అత్తగారు లేని లోటు లేకుండా, బాధించమంటే, బాధిస్తారు! కుంపటిమీద నీళ్ళు తెర్లుతున్నాయి కదా! రెండు చెంచాలు కాఫీగుండ వేసేసి, దింపేస్తే, మీ పెద్దలేమయినా చెరబోతారా? మీ కలక్టరుద్యోగం హోదా దిగిపోతుందా? కాస్త చేయి సాయిలాగా వుండరు. అన్నీ వేళకి అమరిపోవాలంటారు!' అంటూ కాఫీడికాక్షన్ తీయటం, కాఫీ కలపటంలో నిమగ్నురాలయింది.

'శభాష్! ఇవ్వాళ కాఫీ చేయకూడదా అంటావు! రేపు బియ్యం కడిగి పడేయకూడదా అంటావు! ఇంక వంటా, కాఫీ టిఫెన్లూ అన్నీ నేనే చేసేసుకుంటే, ఇంక నువ్వెందుకూ? తిని కూర్చుందుకా? నా కొచ్చే ముప్ఫై మూడువందల రూపాయిలూ ఎక్కడ కరగటం లేదో అని భయపడి, నిన్ను కట్టిపడేశారు నా ప్రాణానికి' అన్నాడు చిలిపిగా రవణ.

రవణకి రాజామణి మేనమామ కూతురు. మణి పుట్టి పుట్టగానే, 'మా రవిణిగాడికి పెళ్ళాం పుట్టింది' అంది రవణ తల్లి. మణి, రవణ పెళ్ళాంగానే పుట్టింది. పెళ్ళాంగానే పెరిగింది. మణి ఫోర్తుఫారం పరీక్షలు వ్రాయగానే రవణతో పెళ్ళి అయిపోయింది. ఇంక ఆపయిన చదువు జరగలేదు. నోములనీ, వ్రతాలనీ, పండగలనీ, పబ్బాలనీ, అత్తింటినించి పుట్టింటికీ, పుట్టింటినించి అత్తింటికీ తిరగటంతోనే సరిపోయింది. ఈలోగా రవణ ఉద్యోగాన్వేషణ ఫలించి, ఉద్యోగం దొరికింది. కొత్త సంసారం. ఆ వూరినించి ఈ వూరికీ. ఈ వూరినించి ఆ వూరికీ ట్రాన్స్‌ఫర్స్ అవుతూండటం. సంసారం ఝంఝాటంలో వచ్చే బంధువులూ, వెళ్ళే బంధువులూ, చుట్టరికాలూ, స్నేహాలూ, ఇంట్లో వున్నవీ లేనివీ చూసుకుంటూ, అతిథిసత్కారాలు జరుపుతూంటం— పిల్లలతో సరిపోయేది. కొత్తలో ఎప్పటికయినా— మెట్రిక్‌కు కట్టి పై చదువు చదువుకోవచ్చును— అన్న ఉత్సాహం వుండేది. రామరామా ఆవిడలో ఆ జీవకాంతి సన్నగిల్లింది. చైతన్యం గడ్డకట్టింది. ఒక్కొక్కపూట పనిమనిషి వచ్చేదికాదు. అంట్లగిన్నెల దగ్గర్నించీ తోముకోవలసివచ్చేది. కొత్తరోజుల్లో 'మనిల్లు మనవాకిలీ నేనే. ఇవన్నీ దిద్దుకు రావాలి!' అన్న స్వయంఅధికారం ఆమోదాన్ని కలిగించేది. ఇద్దరు పిల్లలు కలగటంతో నీరసించిపోయి 'ఈవెధవ సంసారం రొంపిలోంచి, నిష్కృతిగా ఎల్లా బయటపడగలను దేముడా!' అని నిరతమూ మధనపడేది. ఆవిడ పిల్లలు, వెంకటీ, మూరీడూ, కూడా ఆడపిల్లలే! వెంకటికి తొమ్మిదేళ్ళుంటాయి. నాలుగో క్లాసు చదూతోంది. మూరీడుకి ఏడు సంవత్సరాలుంటాయి. రెండో క్లాసు పుస్తకం తప్పులు తప్పులుగా చదూతుంది.

'అయితే వివాహమూ చేసి పెట్టాలనే అన్నమాట! పెళ్ళాడుతా! చాకిరీ కోసమా పెళ్ళాం? నాలుగు రూపాయలు పారేస్తే, దాసీది చేసిపెడుతుంది కదా పన్లు అన్నీను?' అంటూ కాఫీగ్లాసు తెచ్చి రవణ కిచ్చింది.

'కార్యేషు దాసీ అన్నారు కదుటోయ్ మరి?' అంటూ కాఫీగ్లాసు అందుకుని రెండు గుక్కలు కాఫీ పీల్చాడు. ఈలోగా పిల్లలు లేచివచ్చారు.

'అమ్మా పేస్టు!' అంటూ నించున్నారు.

'లేవారా చిట్టితల్లుల్లారా! అలమారలో క్రింది అరలోవున్నాయి. నీ బ్రష్షులు. పేస్టు అక్కడ్నేవున్నయ్. కాస్త తీసుకోలేరూ?' అంది మణి.

'మేము తీసుకుంటే ఆ బూరాని నాక్కేస్తున్నావు కాదుటే మరి!' అంటూ బిక్కమొఖాలేశారు.

'నాన్నారూ! పేస్టు అంతా ఇవతలికి తెచ్చేస్తే మళ్ళీ ఎల్లా పెట్టాలంట్రా!' అంది, జిజ్ఞాసగా మూరీడు.

'వసే! నువ్వెళ్ళి పేస్టు ఈయకపోతివా, వీళ్ళు ఎక్స్‌పెరిమెంటు చేసేస్తారు. అనక ఎన్నితిట్టినా లాభం వుండదు' అన్నాడు రవణ.

'అబ్బబ్బ! ఛస్తున్నా వెధవ సంతతోటి! పదండి!' అంటూ, ఇద్దరికీ, చెరోక చెంబుతో నీళ్ళూ, పేస్టూ ఇచ్చి నందివర్ధనంమొక్కదగ్గర ఒకళ్ళనీ, మందారం చెట్టుదగ్గర ఒకళ్ళనీ, ముఖాలు కడుక్కోమని ఆజ్ఞాపించి, కాఫీగ్లాసు దగ్గర కూలబడింది. ఒకగుక్క కాఫీ ఆత్రంగా తాగి

'ప్చ్! చప్పగా చల్లారిపోయింది' అని విసుక్కుంది. అప్పటికి రవణ, కాఫీ త్రాగటం పూర్తి చేసేడు.

'చిన్న వక్కముక్క పడెయ్యి!' అన్నాడు.

'లేచింది మొదలుగా అన్నీ అందించాలి! తిరగలేక నా కాళ్ళు నొప్పులు పడుతున్నాయి! మీకు తీరికపోతే చూచయినా నేర్చుకోరు ఆ ప్రక్కింటి జయమ్మగారిని చూడండి! కుర్చీ దిగదు ఆవిడ!

పెట్టివుంచాలి అంటారు. ఇందుకే మరి!' అని పొగ పీల్చుకుంటూ, లేచి అలమారు తీసి ఒక చిన్న పెట్టె ఇచ్చింది.

'మరి కొంత ఇచ్చేవేమిటే! అత్తమామా అడిగితే విసుక్కుంటావు. ఇచ్చేప్పుడే మరి కొంచెం ఈయకూడదూ! చెయ్యి మహాగట్టి! జయమ్మగారిని చూడకేం! నిక్షేపంలా మాపేమ చాలా బాగుంటారు. అల్లా కూర్చుంటే మర్యాదకు చేస్తావా? కుంపటి దగ్గరకొచ్చి, కాఫీ పొయ్యనే అంటేనే, కాళికాదేవి, అవతారం ఎత్తుతావు! అల్లా దర్జాగా, ఈజీచైర్‌లో కూర్చుని 'కాఫీ' అంటే, సుకుమారంగా, సుందరంగా అందాలు చిందుతూ వయ్యారాలు వలకబోస్తూ, ట్రేలో కాఫీకప్పులు తెచ్చిపెట్టి స్వీట్‌గా నవ్వే, ఘటాలా మనవి?' అన్నాడు రవణ.

'బాగుంది వరసం! ఇంకా అట్లలా మీరు కూర్చోవాలనుకుంటున్నారా! బుజ్జి తండ్రికి ఎంత కోరిక? నన్ను కూర్చోపెట్టలేదనే బాధ ఏమంతయినా లేదు. ఇక్కడికి అందింపులు చాలలేదు సోగ్గాడికి!' అంటూ కుంపటిమీద తెర్లుతూన్న పాలతో మళ్లీ వాయిగ్లాసుల వేడికాఫీ తయారుచేసింది మణి. కాఫీ గ్లాసు పెదాలమీదకు ఎత్తబోతుండగా,

'అమ్మగారూ అంటగిన్నెలు వెయ్యండి పొద్దెక్కిపోతది!' అంటూ పనిమనిషి పిలిచింది. మణి గ్లాసు క్రిందపెట్టి లేవబోతూండగా,

'వస్తోందిలే! ఈలోగా నువ్వా ముందుగది వూడ్చెయ్యి! నువ్వా కాఫీ తాగి మరి లేవోయ్! మళ్లీ చల్లారిపోయిందని గొణుక్కుంటావు!' అన్నాడు రవణ.

'ఇంతలో దాన్ని గదెందుకు వూడ్చమన్నారూ? అది అన్నీ ఈలోగా చక్కబెట్టేస్తుంది. డ్రాయరులో, పూలకని మార్చిన చిల్లర రూపాయివుంది. నా వానీ వుంది కొంత 'ఆయ్' వెళ్ళి ఆ ముందుగుమ్మంలో వుంచొండి!' అంది.

'దానికి, నేను వింటుంటే సిగ్గువేస్తుంటదేమోనే!' అన్నాడు పక్కముక్క పట్టుకు ఘటుకూ నములుకుంటూను, రవణ.

'సిగ్గూ సింగారం ఏమీలేదు. లేచిపోయిని మప్పిపెట్టకండి! వెళ్ళండి! అది గదిలో దూరినట్లుంది!' అంది మణి.

'అబ్బబ్బ! నీ నెత్తిమీద తేలువుందంటే, నీ చేత్తోనే తీసెయ్యి అందట! నీలాంటి ఇల్లాలే! నాకే పురమాయిస్తావు నమ్మ!' అంటూ లేచివెళ్లాడు రవణ.

'అమ్మా! కాఫీ' అంటూ వొచ్చేరు పిల్లలు.

'రండి!' అంటూ పిల్లలకి కూడా కాఫీ ఇచ్చి, అంట్లగిన్నెలు పరిశుభ్రపడెయ్యటంలో నిమగ్నమయింది.

2

సాయంకాలం. నాలుగ్గంటలవేళ. మల్లెపూలవాడు వచ్చేడు. వసారాలో కూర్చుని, తీరిగ్గా మల్లె మొగ్గలు ఎంచుతోంది రాజామణి. 'ఎల్లా తీసుకుంటున్నారు పిన్నిగారూ పూలు?' అంటూ సుజాత వొచ్చింది. మణివాళ్ళు వచ్చిన వారంపదిరోజుల్నించీ ఆ పిల్ల చూస్తూనేవుంది. ఈరోజు మాటకలిపి స్నేహం చేయటానికి వొచ్చింది. 'డొక్కు ఇరవయి పైసలు' అంటూ గవ్వలాంటి మొగ్గల్ని ఎంచి, డొక్కులోకి పోసింది మణి. పూలుకొలిచే డొక్కు, చిన్న వెన్‌కేఫ్ డబ్బా అంత వుంటుంది.

'మాక్కూడా రెండు డొక్కులు ఎంచండి పిన్నిగారూ! డబ్బులు తీసుకొనిపస్తా!' అంటూ లేచి, పరుగెత్తింది. సుజాత మణివాళ్లకి కూడా ఎంచింది పూలు! డబ్బులు తీసుకుని అబ్బి వెళ్లిపోయేక పూలు చెండు గుచ్చుతూ అడిగింది మణి సుజాతని. 'ఏం చదూతూన్నావమ్మాయ్?'

'ఫిఫ్త్‌ఫారం ప్యాసయి మానేసానండీ!' అంది సుజాత పొందిగ్గా కూర్చుంది. ఆ పిల్ల తెల్లగా, సన్నగా, నాజూకుగా వుంది. చక్కటి పట్టుపరికిణీలు, పల్చటి జార్జెటు వోణీలు. వేసుకుంటూవుంటుంది ఆ అమ్మాయి.

'ఎందుకు మానేసావ్? బి.ఏ. దాకా చదూకోలేకపోయేవా?' అంది మణి. మణికి బి. ఏ. ప్యాసు కావాలని మహాకోరికగా వుండేది. అందేత ఎవరయినా, చదూకున్నవాళ్లంటే గొప్ప సరదాగా వుంటుంది.

'మా అమ్మగారు బి. ఏ. ప్యాసు అయినారండీ! నాకు ఇంట్లోనే ప్రయివేటు పెట్టించి, చదువు చెప్పిస్తున్నారు. నేను ఇంట్లో లేకపోతే మా చెల్లెలూ, తమ్ముళ్ళూ అల్లరి చేసేస్తారు. బిన్నగా చదూకోరు! ఆయావి పెట్టినా, దానికి ఏదో టోకరా ఇచ్చేసి, అల్లరి చేస్తారు. అందుకని నేను ఇంట్లో వుండిపోవాల్సివచ్చింది.' అంది సుజాత.

'మీ అమ్మగారికి వంట పూర్తి అయ్యిందా?' అంది మణి.

'వంటపని అంతా మా బామ్మగారు చేస్తారు. మా అమ్మ చేయలేరు.' అంది సుజాత. ఆ పిల్లది చక్కటి తీయనైన గొంతు! వినయంగా మృదువుగా మాట్లాడుతుంది ఆ పిల్ల.

'సుజీ?' జయమ్మ తీయగా పిలిచింది.

'మా అమ్మగారు పిలుస్తున్నారండీ! నేను వెళ్తాను. మీరు మా ఇంటి కోసారి రాకూడదూ? మా అమ్మగారి కేమీ తోచదు. ఎవరన్నా వస్తే బాగుండును. కబుర్లు చెప్పుకుందికి. అంటూ వుంటారు' అంది సుజాత.

'అల్లాగేలే!' అంది మణి. సుజాత మల్లె మొగ్గల్ని చెంగులో పోసుకుని వెళ్ళిపోయింది.

'హుఁ! అదృష్టవంతురాలు! వంటకి అత్తగారు, కాఫీకి భర్తగారు, అలంకరణకి, పిల్లలు! పుట్టుభోగి! అంటూంటారు ఇల్లాంటివాళ్ళనే కాబోలు! సౌందర్యవతి! విద్యావతి! డబ్బుకూడా బాగానే వుంది కాబోలు! ఇంక ఇంటిల్లిపాదీ అడుగులకి మడుగులు వత్తటంలో ఆశ్చర్యం ఏముంది? కాలు కదపకుండా, జరిపించుకుంటోంది. ఆ పిల్లమూడు, ఎంతజాణో! వాళ్ళమ్మగారికి, ఏమీ తోచదుట! అంచేత ఆ మహారాణిని ఎంటర్‌టయిన్‌మెంటు చేయటానికి, తను వెళ్ళాలిట. ఏం చమత్కారి? పూర్వం మహారాజులకి వేడుక చెలికాళ్ళూ, మహారాణులకి, వాళ్ళ తాపోపశమనం నిమిత్తం, గాయనీమణులూ నాట్యకత్తెలూ వుండే వాళ్ళట! అల్లాగ తను వాళ్ళమ్మగారికి చెలికత్తెలా వుంటే బాగుంటుందనుకొంది కాబోలు!' అనుకుంది, మణి. పూలన్నిగుచ్చేక, పెద్ద చెండు, తనుమడిచి జడలో పెట్టుకుని, పిల్లలిద్దరికీ, జానెడు జానెడు చెండు అట్టేపెట్టి, పిల్లల్ని కేకేసింది. వెంకటి, సూరీడూ, ఎప్పుడు నేస్తంకలిపారో అప్పుడే జయమ్మ గారింటికి జేరిపోయేరు. పిల్లలు ఎంతకీ, పలక్కపోయేసరికి మణికి విసుగు పుట్టింది.

'ఛీ ఛీ! వెధవ పిల్లలు! ఎక్కడ చచ్చేరో!' అనుకుంటూ, విటారుగా, నిలబడింది. పిల్లలు ఆటలాడుతూ కన్పించారు. సుజాత పెద్ద పెద్ద మొగ్గలన్నీ మాలగా కట్టి, తల్లికి ఇచ్చింది. చిన్న దండ తను జెడలో పెట్టుకుంది. సుజాత చిన్న పిల్లల్లో ఒక పిల్లకి బాబ్‌డ్ హెయిర్! జయమ్మ చక్కగా సిగ జుట్టుకొంది. మాల అందంగా సిగచుట్టూ అమర్చు కొంది. తెల్లని పాలమీగడలాంటి జరీచీర, తెల్లని ఫుల్‌వాయిల్ బ్లవుజూ ధరించింది. పిల్లలు ఆడుకుంటూంటే, సంతోషంతో వెలిగి పోతూ చూస్తూ కూర్చుంది, ఠీవిగా జయమ్మ!

'జడలేస్తాను రండర్రా!' అని పిలచింది మణి. వెంకటీ సూరీడూ తల్లి పిలవగానే పరుగెట్టుకుని వొచ్చారు. దువ్వెన తీసుకుని పిల్లలకి తలదువ్వటం ప్రారంభించింది మణి. ఇద్దరికీ కూడా వొత్తుగా, బారెడు, పొడుగు జుట్టువుంది. సూరీడు కట్టు, వంకులు తిరిగి వుంటుంది. సూరీడుకు గట్టిగా బిగించి, రెండు అల్లులు అల్లి, పూలుముక్క బిగించేస్తే మిగతాజుట్టుఅంతా, వంకులు తిరిగి, గుత్తిగా, అందంగా వుంటుంది. దానికి ఎప్పుడూ అల్లానే వేస్తుంది, మణి, జడ. వెంకటి జుట్టు సాఫీగా వుంటుంది. దానికి చివరదాకా అల్లేసి, పూలు ముక్క బిగించేస్తుంది. రిబ్బన్లు ఎన్నికొన్నా పారేసుకొంటారు వాళ్ళు. లేకపోతే మురికెత్తిపోయి, వుతికితే వెలిసిపోయి అసహ్యంగా వుంటాయి. అంచేత రిబ్బన్లు కొన్నా ఏ పండగలప్పుడో పెడుతూ వుంటుంది మణి.

'అమ్మా మ్మా! నాకు రెండు జళ్ళెయ్యవ్' అంది వెంకటి.

'ఛ! ఏం బాగుండవు! నీ జుట్టు పొడుగు. సన్నగా తోకల్లా వుంటాయి' అంది మణి.

'పొడుగు అయితే కత్తిరించేయకూడదూ? వాళ్ల 'సుభా'కి చూడు. ఇంచక్కా, రెండు జళ్లేస్తారు. చక్కటి చేతుల్లేని, గౌన్లు తొడుగుతారు. నాకేమో వెధవ పావడాలు, జాకెట్లు! నేను తొడుక్కోను బాబా!' అంటూ కాళ్లు బారజాపింది. ఆ పిల్ల కదలటంతో జడ వంకర వచ్చింది. మణికి కోపం వచ్చి, ఒక్క మొట్టు మొట్టింది. దానితో వెంకటి ఇంకా గింజాకుంటూ

'ఏమన్నా అంటే కొట్టావ్! నీకు పాషనేం తెలీదు. అందరు రెండు జళ్లేసుకుని, గౌన్లేసు కుంటూంటే నాకు సరదా వుండదాయేం? అంతా నన్ను వెక్కిరిస్తున్నారు. పేరుకూడ బావూలేదు' అంది.

'నీ పేరుకేం? చక్కని పేరు, వెంకటలక్ష్మి. అని! దానికేం వొచ్చింది? నిక్షేపంలా వుంటే?' అంది మణి.

'నువ్వేమో 'లక్ష్మి' అని అల్లా పిలుస్తావా? వెంకటీ వెంకటీ అంటావు. దాంతో వాళ్ల సుభా నవ్వి, అదేం పేరు? వెంకట్ సంకటీ అని అంటూ ఏడిపించుతూంది.' ఆపిల్ల కళ్లమ్మట నీళ్లూరాలాయ్.

'నా పేరూ బావులేదు! వాళ్ల సుభా నన్ను ఎక్కిరించింది. 'నూరీ నూరీ చుంచెలుకా, మా ఇంటి కొస్తే, మంచెలుకా' అంటూ ఒకటేపాడింది' అంది నసుగుతూ నూరీడు.

'నీ పేరు బాగానేవుంది. సూర్యలక్ష్మి అని. నా పేరే బొత్తిగా బావులేదు.' అంది వెంకటి. ఆపిల్ల జడ పూర్తి అయ్యింది. తల్లి తీస్తున్న పూల దండచూసి

'నాకంత చిన్నదండా? అన్ని పూలూ నువ్వే పెట్టేసుకుంటావు. నువ్వెప్పుడూ ఇంతే! నా కొద్దు ఆ దండ! అదీ నువ్వే పెట్టేసుకో!' అంది వెంకటి.

'నాకూ చిన్నదండే వుణ్నిచ్చింది. అమ్మా మరేమో నాకు పూలు జడమీద కుట్టాన్నావు, మరెప్పుడు కుట్టావ్?' అంది నూరీడు.

'కుట్టాన్లే! ఆడగంటలు చేయిస్తున్నాగా! అవి వచ్చాక, కుట్టాను. సుజా వాళ్లమ్మగారు చూడు. ఎన్ని పూలు పెట్టుకున్నారో? వాళ్లు అల్లా నసుగు తున్నారా? మీ రూరికే గోలచేసేస్తారు.' అంది మణి.

'సుభా వాళ్లమ్మగారు మంచివారు! నీలా తిట్టారేమిటి? వాళ్లింట్లో బోలెడు పళ్లూ బిస్కట్లూ వుంటాయి. అవి సుభావాళ్లు ఇష్ట మొచ్చినన్ని తినుకుంటారు. ఆవిడ ఏమీ అనరు. నువ్వు మమ్మల్ని చేగోడీలే తీయనీయవ్!' అంది విసుక్కారంగా వెంకటి.

'వాళ్లూ మాగూడా పెడ్తారు. మొన్న ఎర్రటి పండేదో కోసిపెట్టారు వాళ్ల నాన్నారు. ఎంత బాగుందో! తియ్యగా వుంది.' అంటూ నాలిక చప్పరించుకుంది నూరీడు.

'వాళ్లు ఏ మన్నాతినే వేళకి, వోళ్లు తెరుచుకు, కూర్చోకూడదు. ఇవతలికి వచ్చేయాలి! ఏడుపు కొట్టుముఖాలు చూసి ఇంత పడేస్తారు. మరీ అన్నమానూ, ఆ కలిగిన వాళ్లిళ్లమ్మట దేకుతూంటే ఏం బాగుంటుందీ? పాయంకాలాలు, ఒక అరగంట ఆడుకుంటే ఫరవాలేదు. వెధవపాడు అలవాట్లు వచ్చాయి మీకు? పదండి ముఖాలు కడుక్కుని రండి! బొట్లూ కాటుకా పెడతాను' అంటూ లేచింది మణి.

3

ఆయిదారు రోజులు గడిచాయి. ఈలోగా రెండు మూడు తడవలు, సుజాత మణివద్దకి వచ్చింది. మణిదగ్గర క్రాస్‌స్టిచ్‌లో రెండు నెమళ్లు ఎదురు బొదురుగా వించున్న డిజైన్‌వున్న, డోరు కర్టెన్ వుంది. ఆ డిజైను, చిన్నదిచేసి, కుట్టు కోవటం, నేర్చుకుంటోంది, సుజాత. ఒకరోజు, పాయంకాలం, వసారాలోనికి వచ్చి నిలబడింది మణి.

'పిన్నిగారూ! ఇటు గోడవద్దకు రండి!' అంటూ సుజాత పిలిచింది.

'ఏవమ్మాయ్?' అంటూ సరిహద్దు వద్దకు వెళ్లింది.

'మా అమ్మగారు పిలుస్తున్నారు!' అంది సుజాత.

'ఏమండీ వంటకి వేళయిందేమిటి?' అని పలకరించింది, జయమ్మ.

'ఇప్పట్నించీ చేయనులెండి! చల్లారిపోతే వారు తినరు' అంది మణి.

'అయితే, ఒకసారి రండి! నాకేం తోచటం లేదు' అంది జయమ్మ. 'మణి'కి లోపల్లోపల వాళ్ల ఇల్లుఅదీ చూడాలని, మహాముచ్చటగా వుంది. ఆహ్వానం కోరుకోకుండానే లభించింది. కాదనట మెందుకు? తలుపులు జేరవేసి వాళ్లింటికి వెళ్లింది. ఎదురుగ్గా ఆమె భర్త కూర్చునే కుర్చీచూపించి,

'కూర్చోండి!' అంది జయమ్మ. మణి కూర్చుంది.

'ఈ మధ్యనే వచ్చారల్లే వుంది' అంటూ సంభాషణ కుపక్రమించింది, జయమ్మ.

'అవునండీ! మీ ఇల్లు స్వంతమే అను కుంటాను' అంది మణి.

'ఆఁ! ఈ ఇల్లు మాస్వంత ఇల్లే! ఆయన ఇంక అయిదారేళ్లల్లో రిటయిరయిపోతారు. అంచేత ఇక్కడే స్థిరపడిపోయేము.' అంది జయమ్మ.

'మేమింకా బోలెడు వూళ్లు తిరగాలి! కొత్త వూరునలిగి, నలుగురూ, పరిచయం కాగానే ఇంకో వూరు ట్రాన్స్ఫరు అవుతూ వుంటుంది. నాలుగు వూళ్లూ, చూస్తాం అనే సంతోషం వున్నా, ఈ సామాన్లు అన్నీ తర్లించుకుని, కొత్తవూళ్లో, ఇల్లూ వాకిలీ సర్దుకునే టప్పటికి, తల ప్రాణం తోకకివస్తుంది.' అంటూ మణి ఇల్లు నలువైపులా పరకాయించి చూసింది. వసారా చివరిమెట్టుకి, అయిదారు అడుగులు ఇటూ అటూగా, పోకచెట్లు వున్నాయి. వీధిగేటు కిరువైపులా, రకరకాల క్రోటను మొక్కలు ముద్దబంతిపూలచెట్లూ వున్నాయి. కాంపౌండు గోడమట్టూ, డిశంబరు పూలమొక్కలూ చామంతిగోలేలూ వున్నాయి. వసారాలోకి చల్లటిగాలి వీస్తూ, పున్నమి రాత్రుళ్లు, వెన్నెల వెలుగు నింపుతూ ఆహ్లాదకరంగా వుంటుంది. ప్రమోద భరితమైన ఆ పచ్చనితోట చూస్తూండి పోయింది మణి. సుజాత ట్రేలో కాఫీ కప్పులు పట్టుకొని వచ్చింది.

'ఇప్పుడెందుకిమ్మాయ్! ఇరుగూపొరుగూగా వున్నవాళ్లం, కాస్త ఖాళీ వుంటే కబుర్లు చెప్పు కుందుకు జేరుతూనే వుంటాం. మాకీ అతిథి మర్యాద లెందుకు?' అంది మణి.

'వుత్త కాఫీయేగా? తీసుకోండి, సరదాపడి కలుపు కొచ్చింది' అంది జయమ్మ.

'మరటయితే, అస్తమానూ ఫ్రీగా రావటానికి, బిడియంగా వుంటుంది' అంది మణి.

'దానిదేముందండీ? కొన్నపాలా ఏమన్నానా? మా ఇంట్లో, రెండు గేదెల పాడివుంది. కొన వేతులూ, పాలూ నాకు సయించవు. అంచేత, నేను ఏ వూళ్లోవున్నా పాడి చేసేదాన్ని' అంది జయమ్మ.

'జరుగుతోంటే ఏవీ పడవు! జరుగుబాటు లేకపోతే సర్దుకపోతారు మరి' అనుకుంది, తనలో తాను మణి. కాస్సేపు ఆ మాటా ఈమాటా మాట్లాడుకున్నాక

'సుజీ! మన ఇల్లు చూపించు మణిగారికి!

అంది జయమ్మ. సుజాతతో మణి, లోపలికి వెళ్లింది. జయమ్మ అల్లానే కుర్చీకి జారబడి కళ్లు మూసుకుంది. ఇల్లంతా చూసింది మ . పెద్ద పెద్ద గదులు. ఖరీదయిన ఫర్నిచరుతో అధునాతనంగా, అలంకరించబడి వున్నాయి, మేడమీద, పేద్దహాలు, ఒక చిన్నగదీ, చుట్టూడాబా వున్నయ్. పెరడులో, కొబ్బరిచెట్లూ, మామిడిచెట్లూ, కొత్తగా వేసిన అంట్లు కాపటంటించి, పచ్చగా కలకల్లాడుతూ వున్నాయ్. గిలకల నూయిచుట్టూ నాలుగడుగుల వెడల్పున సిమెంటుచప్టా చేసివుంది. తులసికోట కావలగా, నందివర్ధనం, ముద్దమందార, గరుడ వర్ధనం, విరబూసివున్నాయ్. వంటింట్లో సుజాత బామ్మగారు, ఏవో కూరలు తరుగుతూ కూర్చున్నారు.

'అదృష్టవతి! కాలు కదపక్కర్లేకుండా, అందరూ ఆమెని మహారాణిలా చూస్తున్నారు. పూర్వ

కాలపువాళ్ళు, 'పండనిబువ్వా పడకనిబట్టా' కలిగి సుఖంగా వుండమ్మా' అని దీవించేవారు. ఆ కాలంలో, స్త్రీలు తీరిక సమయాల్లో ఎవళ్ళబట్టలకి సరిపడగా వాళ్ళు నూలు కూడా వడుక్కునేవారు కాబోలు! ఆకాలంలో వండుకోక్కర్లేకుండా బువ్వా వడుక్కోక్కర్లేకుండా బట్టా వచ్చేట్టయితే శ్రీమంతులక్రిందే లెక్క అయివుంటుంది. ఆ పూర్వకాలంనుంచే పుట్టి వుంటుంది ఈ దీవెన! ఈ ఇల్లాలికి అల్లానే జరుగుతోంది! కాలుకదపని అదృష్టం ఎంతమంది స్త్రీలకుందీ రోజుల్లో?' అనుకుంది మణి.

'ఈ పక్కింట్లో దిగారేమిటమ్మాయ్!' అంది బామ్మగారు.

'అవునండి!' అంది మణి. 'అక్కడున్న పీట వాల్చి కూర్చో అమ్మాయ్' అంది. మణి కూర్చుంది.

'ఎవరెవరుంటున్నారు' అన్నది బామ్మగారు.

'మా కుటుంబమే నండి. మేమిద్దరం, పిల్లలిద్దరూ. మీరు చూసేవుంటారు. ఆడుకుందుకు మీ ఇంటికి వస్తూనే వున్నారు.' అంది మణి.

'నీకు అత్తా మామా లేరా?' అంది బామ్మగారు.

'వున్నారు కానండి, వాళ్ళు మా పెద్దబావగారి దగ్గరే వుంటారు. వాళ్ళకి బోలెడంతమంది పిల్లలు. ఆవిడ, మా తోటికోడలు ఎప్పుడూ నీరసంగా వుంటూ వుంటారు. అంచేత అక్కడే వుండిపోయారు.' అంది మణి.

'అవును మరి పెద్ద సంసారాల్లో వెనకాసరా లేకపోతే కష్టంకాదూ! నాకూ ఇంకా ఇద్దరు కొడుకు లున్నారు. ఆ కోడళ్ళు నీలాగే చాకుల్లా పనిపాటలు చేసుకుంటూంటారు. చిన్నపిల్లలే! తుళ్ళుతూ, గెంతుతూ వుంటారు. ఒకదానికి, ముగ్గురూ, ఒకదానికి నలుగురూ పిల్లలున్నారు. మా దగ్గర నాలుగు రోజులన్నా వుండవు, అని సాధించుతారు! కానీ, నాకేదీ ఇక్కడే సరిపోతోం దాయె! వెళ్ళటమే కుదరటంలేదు! నువ్వెళ్ళితే ఎల్లానే అమ్మా! అంటాడు మా పెద్దాడు!' అంది బామ్మగారు.

'తల్లి తండ్రులకి, సాధారణంగా పెద్దవాళ్ళంటేనే మోజు వుంటుంది లెండి! ఇంటికి పెద్దాళ్ళు, పెద్దాళ్ళు అంటూ ఏడుస్తూ వాళ్ళకే పట్టం కడతారు. పెళ్ళిళ్ళుచేస్తే, ఇంటికి పెద్ద వాళ్ళవే చూసి చేయాలి. ఇంట్లో చిన్నవాళ్ళకిచ్చి చేస్తే, చిప్ప కర్రా చేతబట్టుకుని మనిళ్ళకే తయారవుతారు మళ్ళీనూ! తల్లితండ్రి కూచమ్మల్లా కూడబెట్టినదంతా, ఈ జ్యేష్ఠులు ద్రాష్టల్లా తయారయి మాచమ్మల్లా మాయం చేస్తారు. ఏమన్నా అంటే, తగాయిదాలకి తయారు. ఈ చిన్న కారు కోడళ్ళు! అంటారు' అంది మణి.

'నాకు అల్లాంటి భేదమేమీ లేదమ్మోయ్! నాకంతా సమానమే! నాకున్నదేదో ముగ్గురూ మూడు చెక్కలూచేసి తీసుకున్నారు. పిల్లాజెల్లాలో, వంటవాళ్ళమీద, దాయాలమీద, ఇంత సంసారం, పెట్టటం ఇష్టంలేక నేనే ఇక్కడ వున్నాను. మా పెద్దాడికా, నెంకీ ఇరవయిరోజులూ, క్యాంపులాయె! సుజాత చిన్నపిల్ల! ఒక్కర్తీ అన్నీ చూసుకోలేదు. అంచేత నేనే ఇల్లు కాలక్షేపం చేసేస్తున్నాను' అంది బామ్మగారు. సుజాత ఏదోపని జ్ఞాపకం వచ్చి, అవతలికి వెళ్ళింది. తనకితాను, స్త్రీ, ఎంత చదువుకున్నా, ఎంత సంస్కారంవుంది, అని వెన్ను చరుచుకున్నా, ఒకళ్ళని, పరిహసించి, వినోదించే, మనస్తత్వంనుంచి, ఎన్నటికీ తప్పుకోలేదు. ప్రతి చిన్న విషయానికి, తనస్థితిని ఎదుటివాళ్ళస్థితితో పోల్చి చూసుకుని, తనకి జరగని సౌఖ్యాలు, వాళ్ళకి జరుగుతోంటే, శారీరకంగా, మానసికంగా కుళ్ళుకుని, పైకిమటుకి ఆ సౌఖ్యాలు ఎంతో అవమానకరమైనవిగా వేలెత్తి చూపి ఆనందించటం స్త్రీకి సహజగుణం! ఆ సహజగుణం మణిలోనూ వుంది. అంచేత సుజాత బయటికి వెళ్ళటంచూసి,

'అయినా బామ్మగారూ? నేను వచ్చినప్పట్నించీ చూస్తూనేవున్నా! పెద్దవారు వీరూ,

చిన్నపిల్లలు వాళ్లా, అంతపనీ చేస్తూంటే దర్జాగా కూర్చుంటారేమిటండీ! మీకోడలు! ఎంత వుద్యోగస్తుని భార్య అయినా, బొత్తిగా అంత కాలుకదపని గర్వమా? కాస్త కూరావారా, తరిగి ఇచ్చినట్లా, పిల్లలిని పవరించినట్లా తిరగకూడదూ? అదే మా అత్తగారయితేనా, సాధించి సాధించి పోసేది. మీరు నిజంగా, దేవతామూర్తులు! కనుక వూరుకున్నారు! మా అత్తగారు వస్తారా? ఎంత చలికాలమైనా సరే, తలనిండా స్నానంచేసి వచ్చినట్లు, వండి పెట్టాల్సిందే! ఆమెగారు వూరుకున్నా వాళ్లబ్బాయి మటుకు, అమ్మచేత చేయిస్తున్నావా, అంటూ, వురి పెట్టినంతపని చేస్తారు.' అంది మణి, అక్కసుగా. బామ్మగారు కూరతరగటం ఆపింది. చెంగుతో వక్కపొరి ముఖంతుడుచుకుంది. తలవంచుకుంది.

'పాపం! మా బయ్యా బోలెడు పనిచేసేది! పిల్లల బట్టలు దగ్గర్నించీ కుట్టుకునేది. ఒక్క క్షణం కూడా కూర్చునేదికాదు మావాడి మాట్లు కూడా అదే కుట్టేది. మాట్లుకుట్టటం, రెంగు తారులో, రెండు నెలలువుండి నేర్చుకుని వచ్చింది. మిషనుమీద రకరకాల ఎంబ్రాయిడరీ పనులు చేసేది! ఏంచేయం? దేముడు చిన్నచూపు చూసాడు! ఏ లోటూలేకుండా, పరిపూర్ణంగా మనిషివుంటే, తన్ని మర్చిపోతారనీ, మొక్కులు మొక్కుకోరనీ, భయం అనుకుంటూ దేముడికి!'. ఆగి చెంగుతో మళ్లీ ముఖం తుడుచుకుంటూ,

'నాలుగేళ్లయింది. దానికాళ్లు పట్టేసి! నడవలేదు. ఏం రోగమో తెలీదు! వూరికే కుమిలి పోతూవుంటుంది. పిచ్చిది! మనిషికి కాళ్లూ కళ్లూ అన్నారు. ఇంక అవే ఉపయోగపడకపోతే బ్రతుకెందుకు? జీవచ్ఛవంలా!' సుజాత రావటంచూసి ఆపేసింది, బామ్మగారు. ఆమె కళ్లమ్మట నీళ్లూ రాలాయ్! మణి విస్తుబోయింది!'.



సర్వభరతార్థసార లక్షణ సంగ్రహ ప్రదీపిక

శ్రీ యల్లాప్రగడ వెంకటనారాయణ శర్మ

సర్వభరతార్థసార లక్షణ సంగ్రహ ప్రదీపిక అను తాళపత్ర గ్రంథము తూర్పు గోదావరి జిల్లాలోని తుని సంస్థానాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ వత్సవాయి వెంకట సూర్యనారాయణ జగపతి రాజబహద్దూర్ వారియొక్క ఆస్థాన గ్రంథాలయము నందున లభ్యమైయున్నది. ఈ గ్రంథము ప్రస్తుతమున శ్రీశ్రీశ్రీ రాజావారి ఆధీనములో నుండియున్నది.

దీనియందున మొత్తము 127 తాళ పత్రములు (తాటి ఆకులు వ్రాసినట్టివి) గలవు. ప్రతియొక్క పత్రమున్నూ రెండు వైపులను గూడ చక్కని సరళమైనట్టి సంస్కృత భాషలోనుండి, తెలుగులిపిలో వ్రాయబడియున్నది. ప్రతిపత్రమున్నూ సుమారుగా 8 లేక 9 పంక్తులవరకున్నూ వ్రాయబడియున్నది, గ్రంథమునకు చివరను కొంతభాగములందున ఆంధ్రములో తాళాక్షర కాలవివరణము వ్రాయబడియున్నది. చిట్టచివరను గ్రంథాంత్యము నందున 125 వ పత్రము చివరను— 'ఇతి శ్రీ వత్సాన్వయ సంభూత ముడుంబ వెంకట్రామ నృకంఠీరవాచార్య పరిష్కృత భరతశాస్త్రంబున తాళస్వరూప దీపికా వివరణం సంపూర్ణం—పార్థివ సంవత్సర పుష్య బహుళ (8) అష్టమీ బుధవారాన్కి ఆత్మార్థం వ్రాస్కున్నది.' —నృకంఠీరవాచార్యేణ—అని వున్నది. 'పాలకొండ' అని మరియొక చోటను వ్రాయబడియున్నది.

దీనికి తరువాతను ఇంకను, (మరల) రెండు పత్రములలో కొంత విషయము వ్రాయబడి యున్నది. ఆది—(భరతము—పరీక్షా వివరం) అని శీర్షిక గలదు. ప్రథమం—పతాక హస్తోత్పత్తి—అని మొదలుగాగలదు.

ఏతద్గ్రంథస్థ విషయములను యథామాతృకముగా గమనించి ఈ క్రిందను విశదీకరించి క్లుప్తముగా వ్రాయుచున్నాను.

ఏతద్గ్రంథకర్త శ్రీ వత్సాన్వయ సంభూతుండును ముడుంబ వెంకట్రామ నృకంఠీరవాచార్యులగారని గ్రంథాంతము నందుగల గద్యమును అనుసరించి తెలియుచున్నది. ఒక్కచోటను మాత్రము 'పాలకొండ' అని వ్రాసియున్నాడు. అందువల్లను ఈతడు పాలకొండ కాపురస్థుడై యుండవచ్చును. ఈ పాలకొండ అనెడి గ్రామము ప్రస్తుతమునగల శ్రీకాకుళము జిల్లాలోనిదిగా చెప్పబడుతూ ఉన్నది. అక్కడగల 'చీపురుపల్లి' ఎస్టేటుకు చెందియుండినట్టిది. ఈ చీపురుపల్లి ఎస్టేటు తూర్పు గోదావరి జిల్లాలోని 'తుని' రాజావారగు శ్రీశ్రీశ్రీ వత్సవాయి వెంకట సూర్యనారాయణ జగపతి రాజబహద్దూర్ వారికి చెంది యుండినట్టిది. వీరికి (ఈ తుని సంస్థానాధీశ్వరులకు) చెందినట్టివే పెద్దాపురం, చీపురుపల్లి, రామచంద్రపురం, తుని మొదలగునట్టివి. ఇవియన్నియునుకూడ క్షత్రియ ప్రభువులకు చెంది యుండినట్టివి. పెద్దాపురము, చీపురుపల్లి మొదలగునట్టి ఆస్థానాలు, ప్రస్తుతమున నామావశిష్టము లైపోయినందువల్లను ఆయాచోట్లను ఆయా సంస్థానముల యందువిగల పరి

కరములు, వస్త్రవాహనాదికములున్నూ, గ్రంథాలయముల యందలి గ్రంథములు, మొదలైనట్టివి అన్నియునూ ప్రస్తుతమున 'తుని' సంస్థానమునకు చేర్చబడి యుండినవి. ఇట్టివి అన్నియును గూడ ప్రస్తుతమున తుని సంస్థానమునందున భద్రపరచబడి యున్నవి. అట్టివాటిలోనిదే ఇదియును ఒకపూర్వపు తాళపత్రగ్రంథము. ఇది తుని సంస్థానము నందున భద్రపరచబడి యున్నది—

ఈ తాళపత్రగ్రంథమును తుని కాపురస్థులు, సంస్థాన ఆశ్రిత విద్వాంసులు సుప్రసిద్ధ సంగీత, వయొలిన్ వాద్యకులు, మన్మిత్రులును అగు శ్రీమాన్ తూపురాణి చినకృష్ణమాచార్యులుగారు శ్రీశ్రీశ్రీ రాజావారియొక్క పర్మిషన్ పొందినట్టివారై, ఆ తాళపత్రగ్రంథమును ఆస్థాన గ్రంథాలయమునుండి తెచ్చి నాకుఇచ్చి ఆ గ్రంథమును ఆమూలాగ్రముగా విమర్శనాదృష్టితో చదివి పరిశీలించి, అందుపై ఈ గ్రంథమును గురించి వ్యాఖ్యాన పూర్వకముగా గ్రంథవిమర్శనమును వ్రాయవలసినదిగా నాకు ఆదేశించి యుండిరి. అందుమీదటను శ్రీశ్రీశ్రీ రాజావారి యొక్క ఆదేశాన్ని మన్మిత్రులగు ఆచార్యులవారి యొక్క ఉద్దేశానుసారముగా గ్రహించి, తద్గ్రంథమును, సంపూర్ణముగా చదివి అందలి విషయము లంతటినిన్నీ అర్థము చేసికొని ఆ గ్రంథస్థ విషయములను గురించి కొంత 'నోట్సు' వ్రాసుకొని, గ్రంథభాగమును అంతటినిన్నీ విషయసేకరణ మొనరించియుంటిని.

ఈ గ్రంథమునందున నందికేశ్వరునియొక్క 'అభినయదర్పణమును (నందికేశ—భరతమును) అనుసరించి, కేవలమున్నూ హస్తలక్షణ వివరణములు సాకల్యముగానున్నూ సంపూర్ణముగానున్నూ వివరింపబడి, అవియన్నియును గూడ ఇతరగ్రంథ ఆధారముల ననుసరించి అధికారయుతములుగా ఈ గ్రంథము నందున చర్చింపబడి నిరూపింపబడియున్నవి. అటుల హస్తలక్షణాదికములను వివరించుటలో పూర్వపు మొదటి గ్రంథము గునట్టిదియును ఈ అభినయదర్పణ గ్రంథమునకు మాతృకయును అగునట్టి 'భరతార్ణవము' అనబడెడి పూర్వపు గ్రంథస్థ విషయములు గూడనూ సాధికారములుగా నిందు క్రోడీకరింపబడి చర్చింపబడి యుండియున్నవి. మరియు నింకనూ, వివిధములైనట్టి ప్రాచీన ఆచార్యుల (గురువుల) యొక్క మతములన్నియునుగూడ నిందు నిరూపింపబడియున్నవి. అట్టి యా పూర్వపుమతములు (అభిప్రాయములు):—1. నందికేశ్వరునిమతము, 2. నారద మతము, 3. బార్హస్పత్య (బృహస్పతి) మతము, 4. సర్వభరతార్థసంగ్రహమతము, 5. భరత మతము, 6. కుహళీయము, (అనగా కోహళాచార్యుని యొక్క మతము) — ఈ కోహళాచార్యుడు భరత—శిష్యులలో నొక్కరు. ఈ కోహళుడే 'సంగీతమేరు' యనెడి గ్రంథమును రచించి యుండినట్లుగా తెలియుచున్నది. ఈ కోహళాచార్యుని మతమునే ఈ గ్రంథి పరివ్యర్త 'కుహళీయము' అని పేర్కొని దానిని అధికారికముగా చూపించి యున్నాడు. ఈ కోహళుని గురించియే భరతాచార్యుడు తన — నాట్యశాస్త్ర గ్రంథములో చిట్టచివరను, 'ఇందు (ఈ నాట్య శాస్త్రము నందున) నేను (భరతాచార్యుడు) చెప్పక విడిచినట్టి విషయములు నాకు తరువాతను కోహళుడు 'చెప్పగలడు' అని చెప్పియుండెను (చూడు—భ. నా. శా. 36, 37 అధ్యాయములు). అందువల్లను భరతాచార్యునికి తరువాతను ఈ కోహళాచార్యుడు చాలా గొప్పవాడుగను ప్రామాణిక గ్రంథకర్తగను, చెప్పదగినట్టివాడు. ఇతడు సంగీత, నృత్యములు రెండింటిని గురించిన్నీ చెప్పియుండినట్టివాడు. ఈతడు రచించి యుండినట్టి గ్రంథమే, ఈ ప్రస్తుత గ్రంథమునందున అధికారికముగా చూపబడినట్టిదగు 'కుహళీయము' అనునది. కాని ఈ కోహళునియొక్క గ్రంథము ఏదియును గూడ ప్రస్తుతమున లభ్యముగా లేదు. కాని, ఈ కోహళుడు చెప్పియుండినట్టి విషయములను సంగీత, నృత్య గ్రంథముల యందున నుట్టంకించి అవి అధికారములుగా చాలచోట్లను చెప్పబడియున్నవి. ఈతనియొక్క గ్రంథమే పైనను చెప్పబడినట్టి 'కుహళీయము' అనునది.

ఇంకనూ ఈ గ్రంథ పరిష్కర్త తన గ్రంథము నందున అనేకములైనట్టి పూర్వపు గ్రంథాధికారము లను నిర్వచించి, విషయమును నిర్ధారణ చేసి యున్నాడు. ఇతడు భరతశాస్త్రము, నందికేశ్వరీయ మనెడి - భరతార్ణవము, అనబడే ప్రస్తుత 'అభినయ దర్పణమును (ఇది భరతార్ణవమునుండి సంక్షిప్తీక రింపబడి ఇంద్రునికి ఉపదేశింపబడి యుండినది) అనుసరించియున్నాడు. కాని, తదితరులగు కీర్తి ధరాదులయొక్క మతములను స్వీకరించి యుండలేదు. అంటే, ఈ కీర్తిధరుడు చెప్పియుండినట్టి రీతు లలో పతాక, త్రిపతాక హస్తములు రెండున్నూ తారు మారుగా చెప్పబడియున్నవి. ఆ విధముగనే కథాకళీ నృత్య విధానమునందున (కేరళీయందున) అనుసరింప బడుచూవున్నది. (వారికి హస్తలక్షణదీపిక అనెడి గ్రంథము ఆధారమైయున్నది). ఈ ప్రస్తుత గ్రంథమునందున దర్పణ శాస్త్రమునందున చెప్పబడి నట్టి హస్తరీతుల నన్నింటినిన్నీ యథాతథములుగా నిరూపించుచూ, వాటికి మతాంతరములుగానున్నూ, పాఠాంతరములుగానున్నూ ఇతర గ్రంథములనుండి ఆయా విషయములను ఉట్టంకించిన ప్రతియొక్క విషయాన్నిన్నీ సూక్ష్మార్థముగా నిరూపించి యుండెను. పాఠకునకు చెప్పినట్టి విషయమే మరల చెప్పియుండి నట్టి రీతిగా అనగా పునరుక్తముగా నుండినట్లుగా కనబడుతూ ఉండియున్ననూ, యథార్థమునకు దీర్ఘ ముగా నాలోచించి పరిశీలించి చూచినయెడల తద్విషయ మునే బలపరచుటకుగాను ఇతడు ఇతరుల గ్రంథముల యందలి విషయములను గూడ పునరుక్తములుగా (పాఠాంతరములుగా) చెప్పియుండెనని మనకు తెలియ గలదు. —

భరతాచార్యుడు చెప్పియుండినట్లు నాట్య సంబంధములగునట్టి కరణములు, మండలములు, చారులు మొదలగునట్టివి తదితర విషయములను నేటినిగూడను చెప్పియుండలేదు. హస్తలక్షణములను చెప్పి, శిరో. దృష్టి, గ్రీవా, భ్రూ, నేత్రభేదముల నన్నిటినిన్నీ వాటివాటి యొక్క నానారీతులు, విన్యాసములు మొదలగునట్టి వన్నియును నిర్వచించి యుండెను. వాటియొక్క వినియోగములను గూడ చెప్పియుండెను. మరియు నింకనూ, భరత శబ్ద ములను గూడ చర్చించి వాటికి ఆధారములగు నట్టివి ప్రాథమికములునూ అతిప్రాముఖ్యములును అగునట్టి 'త, ధిత్, తోం, నం' అనెడి శబ్ద ములను వాటియొక్క అర్థభావవిశేషములునూ వాటి యొక్క వ్యుత్పత్తులన్నూ, ఉపయోగములన్నూ అన్నింటినిన్నీ చక్కగా నిరూపించియున్నాడు. మరి యును అనేకులగు నట్టి పూర్వ గ్రంథకర్తలయొక్క సాంప్రదాయకములగు నట్టి మతములను చర్చించి చూపియున్నాడు. అట్టి యీ అధికారములన్నియును తదితర గ్రంథములయందున కనబడవు. మొత్తము మీదను అతడు చూపించియుండినట్టి అధికారములు, మతములు, అన్నియును చాలా ముఖ్యములైనట్టివిగానే కనుపడుచున్నది. గ్రంథాంత్యమునందున సంగీత విషయకముగా (22) ద్వావింశతి శ్రుతులు, సప్త స్వరములు, మొదలగు వాటియొక్క పుట్టుకలను, వాటివాటి యొక్క కుల, మత, ఆహార, విహార, భోజనాదికములనున్నూ వస్త్రాభరణాద్యలంకారముల నున్నూ చెప్పి, అవి పుట్టియుండినట్టి ద్వీపమును గూడ ఇతడు సక్రమముగా నిరూపించి యుండెను - మరియునూ, స్వరములయందున వాది, సంవాది, అను వాది, వివాది మొదలగునట్టి చతుర్విధ భేదములనున్నూ విశదీకరించి యుండెను. ఇంకనూ, అత్యంత ప్రముఖము లగునట్టి రాగములను కొన్నింటిని పేర్కొని వాటి యందున పుంరాగములను, స్త్రీరాగములను (భార్యలు లేక రాగిణులను) పుత్ర, మిత్ర, కళత్రాది రాగము లను గూడ వివరించి చెప్పియున్నాడు.—

తరువాతను, చిట్టచివరి అధ్యాయమునందున నీతడు తాళోత్పత్తిని గురించి విశదీకరించియుండెను. తరువాతను క్రమముగా సప్తతాళములను, వాటి యందలి జాతులను (పంచజాతులనున్నూ), గతులను, లయభేదములనున్నూ, చెప్పియుండెను. మరియును ఇతడు అందరు గ్రంథకర్తలున్నూ చెప్పియుండినట్టి రీతిగా లయగీతులకు వరుసగా త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణములనెడి పంచ (అయిదు) గతులను మాత్రమే గాక, ఇంకను మరియొకటి ఆరు అక్షరముల కాలవ్యవధి గలిగినట్టి 'విరామగతి' యనునొక ప్రత్యేకగతిని గూడ వివరించి, షట్ (ఆరు)

గతులను నిరూపించి యుండెను మరియును, సప్త తాళముల కున్నూ ఆయా జాతిభేదములను అనుసరించి వరుసక్రమముగా ప్రతియొక్క దానికిన్ని ప్రథమ, ద్వితీయ, చతుర్థ, పంచమ, షట్ కాలముల కనుగుణ ఆవర్త అక్షర కాల సంఖ్యలనుగూడ వరుసక్రమముగా తెలిపియున్నాడు. మరియును వాట్లకు వరుసగా ప్రతిదానికిన్ని-పాటము, శబ్దాక్షరములతో, (కొలిపింపుగా) ఉదాహరణములను గూడ ఇచ్చియున్నాడు ఇంకను సప్తతాళములయొక్క ఉత్పత్తిని చెప్పి వాటియొక్క అధిదేవతను కులమును ఋషిన్ని దానికిగల పరిచేష్ఠితంగునట్టి స్త్రీలమున్నూ చెప్పి ఆ తాళముయొక్క స్వరూపమును గూడ నానానేక వగుణ రూపములో నిర్ణయించి చూపియున్నాడు. మరియు నింకను సప్తతాళములే గాకను ఎనిమిదవ తాళముగా మరల 'ఆది' తాళమును గూడ చెప్పియుండెను

అనంతరమునందున, మార్దంగికులు, తదితర వాద్యకులయొక్కయు గుణావగుణములను గూడ తెలిపియున్నాడు. ఉత్తమ వాద్యకులయొక్క విధానమును చెప్పియుండెను. అట్టిరీతిగా ఉత్తమ వాద్యకులు కానట్టి వారిని కేవల 'చర్మఘాతకులు' అని పేర్కొని యుండెను. అంతటితో నీ గ్రంథమును సమాప్త మొనర్చి ఈ తాళాధ్యాయమునకు చివరను మరల గద్యమును (Colophon) 'ఇది శ్రీవత్సాన్వయ సంజాత ముదుంబ వెంకట్రామ నృకంఠీరవాచార్య పరిష్కృత భరత శాస్త్రంబున తాళస్వరూప దీపికా వివరణం సంపూర్ణం'-పార్థివ సంవత్సర పుష్యబహుళ (౮) (అష్టమి) బుధవారాన్కి—ఆత్మార్థం వ్రాస్కున్నది 'నృకంఠీరవాచార్యేణ'-అని వున్నది.

దీనినిబట్టి ఆతడు ఉండినట్టి కాలమును నిర్ణయము చేయుటకు తగినట్టి యాధారము రూఢముగా కనుపడదు. పార్థివ సంవత్సరము ఏ పార్థివయో ఇదమిత్థమని తెలియుట కవకాశము లేదు. మరియొక ప్రకరణములో 'వ్యయ సంవత్సరము అని వ్రాసియున్నాడు. శక సంవత్సరముగానీ, క్రీస్తు (శక) సంవత్సరముగానీ చెప్పియుండలేదు కాని, తుని ఆస్థానము వారిసిద్ధనుగల చారిత్రికాధారములనుబట్టి చూచినట్లయితే ఇది షుమారుగా 200 సంవత్సరములకంటెను క్రిందటిదిగానే తెలుస్తుంది కనుక పార్థివ సంవత్సరము వరుసగా (4) నాలుగు పర్యాయములు తిరిగి వచ్చి యుండవచ్చును. అందువల్లను ఇప్పటికి (4 x 60=240+22)=262 రెండువందల అరువది రెండు సంవత్సరముల క్రిందటను అయి యుండవచ్చును. అంటే షుమారుగా నిది 1967-262=1705 (క్రీ. శ.) అయియుండవచ్చును దీనికి సరియైనట్టిది (శాలివాహన) శక సంవత్సరము 1705-78=1627 (శాలివాహన శక) సంవత్సరము కావచ్చును. ఈ నృకంఠీరవాచార్యులు అప్పటివాడై యుండవచ్చును అలాకాకుండా పార్థివ సంవత్సరం వరుసగా మూడు పర్యాయములు మాత్రమే తిరిగివచ్చి యుండినట్లుగా ఎంచినచో 3 x 60=180+22=202 రెండువందల రెండు సంవత్సరములు కావచ్చును అంటే 1967-202=1765 (A. D.) క్రీస్తుశకపు సంవత్సరము కావచ్చును. దీనికి సరియైనట్టి శాలివాహన శకపు సంవత్సరము 1765-78=1687 (శాలివాహన శకము) సంవత్సరము కావచ్చును. ఇది త్యాగరాజని పుట్టుకకంటెను (1767 క్రీ. శ.) కూడ నింకను పూర్వము రెండు సంవత్సరములు క్రిందటనే అయి యుండవచ్చును. కాని ఇట్లనుటకు అవకాశములేదు. ఎట్లయినను, రెండు శతాబ్దములకంటెను పూర్వపు వాడని మనకు తెలియగలదు. ఈయన చక్కని సంస్కృత ఆంధ్ర భాషా పాండిత్యము గలవాడని తెలుస్తుంది. సంగీత నాట్యకళలు రెండింటియందున గూడను సంపూర్ణ పరిజ్ఞానానుభవములు గలవాడని తెలుస్తుంది. వీరిని గురించిగానీ వీరియొక్క వంశీయులను గురించిగానీ ప్రస్తుతమునందున వివరముగా తెలియుటకు అవకాశము లేదు. ముదుంబవారు ఆంధ్ర దేశమునందంతటను చాలమంది ఉండియున్నను వీరిని గురించి తెలిపి చెప్పేవారు ఎవ్వరును లేరు. శ్రీకాకుళము జిల్లాలోనిదగు 'పాలకొండ' ప్రాంతము నందున విచారించినచో ఏమైనను కొంతవరకు తెలియవచ్చునేమో తెలియదు. ఏమైనను ఈయన

యొనర్చియుండినట్టి కృషి ఎంతయును శ్లాఘనీయ మైనట్టిదిగా తెలుస్తుంది.

ఇంకను ఈతడు ఈ గ్రంథస్థ విషయములలో నృత్త నృత్య నాట్య విధానములకున్నూ అందుకు అరు లగునట్టి పాత్రలమన్నూ, నాయకీ నాయకులు, సభానాయక, (ప్రభువు), మంత్రి, సభాసదులు సభాసప్తాంగ లక్షణాదిక వివరణముల నన్నింటినిన్నీ చెప్పియున్నాడు. ఆయా పాత్రల యొక్క లక్షణాదికములను, గుణావగుణములు, అర్హతా నర్హతలు అన్నింటినిన్నీ చెప్పియుండెను. మరియు నింకనూ:—

మృదంగ లక్షణమునందున దానియొక్క ఉత్పత్తి, నిర్మాణ విధానమూ, వాద్య విధానము, సాహిత్య ప్రాశస్త్యము, వామ, దక్షిణముఖములయొక్క వాద్య వివరణము; దోషములు, ఉత్తమ వాద్య విధానము, మొదలగునట్టి విషయములు చెప్పియుండెను. ఇతర గ్రంథములయందున లేనట్టి విషయములను గూడ కొన్నింటిని ఈ గ్రంథకర్త పూర్వపు గ్రంథములనుండి నిరూపించి యుదాహరించి చెప్పియున్నాడు. ఇందు చెప్పినట్టి విషయములుగాకను తక్కిన విషయములు ఇతర గ్రంథములయందున చూడవచ్చునని చెప్పియుండెను.

ఈ గ్రంథకర్త చెప్పియుండినట్టి రీతిగా అప్పటి ఆ కాలము నాటికి తాళ విషయికముగా షట్ (ఆరు) కాలములయందున్నూ గాన మొనర్చునట్టి యాచారము సాంప్రదాయము ఉండినట్లుగా తెలియుచున్నది. ఇది ఇంచుమించుగా షట్కాల గోవింద మారార్ కాలమునకు చెందియుండవచ్చును. గోవింద మారార్ షట్ కాలములు పాడెడివారని గొప్పగా ప్రతీతి. కనుకను అప్పటి కాలమునకు ఇంకనూ పూర్వమునుండిన్నీ ఆరు కాలములు పాడెడివారని తెలియగలదు. తద్విధముగనే వాద్యకులుగూడను షట్ కాలములయందున్ను వాద్య మొనర్చుచుండెడివారు అని తెలియగలదు. అది క్రమముగా కాలక్రమేణా ఇప్పటి ఈనా కాలమునకు త్రికాలములుమాత్రమే గానమొనర్చెడి సాంప్రదాయముగా మారియున్నది. ఈ నాటి కాలమున త్రికాల ములకంటెను పైనను పాడెడివారు అరుదేనని చెప్పవచ్చును—మరియునూ —

వీరి కాలము నాటికి పల్లవులు పాడెడి యాచారము ప్రచారములోనికి వచ్చియుండినట్లుగా తెలియుచున్నది. షట్ కాలములవరకున్నూ అన్ని తాళముల కున్నూ ఆవర్త అక్షర కాల విలువలనుచెప్పి చివరకు 'ఈ విధముగా పల్లవులయందున పాడుకొనదగును.' అని చెప్పియున్నాడు—మరియును తాళములు అన్నింటికిన్నీ వరుసగా ప్రతిజాతిననుసరించిన్నీ—ప్రతి యొక్క ఆవర్తమునకున్నూ ప్రథమ కాలము మొదలు ఆరవ కాలమువరకున్నూ అక్షర కాల సంఖ్యా విలువలను వివరముగా చెప్పియున్నాడు. వాటిని ఆ రీతిగా పల్లవులందున పాడదగును అనికూడా చెప్పియున్నాడు. ఇకను తాళగ్రహములును వివరించి వరుసక్రమముగా సమము, విషమము, అతీతము, అనాగతము లనునవి నాలుగు గ్రహములనున్నూ విశదీకరించుటలో ఎందువల్లనో తారుమారుగా చెప్పియున్నాడు. అతీత అనాగత గ్రహములు రెండింటినిన్నీ విశదీకరించుటలోనే వాటి వివరణమును తారుమారుగా వివరించియున్నాడు. అది ఏమైనను వ్రాతలోని పొరపాటుగానీ, వివరణమునందున జరిగి యుండినట్టి పొరపాటుగానీ అయినను అయియుండవచ్చునని ఊహించవలసి యున్నది. ఏమంటే అతీతగ్రహము అనునది శాస్త్రమును అనుసరించి చెప్పబడినట్టి విధము ఎట్లంటే:— ముందుగా కొంతపాట నడిచిన అనంతరమున తాళక్రియను ప్రారంభించినట్లయిన పోనది 'అతీత గ్రహము' అనబడగలదు. ఎట్లంటే దీనికి ఉదాహరణమునకు 'అలి! నేనులెల్ల......' అని రూపకతాళమునందలి యుదాహరణము లేక 'కన్న తండ్రి నాపై కరుణ మానకే' ఆదితాళము – ఇత్యాదిగా గలది అతీతగ్రహము అనబడగలదు. ఇకను అనాగతగ్రహము అనగా— ముందుగా తాళక్రియను ప్రారంభించి కొంత (తాళము) నడచినవెనుక పాటను ఎత్తుకొనే యెడల అట్టిది 'అనాగత గ్రహము' అనబడగలదు. దీనికి ఉదాహరణము ఏమంటే అటతాళవర్ణము— ,,,,,—,,,,,, విరిబోణీ...... ...అనునది. మరియునూ ',,,,—నిన్నుజూచి ధన్యుడైతి......' మొదలుగా

యుదాహరణములు గలవు. ఈ గ్రంథకర్త యీ క్రింది రీతిగా వాటిని వివరించియున్నాడు. ఆయన వ్రాసిన దానినే ఇచ్చట యథాతథముగా ఉటంకించి చూపుచున్నాను.

'సమ, విషమ, అతీత, అనాగతములనే నాల్గు గ్రహములు గలవు. యీ నాల్గు గ్రహముల ననుసరించి తాళములయందున పల్లవులు వర్తించును. స్వరమైనా, సాహిత్యమైనా, శబ్దమైనానేమి? తాళాదియందు వక్కమారు తాళఘాత-ఉచ్చారణ-ఏకీభవించి, యెత్తుకునెనా-అది సమగ్రహము అనఁబడును. తాళం సశబ్ద క్రియ నడచి తాళంయొక్క రెండో క్రియచూపి యీ లోపుగా యెత్తుకునెనా-అది విషమగ్రహమనఁబడును. ఇకను తాళముముందుగా 1।2। అక్షరములు జరిగిన తరువాత యెత్తుకుంటే అది అతీతగ్రహమనఁబడును. 1।2। అక్షరములు గీతం నడచిన పిమ్మట తాళం ఎత్తుకునెనా-అది (విషమ) అనాగతగ్రహమనఁబడును. తాళం సశబ్దక్రియనడచి, తాళంయొక్క రెండో (2 వ) క్రియచూపి యీ లోపుగా గీతం ఎత్తుకునెనా-అది విషమగ్రహ మనఁబడును. ఈ విషమ గ్రహములు నాలుగు విధములై యున్నవి. శుద్ధవిషమమనిన్నీ; అనాగత విషమమనిన్నీ; అతీత విషమమనిన్నీ;-శుద్ధ విషమమనగా తొలుత చెప్పినరీతి తాళం రెండో పాదమందు 1।2। అక్షరములు నడచిన పిమ్మట విషమముగా యెత్తుకొన్నది ॥1॥. తాళప్రథమమందే 1।2। అక్షరములు గడచిన తరువాత, విషమగలిగా యెత్తుకొనుట అతీత విషమము ॥2॥. యీ చెప్పిన భేదములలో యేదైనా నేమి రెండో కాలాన్కి మిగిలిన పై కాలములలో యెత్తుకున్నది 'కాలవిషమ'మనఁబడుచున్నది. ఇది (తాళ) గ్రహచక్ర ప్రకరణమనబడును-' అని యీ పై రీతిగా వివరణమును చెప్పియున్నాడు. దీనినిబట్టి అతీత, అనాగత గ్రహములయొక్క వివరణము కొంచెము తారుమారుగా అర్థము అవుతూ వున్నది. ఇది బహుశా వివరణమునందలి అర్థభావము తారుమారుగానుండి యుండవచ్చునని యూహింపదగును. ఆయన మూల శ్లోకములు వ్రాసి యుండలేదు. వివరణముమాత్రమే తెలుగులో పై రీతిగా వ్రాసియున్నాడు. ఏమైనను, ఆ స్వల్ప విషయమును విడిచిపెట్టి మొత్తముమీదను ఈ గ్రంథ పరిష్కర్తయగునట్టి శ్రీ నృకంఠీరవాచార్యులు గారు గొప్పగా పల్లవుల యందున సమర్థుడైనట్టి వాడుగా తోచుచున్నది. ఏమంటే: పల్లవియొక్క ఆద్యంతములకుగల అక్షర కాలమును పంపిణీ చేయుటయును: పైనను చెప్పినట్టి సమ, విషమ, అతీత, అనాగతాది గ్రహములను ప్రదర్శించుట యందున్నూ ఇతడు ఘటికుడుగా తెలియుచున్నది. మరియున్నూ, ఆ నాటి గాయకులుగానీ, నర్తకులు గానీ, స్వర, సాహిత్య, శబ్ద పల్లవులను వివిధ రీతులలో పాడుటయందున్నూ, శబ్దపల్లవులను సమకూర్చి నర్తించుటయందున్నూ అత్యంత సమర్థులై యుండినట్లుగా మనకు తెలియుచున్నది. విషమ గ్రహములలోగానీ, విషమగతులలోగానీ, విషమపల్లవులను ప్రదర్శించుట చాలా కష్టసాధ్యమైనట్టి విషయము. అట్టివారు కేవలమున్నూ, 'లయ బ్రహ్మలు'అనదగినట్టివారు. అట్టియా కోవలోనివారు గనే ఈ గ్రంథపరిష్కర్త యగునట్టి శ్రీ ముడుంబ నృకంఠీరవా (నృసింహా)చార్యులవారు కన్పించుచున్నారు. వారియొక్క కృషినిబట్టిన్నీ కళావిజ్ఞానమునుబట్టిన్నీ మనకు ఇది తెలియుచున్నది. అట్టి కళావిజ్ఞానులగునట్టి మహనీయులు ఎందరో కాలగర్భమున గలించి యుండిరి. అయినను అట్టివారంతాకూడా యశఃకాయులై ఈ నాటికిన్నీ సజీవులుగనే కళాదృక్పథములో వ్యవహరింపబడుతూ చిరస్మరణీయులై వెలసి యున్నారు. అట్టివారలందరకిన్నీ వందనములు:—

ఇకను ఈ గ్రంథమునందున నాతడు (గ్రంథ పరిష్కర్త) వర్ణించియుండినట్టి విషయములను వరుసక్రమముగా నీ క్రిందను పొందుపరచుచున్నాను గమనింపుడు. గ్రంథమునందలి తాళపత్ర సంఖ్యలనున్నూ అందలి విషయములనున్నూ వరుసక్రమమున నొక విషయ సూచికావళి (Contents) ఉట్టంకించి యుదాహరించి సూచింపబడును. (పత్రసంఖ్య) (1) దర్పణశాస్త్రగ్రంథే హస్త ప్రకరణ వివరణ ప్రదీపిక- (4) సర్వభరతార్థసారలక్షణసంగ్రహ ప్రదీ-

పీక, పరీక్షా గ్రంథం—లక్షణసంఖ్య (175). (6) భరత శబ్దార్థము, స్వరశబ్దార్థము, సంగీత శబ్దార్థము, తాళశబ్దార్థం—తాళోత్పత్తిక్రమః—భావ, రాగ, తాళ ప్రకటనావిధి; అభినయ శబ్దార్థం; సుపాత్ర లక్షణం; (8) పాత్ర చతుర్దశ దోషాః; మృదంగ లక్షణం; వాద్యక లక్షణం; వాద్యవిధి - తద్విధాశ్చ — నటలక్షణం; పాత్రబహిరంతఃప్రాణ లక్షణం; శాస్త్రాశాస్త్రీయ నృత్యఫలం — నీచ నాట్య దర్శనఫలం; (9) సునాట్య క్రమం; రాజలక్షణం; సభాసదస్థితి, లక్షణం; (10) మేళ కూట లక్షణం, మేళజనస్థితిలక్షణం, కింకిణీ లక్షణం, యవనికా లక్షణం, (11) మార్గికాః ప్రాప్య దృష్ట్వా, మనోభావ రసాభినయం; సవ్యాపసవ్య హస్తాభినయం; నవరసవివరణం; శృంగారరసం; హాస్యరసం, కరుణరసం; రౌద్రరసం; వీరరసం; భయానకరసం, (12) బీభత్స - అద్భుతరసములు; భ్రూవిక్షేపాః; (12) పంచధాభినయలక్షణం; సాత్వికభావాః తేషాం హస్తాని; (13) అపూర్యక హస్తప్రద్యుక్షపాదాః; హస్తప్రాణ — పంచకం; హస్తద్వాదశప్రాణాః (16) ఉత్తమా మధ్యమా-అధమక్షేత్రాలు. బ్రాహ్మణ, క్షత్రి. వైశ్య. శూద్ర. స్థానాని సంవిధలక్షణం; గౌండ్యలీ, లక్షణ. ప్రేరణీ, వికుంచిం; (18) నృత్తవినావేదశ విధముండదాని—(19) అష్టవిధోపశ్చలనాని; చతుర్గ్రీవాలక్షణం; (20) స్త్రీపురుషాభినయం, హార్దాభినయం; క్రోధాః; (21) హర్షక్రోధాలు - పురుష భయం. స్త్రీ భయం సుకుమారులు చతుష్పాద త్వభినయం; (22) సర్వదేవతాభినయ లక్షణం; బ్రహ్మవిష్ణుమహేశ్వరాణాం; సరస్వత్యాః; లక్ష్మ్యాః, వినాయకస్య, పార్వత్యాః; మన్మథస్య; కుమార స్వామినః; విభవాణాం మహోత్సవస్య, పంచశరస్య, శ్రీదేవి, రతిదేవి దశావతారహస్తాః, చాతుర్వర్ణ్యహస్త లక్షణం; (24) దశరథహస్తః; చతుర్యుగాణాం నవగ్రహాలకు—(25) బుద్ధ్యభినయం; పతాకాదిహస్త బుద్ధయః; (26) సర్వబంధనలక్షణం; పుష్పవల్యాః ప్రమాణ్యాః; మేరుకల్పకానాం, కటకాముఖం; అమాయా, అరాళా, సమ్మార్గకథనే చాపి జీవస్యాభినయే తామ్రచూడః; కదలీవృక్షస్య, కైలాస కామధేన్వోః; ప్రతిపదకి, ద్వితీయకు, తృతీయాదిః నామాత్రయోదశీలక్ష్య. చవితికి, అష్టమికి; 'కుహళీయే' (కుహళీయ గ్రంథమునందున)-పంచమీ, షష్ఠీ, ద్వాదశిలకు, నవమికి మంజులహస్తాని; మరియాద్రినందం తాని, సప్తమికి-నక్షత్ర హారిభక్త ముఖమండలం; లింగం—ముత్యాలు........ (27) చతుర్దశికి - శివరాత్రికి; చిలుకకు, బ్రాహ్మణులకు, వాల్గజాతుల స్త్రీలకు ఉపరక్తికి వాద్య, నృత్త, నృత్య, లాస్య తాండవాలు—(28) అంగుష్ఠ లక్షణం; ఏకాదశహస్త కరచ లక్షణం; విప్రార్థ్యనాట్యనాసికాలక్షణం; (29) 2 నాట్య స్త్రీ చేష్టాః; స్త్యాత్ర తిరాక్ష్య చేష్టితకం; పత్యాంతరంతు; పదశతార్థానుగుణాల్లయా పరిజ్ఞానం; తత్తూ; - నక్షత్రాభినయం; (30) షోడశోపచారాః; నవరత్నాభినయం; అష్టలోహాభినయం, (31) కోలు కులజాతుల వివరణం; (33) డోలధ్యాయే డోలా లక్షణం; (34) - (1) వాద్యకార లక్షణం. (34)-(2) చరణలక్షణమ్; (35-వ ప్రశ్న 1 వ ప్రైపన) పతాకాద్యసంయుతహస్తనామ స్వరూప వివరణమ్; పతాకాద్యసంయుతహస్తరూప వివరణ కు;...........36 (1) అభినయదర్పణ శాస్త్రం—నందికేశ్వరీయ్యం; 37-(1) త్రిపతాకం, అర్ధపతాకహస్తం; 37-(2) కర్తరీముఖం;...... 39-(2 శుకతుండహస్తం ముష్టిః......... 41-(2) కటకాముఖః 43-(2) బాణహస్తః... 47 - (1) హంసాస్యహస్తలక్షణం; 49-(2) సింహాననః-50- (2) మణిహస్తం-51-(2) అలపల్లవ హస్త 52 - (1) ముకురహస్త 3-(1) దర్పణశాస్త్రం-బృహస్పతీయ్యం-పతాకహస్తం పుష్టి వింశతి సంఖ్యకాః; (5?) స్థానాని -55-(1) కర్తరీముఖః-అర్ధచంద్రః!-56-(1) శుకతుండః 57-(1) కపిత్థః; సూచీముఖః, 58. సూచీముఖ హస్తః-59-(1) చలపద్మః; సర్పశిరః; మృగశీర్షః; 60-(1) భ్రమరః; హంసాస్యః-హంసపక్షహస్తః; 61-(1) ముకురః; చలపల్లవ; 62-(2 -చంచలః 63-(1) నారదీయ్యం- దర్పణశాస్త్రం పతాకః-64 - (1) అర్ధచంద్రః; 65-(1) శుకతుండః; 67-(1) కటకాముఖః;

62-(2) పద్మకోశః- 69-(2) హంసాస్యహంస పక్షః; సందంశః-70-(2) పల్లవః 73-(1) త్రిపతాకః; 73-(2) ప్రసారః-74-(1) అర్ధపతాకః; 74-(2) ప్రసారః-75-(2)మయూర హస్తః; అర్ధచంద్రహస్తః; ప్రసారః; 77-(1) రేఖాచంద్రహస్తః; అరాళః; శుకతుండః 78-(2) ప్రసారః 79-(2) ప్రసారః శిఖరం......ఇత్యాది

80-(2) దేవన్నత్త లక్షణం: 81-(2) కటకాముఖః ప్రసారః......82-(1) సూచీముఖః; 82-(2) ప్రసారః 83-(2) పద్మకోశః; అర్ధసూచి; 84-1. ప్రసారః సర్పశీర్షః; (85-1) చంద్రః; చర్యచతురః మృగశీర్షహస్తం; 86-(1) కాంగూలః ప్రసారః; 87-(2) ఖండచతురః, ప్రసారః భ్రమరః ప్రసారః 89-(1) హంసపక్షః- ప్రసారః; సందంశః ప్రసారః, 91-(1) అవయవ విహార రీతి; 91-(2) ప్రసారః! ఊర్ణనాభ హస్తః, 92-(1) ప్రసారః; సంహాసనం; ప్రసారః; 93-(1) ముకుళహస్తః ప్రసారః. చంద్రకళాహస్తః; ప్రసారః 95-(1) దేశాంతరోద్భవ సంయుతహస్త ప్రకరణం; లిఖితం-ఖంజనహస్తం 96-(1). హంసాస్యహస్తలక్షణం, స్వర్ణఖంజనహస్తం, 96-2. యష్టికం, విరహహస్తం, 97-(1) అవాంతరోద్భవసంయుతహస్తప్రకరణం, సంమోహనహస్తం; 98 - (1) భావుకః భంగురః, సింధుహస్తః, మోహనహస్తము భ్రామకః......

99-(2) నృత్తహస్త ప్రకరణమ్:-ఉద్వృత్త హస్తః; తలముఖః; విప్రకీర్ణః, 100-(1 గజదంతః, అవహిత్థ స్వస్తికః, సూచీవిద్ధః-రేచిత హస్తం. అర్ధరేచితః; పల్లవః; 100-(2)నితంబః; కేశబంధః, లతాహస్తం, కరిహస్తం, దండపక్షః; 101-(1) ఊర్ధ్వమండలిహస్తలక్షణం, పార్శ్వ మండలి పురోమండలి హస్తః, నలినీపద్మకోశః

101- (2) మకరహస్తం: జ్ఞానహస్తం, ముద్రాహస్తం............

102-(1) సంయుతహస్త ప్రకరణం: షట్త్రింశతి సంఖ్యాః సంయుతహస్త స్వరూప వివరణ ప్రదీపిక............

103-(1) సంయుతహస్త ప్రకరణం; పుష్పపుటః; అంజలిః; చతురశ్రః; త్రిపతాక, స్వస్తికం — పతాకస్వస్తికం, కర్తరీస్వస్తికం; 104-(1) డోలాహస్తః అవహిత్థః - వర్ధమానహస్తః — 104 - (2) ఉత్తాన వంచిత హస్తః; కలశః; పక్షవంచితః; ఉత్సంగహస్తం; 105-(1) మిత్రోత్సంగః; తిలకహస్తః; నాగబంధః; వైష్ణవః; కపోతః; 105-(2) కర్కటః; కటకావర్ధమానహస్తః; గజదంతః; నిషిద్ధహస్తః; మకరహస్తః; 106-(1) వల్లభాయుతః; రతామోదః; శివలింగః; శంఖహస్తః; చక్రహస్తః; సంపుటహస్తం; పాశహస్తః; కీలకం (ముఖం): 106-(2) త్రిశూలం; కూర్మం! వరాహః; గరుడః; ఖట్వం; భేరుండః;107-(1) వింశతి సంఖ్యాకశిరోభేదప్రకరణం; సమాధ్రాతశిరః; విధూత శిరః-ఇత్యాది......107-(2) అధూతం; అవధూతం; ప్రకంపితం, కంపితం; ఆకంపితం; 108 (2) హంచితం: లలితశిరః, లోలితశిరః; ఆలోలితశిరః పర్యావృత్తం; 109-(1) ఉత్క్షిప్తం; సౌందర్యం, తిర్యక్శిరం- 109-(2) పంచదశదృష్టిభేదప్రకరణం; ఆలోకితదృష్టి, ఉల్లోకితదృష్టి 110-(1) అవలోకితం, విలోకితం; ప్రలోకితం - 110 (2) సాచీదృష్టిః; సమదృష్టిః అనువృత్తం; కరుణదృష్టిః; మీలితదృష్టి; ఇంగిత దృష్టి; దృఢదృష్టి; ఉగ్రదృష్టి; సూచనదృష్టి; దూరదృష్టి;

112(1) రాగాధ్యాయః:- సప్తస్వర నాద వివరణం; 112(2) నాటరాగస్య లక్షణం; గౌడ రాగస్యలక్షణం; శ్రీరాగస్యలక్షణ; ఆరభిరాగస్య లక్షణం—113-(2) సారంగనాటరాగము; ఆనంద భైరవి; నాదోత్పత్తిలక్షణం; 114(1) ద్వావిం

శతిః శ్రుతయః; శ్రుతినామాని; 114(2) స్వర శబ్దార్థం: స్వరవంశాః; స్వరజాతయః; స్వర వర్ణాః; ఉత్పత్తిర్ద్వీపాః; అధిదేవతాః; వివాహాః; 115-(1) నక్షత్రాణి; దేహః; వర్ణాణి; పుష్పాణి; భోజనాని; వస్త్రాణి; లేపనాని; భూషణాని;...... 116 (1) వాదిస్వరః-వాదిలక్షణం; అనువాది— 117(1) రాగరసః; స్త్రీరాగః; కాలరాగనిర్ణయః; 118(1) తాళాధ్యాయః-తాళశబ్దార్థ తదుత్పత్తి రీతిః; తాళ ధి-త్యోత్పన్నం తాళప్రవర్తన క్రమం; వివాదిలక్షణం; మార్గలక్షణం! విముకిలక్షణం; తాళాంగాః; అంగాధిదేవతాః; లయలక్షణం; 120-(1) జాతయః-సప్తతాళలక్షణం; ధ్రువ ధ్యానం; మఠ్యాధ్యానం; 121-రూపకం, ఝంపా; త్రిపుటా; అటతాళం, ఏకతాళం; ఆదితాళం- 122-(1) ధృవాదిస్వరాః తాళోత్పత్తిక్రమం ధృవతాళోత్పత్తిక్రమం, 126-1 పరీక్షా వివరం, 126-2 పతాక సంహితాకారో విజ్ఞేయః

ఇది మాత్రమే ఈ గ్రంథమునందలి విషయానుక్రమణికయై యున్నది. ఇది వరుస క్రమమున వ్రాయబడినది-మరియు నింకనూ ఈతడు ఈ గ్రంథమునకు చివరను రాగాధ్యాయము, తాళాధ్యాయము లనెడి రెండు ప్రత్యేక అధ్యాయములను జేర్చియున్నాడు. అందు రాగాధ్యాయములో నీరు సక్రమంగా కొన్ని రాగములను పేర్కొని వానికి లక్షణాదికములనుచెప్పి ఆ రాగముయొక్క రూపమును వర్ణించి దానిని రాగధ్యాన శ్లోకములుగా రూపొందించియున్నాడు. అట్లుగా నీతడు ఇందు చెప్పియుండినట్టి రాగములు వరుసగా వాయా రాగలక్షణ వివరణములను ఈ క్రిందను ఉట్టంకించి చూపుచున్నాము. గమనింపుడు.

నాటరాగస్యలక్షణం

శ్లో॥ నాటస్స్వరోహణే పూర్ణో గధవర్జ్యోవరోహణే॥ లఘుగాంధార ఋషభో ఘనరాగ ఇతీరితః॥ పుంరాగ ఇతిఖ్యాత స్సంపూర్ణో౽డవ ఉచ్యతే, సర్వకాలేషు గాతవ్యో నాటరాగ ఇతిస్మృతః॥ మహత్-సరిగమ పధనిస- సనిప మరిస ॥(1)॥

గౌళరాగలక్షణం : శ్లో॥ కళాచమధ్యమశ్చైవ పంచమః ప్రచురస్తథా, నిషాదో మూర్ఛనా చైవ చామృతో ఋషభస్స్వరః। పంచమౌడవ సంబంధః శుద్ధమేళ ఇతిస్మృతః, ఔడవాఖ్య సమాఖ్యాతో, ఘనరాగ ఇతీరితః; ఆరోహణే గధవర్జ్యో ధవర్జ్యశ్చావరోహణే। మహత్—ఏతస్స్వరగతిః—సరిమపనిస— సనిపమరిగమరిస ॥2॥

శ్రీరాగలక్షణం: శ్లో॥ పంచమో జీవనం బంధో మధ్యమశ్చ కళాన్వితః, ప్రచురో వృషభశ్చైవ హ్యమృతస్స్వచ్ఛ నిషాదకః। పంచమో మూర్ఛనా హౌడవాఖ్యయాచ సమన్వితః; ఘనరాగ ఇతిఖ్యాతః శ్రీరాగో వక్రసంగతిః। శ్రీరాగో గౌళరాగశ్చ శేషంతే వినియోజయేత్॥ ఉభయోశ్చాపి వర్జ్యశ్చ గురురీ లఘుగా భవేత్॥ మహత్-సరిమపనిస పనిపమరిగరిస— ఇతిస్వరగతి॥ సంఖ్య (3)॥

ఆరభిరాగలక్షణమ్ : శ్లో॥ (113 పత్రము-1 నైపున) 'ఆరోహణే రిమపగా స్సంపూర్ణశ్చావరోహణే। ఔడవః పరిపూర్ణశ్చ ఘనరాగ ఇతీరితః – యామాద్యేపిచ పూర్వాహ్ణే గతాయంచరనేముదే। గురు రి గురు ధా చైవ రాగ ఆరభినామకః; అమృతో ఋషభశ్చైవ ప్రచురో మధ్యమా భవేత్। కళాచ పంచమశ్చైవ నిషాదో మూర్ఛనాభవేత్; 'అమృతో ఋషభశ్చైవ నిషాదో మూర్ఛనా భవేత్; పుంరాగ ఇతి విశ్రుతః। ఉషః కాలేతు గాతవ్యశ్శుద్ధమేళ ఇతీరితః॥ శృంగారాది రసైర్యుక్తో దేవగానేసనంయుతః, విప్రజాతిరితిఖ్యాతో ఘనరాగ ఇతి శ్రుతః॥ ఆరోహణే మనీవర్జ్యో మధ్యమం చావరోహణే। ఔడవో షాడవశ్చైవ, చాళిరాగే విధీయ్యతే; మహత్—సరిగపదస—సనిధపగరిస ॥సంఖ్య॥ (4)॥

దౌళిరాగలక్షణం: శ్లో॥ కళాద్వైవతం జీవం పంచమం ప్రచురంహితత్। గాంధార మూర్ఛనా చ్చైవ నిషాదమమృతంతథా॥ ఋషభ చేలదేవంస్యాత్పుంరాగః పరికీర్తితః; ఉషఃకాలేతుగాతవ్యశ్శుద్ధ మేళమితీరితః॥ శృంగారరస భూయిష్టః

దేవగానమితి ప్రతీతః॥ రాగేను బ్రహ్మజాతిస్యాద్ధసరాగ ఇతీరితః॥ వర్జ్యమారోహణేచాస్య నిషాదం మధ్యమం తథా। మధ్యమంచావరోహేస్యా ద్వర్జ్యక్షాడవాడవ నిశ్చికః॥ మహో దేతత్స్వరగతి ర్వక్ష్యేహం శ్రుణు సాదరం॥ ఆరోహణం సరిగపదస-లు, అవరోహణమున సనిదపగరిస-లు వర్జ్యలు. రాగసంఖ్య ॥5॥

సారంగనాట రాగలక్షణం: శ్లో॥కళాతు మధ్యమః ప్రోక్తాగాంధారో ఒమృత ఉచ్యతే జీవస్తు రుషభో ఖ్యాతో నిషాదః ప్రచురస్తథా॥ ధైవతో మూర్ఛనాచేతి శుద్ధ మేళ ఇతిస్మృతః॥ ఆరోహణేగనీవర్జ్యా సంపూర్ణ శ్చావరోహణే। సారంగనాటరాగోయమౌడవః పూర్ణ ఉచ్యతే॥ మహత్-సరిమపదస సనిదపమగరిస రాగ సంఖ్య (6)

భైరవిరాగ లక్షణం: శ్లో॥ కళాచపంచ మశ్చైవ రిషభో ప్రచురామృతా। గాంధారో మూర్ఛనాచైవ నిషాదో జీవనస్తథా। రక్తిరాగ ఇతి ఖ్యాత స్సర్వకాలేషు సర్వదా। పతితవ్య శ్చాంతరసో గాతవ్యో మంగళప్రదం గురురీలఘుగా పూర్ణ రాగో భైరవి రుచ్యతే॥ మహత్-సరిగమ పదనిస-సనిధప మగరిస రాగసంఖ్య ॥7॥

ఆనందభైరవిరాగలక్షణం: శ్లో॥ ఆరో హణే సగమపాశ్చామృతః। ప్రచురః కళా। రిషభో మూర్ఛనా చైవ జీవో మధ్యమ ఉచ్యతే। రాత్రికాలేవ గాతవ్య శృంగారో వినియోజయేత్॥ గురు రీ లఘుగా రక్తిరాగ శ్చానంద భైరవీ, ఆరోహణేరిధౌవాస్తి-సంపూర్ణ శ్చావరోహణే; సగ మపనిప సనిదపమగరిస. రాగసంఖ్య ॥8॥ రాగవివ రణం సంపూర్ణం'-

అని ఈ రీతిగా యెనిమిది రాగములకు లక్షణాదికములను విశదీకరించి చెప్పియున్నాడు. అటుతరువాతను నాదలక్షణములను చెప్పి యున్నాడు. స్వరములు వాటివాటియొక్క పుట్టుక తీరు వివరణాదికముల నన్నింటినన్నీ విపులీకరించి చెప్పి యుండెను. ఆ తరువాతను (118 వ పత్రము-1 వ పైపున) తాళాధ్యాయమును ప్రారంభించియున్నాడు. తాళశబ్దార్థము — వివరణాదికము, అంతా కూడా వివరించియున్నాడు. తాళముయొక్క వివరణములు, తాళదశ ప్రాణములు మొదలగునట్టివి అన్నియును చెప్పి తాళాంగములను వివరించియున్నాడు. తరు వాతను తాళజాతులను చెప్పియుండెను అనంతరము నందు సప్తతాళములనున్నా పేర్కొని వాటిని వరుసక్రమముగా ధ్యానశ్లోకముతో నిరూపించి విశదీ కరించియున్నాడు. ఆయా తాళధ్యానశ్లోకములను ఈ క్రిందను ఉదాహరించి చూపుదము. గమనింపదగును.

(1) ధ్రువతాళధ్యానమ్: శ్లో॥ హంసారూఢం పురోభాగే త్రయోదశసతీయుతమ్। ఏకస్త్రీ యుక్తవామాంకం రత్నకేయూరధారిణం। శ్వేతవస్త్ర ధరం శాంతం ముక్తాహారవిభూషితం। ధ్రువతాళం సదాధ్యాయే శంఖచక్రగదాధరం॥ మాత్రా చతుర్ద శైతస్య త్రీణిఅంగానిచక్రమాత్ — ప్రథమాంగ స్యాక్షరాణి షట్సంఖ్యాని ద్వితీయకే। అంగేఒక్షరాణి చత్వారి యద్యైతచ్చతుర్దశకం। జాతిప్రకాశం చైతద్ధ్రువతాళప్రకీర్తితం॥ తాళసంఖ్య॥ (1)

(2) మఠ్యతాళలక్షణం:- శ్లో॥ మయూర వాహినీం వీణాం చాక్షమాలాధరాం వరాం। దశస్త్రీ సేవితాం రత్నభూషితాం చతుర్భుజాం। ధ్యాయే శ్రీమఠ్యకాం విప్రమాతృకాం భువనేశ్వరీం॥ దశ మాత్రాణిచైతస్య చాంగాని త్రీణివై పునః। ప్రథ మాంగస్య చత్వారి ద్వ్యక్షరాణి ద్వితీయకా। తృతీ యాంగస్య చత్వారి చాంగ సౌజ్ఞా విదేహి। జాతిస్తు చతుర్దశస్యాన్మఠ్యతాళస్య లక్షణం తాళసంఖ్య॥ (2)

(3) రూపకతాళలక్షణం: శ్లో॥ 'గజాధి రూఢం స్త్రీషట్కయుతం వీరసాన్వితం। హరి ద్రాభం, హరిద్వస్త్రధరం, హారవిభూషితం। ధ్యాయే రూపకతాళాఖ్యం రత్నకేయూరభూషితం॥ షడక్షరం తాళమానం ద్వ్యంగంచ పరికీర్తితం। ద్వ్యక్షరే ప్రథమాంగస్య ద్వితీయాంగస్యవై పునః। చత్వార్యక్షర సంచార శ్చాంగ సౌజ్ఞా క్రమం త్విదం। చతుర్దశాఖ్య జాతిస్యా ద్రూపకస్యచలక్షణం; తాళసంఖ్య॥ (3)

(4) ఝంపాతాళలక్షణం:-శ్లో॥ సింహాసనే సమారూఢా మప్తస్త్రీ పరివేష్టితాం। పురుషాంక స్థితాం స్వర్ణప్రవాళమణిభూషితాం। రక్తాంబరధరాం ఝంపాం ధ్యాయే సద్వైశ్య మాతృకాం; దశాక్షర మితో తాళః త్ర్యంగస్య ప్రథమాంగకే। సప్తాక్షరాణి ప్రోక్తాని ద్వితీయాంగస్యవై పునః, ఏకాక్షరంతు సంప్రోక్తం ద్వ్యక్షరాణి తృతీయకే అంగసంజ్ఞా స్థితే మిశ్రజాతి ఝంపాఖ్యతాళకే; తాళసంఖ్య॥ (4)

(5) త్రిపుటతాళలక్షణం:- శ్లో॥ పంచాస్యారూఢ మానందాకారం చ స్ఫటికాకృతిం। సమస్త భూషణధరం సప్తస్త్రీ పరివేష్టితం। ధ్యాయే త్రిపుటతాళం మే హృది శ్రీరాజవల్లభం। తాళ స్సప్తాక్షర త్ర్యంగో త్ర్యక్షరః ప్రథమాంగకే ద్వ్యంగస్య ద్వ్యక్షరః ప్రోక్తో త్ర్యంగస్య ద్వ్యక్షరః స్మృతః॥ అంగసంజ్ఞా త్రిశ్రజాతి త్రిపుటాఖ్యస్య లక్షణం; తాళసంఖ్య (5)

(6) (121 వ పత్రము-1 వ పైపున) అటతాళ లక్షణం:-శ్లో॥ సతీయుక్తం వృషారూఢం చామర స్త్రీ యుగోజ్వలం। స్త్రీ పంచకయుతం చాట తాళరాజం నమామ్యహం। చతుర్దశాక్షరా హ్యేతదంగ సంఖ్యా చతుర్విధా। పంచాక్షరాణి-ప్రథమస్యాంగేపి చ ద్వితీయకే। పంచాక్షరాణి ప్రోక్తాని। త్ర్యంగస్యాపి చ ద్వ్యక్షరే। ద్వ్యక్షరే చతురాంగస్య చాంగ సంజ్ఞా స్థితి క్రమః-ఖండజాతిరితి ప్రోక్తా చాట తాళస్య సర్వదా॥ తాళసంఖ్యః (6)-

(7) ఏకతాళ లక్షణం: శ్లో॥ రథారూఢం శంబహస్తం చతుస్స్త్రీ పరివేష్టితమ్। గౌరవస్త్రధరం జ్ఞానముద్రాభయకరద్వయం। బ్రహ్మవంశోద్భవం చైకతాళం ధ్యాయామి మే హృది। అక్షరాణి చత్వారి। అంగమేకం ప్రకీర్తితం। చతురక్షర సంఖ్యాస్య ప్రథమస్యాంగ లక్షణం। అంగసంజ్ఞా స్థితా హ్యేష జాతిశ్చతురశ్రకాం॥ ॥తాళసంఖ్య॥ ॥(7)॥.......

(8) ఆదితాళ లక్షణం:-శ్లో॥ షట్స్త్రీ స్కంధ సమారూఢం దండాందోళకసంస్థితం। వామాంకే చైవ వామాక్ష్యా సహితం చామరీయుతం। పీతాంబరధరం రక్తవర్ణం కుండలమండితం। యజ్ఞసూత్రధరం దేవమాదితాళం భజామ్యహం। అక్షరాణిచ చత్వారి అంగమేకం ప్రకీర్తితం। అంగం చాక్షర చత్వారి। అంగసంజ్ఞా స్థితా యది। జాతిస్తు చతురశ్రస్యా దాదితాళస్య కీర్తితా॥ తాళసంఖ్య॥8॥ సంపూర్ణం. ఏతధ్యానవిధానైశ్చ తాళవృత్తం సమాచరేత్। తాళధ్యాన విధానం యోనజానాతి సబాలిశః। జాత్యంధస్తు ఘటస్పర్శ రూపేణ సతు జాయతే. సంపూర్ణం॥

పైనను చెప్పినట్టి రీతిగా ధ్యానవిధానముల చేతను తాళవృత్తమును ఆచరించవలయునని చెప్పియున్నాడు. మరియును, ఈ తాళధ్యాన విధానమును ఎవ్వడైతే తెలిసికొనజాలకున్నాడో ఆట్టివాడు బాలిశుడుగా చెప్పఁబడగలడు అని నిరూపించినాడు. అట్టి బాలిశుడు జాత్యంధుడు (పుట్టు గ్రుడ్డి) వాడుగా పరిగణింపబడగలవాడు, అని కూడా చెప్పియున్నాడు. అట్టివాడు మానవ (ఘట-స్పర్శ) రూపములో పుట్టఁడనికూడా నిరూపించియున్నాడు. కనుకను సప్త తాళధ్యానముయొక్క మహిమను నిరూపించియున్నాడు.

ఇట్టి యీ సప్తతాళ ధ్యానవిధానము అన్ని గ్రంథములయందున్నూ చెప్పబడి యుండలేదు అందు వలన విందున ఆ విధానమును నిరూపించియున్నాడు. ఇది ఈ గ్రంథ ప్రాశస్త్యమును తెలుపుచున్నది అని చెప్పవచ్చును.

ఇకను ఇక్కడనుండి ఆయా సప్తతాళముల కున్నూ స్వరములను చెప్పియున్నాడు. అనంతరము నందున ఈ తాళములయొక్క పుట్టుక, ఉత్పత్తి విధానము, వంశములు, గోత్రములు, ఋష్యాదులు— ఈ మొదలగునట్టి వివరముల నన్నింటినిన్నీ చెప్పియుండెను. అంతట దానికి తరువాతను ఆంధ్రములో ఆయా తాళాలను ప్రత్యేకముగా అంగసంజ్ఞలు అక్షర కాల పరిమితులున్నూ విశదీకరించిచెప్పియున్నాడు. సవివరణముగా ఆ వివరణమును ఈ క్రిందను పొందుపరచి చూపుదును.

అనుద్రుత, ద్రుత, లఘు, గురు, ప్లుత ములనేటి యీ అయిదు అంగాలవల్లను అనేక తాళములైనవి త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర, సంకీర్ణ, విరామములనునట్టి యీ షట్ (6) జాతులవల్లను పైన చెప్పిన అంగాలకు భేదములు గలవు యే రీతినంటే – అనుద్రుతంకు ఏకాక్షర కాలం. ద్రుతకు 2 అక్షరకాలం ప్లుతానకు 9 అక్షరాలకాలం. చతురశ్ర లఘువుకు 4।8।12–ఖండానకు 5-10-15 – మిశ్రానకు 2 (7) 14 – 21॥ (మిశ్రాన్కు 2 (7)।14।21) సంకీర్ణజాతిలఘువు 9-18—27 అక్షరాలకాలం. విరామ జాతిలఘువుకు 6।12॥18॥ అక్షరాలకాలం. ఇవి జాతుల ప్రమాణాలు–తాళానుగుణ్యంగా స్వరశబ్దాలు ఉచ్చరించే ప్రథమ కాలాదిగా ఆరు కాలాలకున్నూ అక్షరభేదం యే తీరునంటే: అనృతానకు తాళాక్షరాలు యెన్నో అన్ని నడచినది ప్రథమకాలం–ఆ తాళ ప్రథమకాల అక్షరద్విగుణం రెండోకాలం। ఆకాలాక్షర ద్విగుణం మూడోకాలం। ఆ కాలాక్షర ద్విగుణం నాల్గోకాలం। ఆ కాలాక్షర ద్విగుణం అయిదోకాలం. ఆ కాలాక్షర ద్విగుణం ఆరోకాలం। ఆరుకాలాలదాకా ఆ తాళాక్షర ద్విగుణం కాయవలెను...యిది ధ్రువతాళ స్వరూపం। విరామం లఘువూ। చతురశ్రజాతులు 2 చేరి అంగాలు మూడు గలది. అక్షరకాలం 14 సశబ్ద క్రియలు 3 జాతి విరామజాతి విరామ ఉచ్చారణ అక్షరాలు ప్రథమ కాలాన్కు 14 రెండో కాలాన్కు 28 మూడోకాలానికి 56 నాల్గోకాలానికి 112 అయిదోకాలానికి 224 ఆరోకాలాన్కు 448 ధ్రువ తాళ సంపకం సమాప్తం.

అథ మఠ్యతాళ స్వరూపం: యిది చతురశ్ర లఘువు 1 ద్రుతం. చతురశ్ర లఘువు 1 చతురశ్ర జాతి లఘువులు 2 ద్రుతం 1 చేరి అక్షరాలు 10 చతురశ్రజాతి ప్రథమకాలం 10 అక్షరాలు రెండో కాలం 20 అక్షరాలు, మూడోకాలం 40 అక్షరాలు, నాల్గోకాలం 80 అక్షరాలు, అయిదోకాలం 160 అక్షరాలు, ఆరోకాలం 320 అక్షరాలు -తాళ సంఖ్య (2).

రూపకతాళ స్వరూపం : చతురశ్రజాతి లఘువు 1, 2 మహార్తులు ద్రుతకు 2 అక్షరాలు చతురశ్ర లఘువు 4 అక్షరాలు చేరి 6 (ఆరు) అక్షరాలు. సశబ్దక్రియలు 2. చతురశ్రజాతి ప్రథమ కాలానికి 6 అక్షరాలు. రెండోకాలానికి 12 అక్షరాలు. మూడోకాలానికి 24 అక్షరాలు, నాల్గోకాలానికి 48 అక్షరాలు. అయిదోకాలానికి 96 అక్షరాలు, ఆరోకాలానికి 192 అక్షరాలు సంపూర్ణం– తాళసంఖ్య (3)

ఇంకాను! ఇది ఝంపతాళ స్వరూపం–మిశ్ర జాతి లఘువు 1 మిశ్రజాతి లఘువు 7 అక్షరాలు కాలం గలది. ప్రథమకాలం 10 అక్షరాలు, రెండో కాలం 20 అక్షరాలు, మూడోకాలం 40 అక్షరాలు, నాల్గోకాలం 80 అక్షరాలు, అయిదోకాలం 160 అక్షరాలు, ఆరోకాలం 320 అక్షరాలు–తాళ సంఖ్య–(4)

త్రిపుటతాళ స్వరూపం:–0400 త్రిశజాతి లఘువు ద్రుతలు 2 వెరశి 7 అక్షరాలు–త్రిశజాతి ప్రథమకాలం 7 అక్షరాలు, రెండోకాలం 14 అక్షరాలు. మూడోకాలం 28 అక్షరాలు, నాల్గోకాలం 56 అక్షరాలు, అయిదోకాలం 112 అక్షరాలు, ఆరోకాలం 224 అక్షరాలకాలం–తాళసంఖ్య (5)

అటతాళ స్వరూపం–ల. ల. ౦. ౦. స్వరూపం ఖండజాతి లఘువులు 2. ద్రుతలు 2–లఘువులు 2 కి 10 అక్షరాలు ద్రుతలు 2 కి 4 అక్షరాలు, వెరశి 14 అక్షరాలు ప్రథమకాలం:–రెండోకాలం 28 అక్షరాలు మూడోకాలం 56 అక్షరాలు నాల్గోకాలం 112 అక్షరాలు. అయిదోకాలం 224 అక్షరాలు ఆరోకాలం 448 అక్షరాలు–తాళసంఖ్య (6)

1 ఇది ఏకతాళ స్వరూపం:– చతురశ్రజాతి లఘువు 1 నాలుగు అక్షరాలు నిశబ్ద క్రియ 1–ప్రథమకాలం 4 అక్షరాలు రెండోకాలం 8 అక్షరాలు మూడోకాలం 16 అక్షరాలు నాల్గోకాలం 32 అక్షరాలు అయిదోకాలం 64 అక్షరాలు ఆరోకాలం 128 అక్షరాలు–తాళసంఖ్య–(7)

'సమ–విషమ–అతీత–అనాగతములనే నాలుగు గ్రహములు గలవు. ఈ నాలుగు గ్రహముల ననుసరించి తాళములయందు పల్లవులు వర్తించును.'... అని ఈ విధముగా నాతడు ఈ గ్రంథమును సమాప్తమొనరించియుండెను.

ఇట్టి యీ అపూర్వతాళప్రస్తగ్రంథము వర్తకీ నర్తకులకున్నూ, సంగీత విద్వాంసులకున్నూ, సంగీత విద్యార్థులకున్నూ ఎంతయో విజ్ఞానదాయకము అనుటకు ఏమాత్రమున్నూ సందియములేదు. అత్యంతోపయోగకరమైనట్టి పూర్వ (అపురూపమైనట్టి) గ్రంథమైయున్నది. ఇట్టి యీ అమూల్యమైనట్టి తాళప్రస్తగ్రంథము ప్రస్తుతమునందు తూర్పుగోదావరి జిల్లా తుని సంస్థానాధీశ్వరులగునట్టి శ్రీ శ్రీ శ్రీ వత్సవాయి వేంకటసూర్యనారాయణ జగపతి రాజబహద్దూర్‌వారియొక్క అధీనములో నుండియున్నది. పూర్వపు నాట్యసారస్వత గ్రంథము అగుటవల్లను ఈ ముఖ్య గ్రంథమును శ్రీ శ్రీ శ్రీ రాజావారే ముద్రణము చేయించి వెలుగులోనికి తీసుకొనివచ్చి సంగీత నృత్త నృత్య నాట్య కళాభివృద్ధి నొనరింపవలసిందిగా మిక్కిలియును ప్రార్థించుచున్నాను.



కులభ్రష్టుడు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

(గత సంచిక తరువాయి)

'వొదినా—ఇటు చూడు. ఎవరేమనుకుంటున్నారో అని వెనక్కి తిరిగి తిరిగి చూచుకుంటూ పోయినన్నాళ్లు మనల్ని దరిద్రం వెంటాడితీరుందనుకో. అక్రమానికి ఒడిగడుతున్నామా అని ప్రశ్నవేసుకోవాలి—చాలును.

'నిజానికి ఈ దరిద్రమంతా మనం కొని తెచ్చుకున్నదీ, కోరితెచ్చుకున్నదేను. చెప్పమంటావా?

'ఏ ఖర్చయినా పెట్టేటప్పుడు మన స్తోమతెంతో, మనకొచ్చే ఆయివేజులేమిటో, మన ఆదాయమెంతో, మన మెంతలో ఉండాల్నో ఎప్పుడు లెక్క వేసుకున్నాం చెప్పు?

'అసలీ కొట్టు మీద రెండువేల రుణమెందుకు చెయ్యాల్సొచ్చిందో నీకు తెలియదు. నాకు తెలుసు. చెబుతా విను...'

జానకమ్మ మెదలకుండా ఊరుకుంది. ఏమో ఒకప్పుడు చెప్పారు గనకనా? తను పట్టించుకున్నదీ లేదు. ఇంటో మునగానాం తేలానాం సరిపాయె.

అలవాటుకొద్దీ ఖాళీజేబులో సిగరెట్లకని తడుముకున్నాడు కిష్టుడు. వెల్లకిలా పడుకుని, కాలిమీద కాలు వేసుకుని చెప్పుకుపోతున్నాడు.

జానకమ్మ సావధానంగా వింటున్నది.

'అప్పుడు—అన్నాయి—అదేమో దిగులుగా వుండేవాడు...కొట్టేమో ఊరికి కాస్త దూరంగా వుంది... ఇప్పుడు పలికినంతగా బేరమంతగా పలక్క లాభాలు పల్చపల్చగావుండి అన్నయ్యకి ఎలాగ్గా లేదు.

'దానికి తోడు ఆ మధ్య ఒకళ్లిద్దరు పిల్లలు పుట్టిపోయారు.

'ఇంటో రోగాలు రొష్టులు.

'శనిగ్రహం పట్టుకుని పీడిస్తోంది అనేవాడు అన్నయ్య—ఇక చూచుకో ఆ శనిగాడు ఎక్కడున్నాడా అని వెతకడం ప్రారంభమయింది.

'అప్పుడదిగో ఆ గోవిందయ్యతో దోస్తీ అన్నయ్యకి. గోవిందయ్య పాపం మంచివాడే కాని కొందరి మంచితనం, వదినా, మనల్ని నట్టేట్లో ముంచుతుంది.

'ఎవరో గడ్డపాయన్ని తీసుకొచ్చాడు గోవిందయ్య వాస్తులో నిధి అట. ఆయనొచ్చి పరీక్ష చేశాడు మన కొట్టూ స్థలమూ...అవేగా మనకున్న నిక్షేపాలు.

'ఇంకా నయం, అద్దెకొంప వొదిలేశాడు.

'అమట్నే అదిగో ఆ నుయ్యి తూర్పుదిశగా వుంది; అది పూడ్చి ఈశాన్యంలో తవ్వమన్నాడు. దానిని పూడ్చేందుకెంతయిందో, దీనిని తవ్వేందుకు రెండింతలయింది. ఇలాజేసి పూడ్చేసిన పాలనుయ్యి మంచినీళ్లది......కొబ్బరినీళ్లల్లే తియ్యగా వుండేవి నమ్ము. కొత్తగా తవ్విన నూతిలో నీళ్లు ఉప్పన గాదు సరిగదా వేదు కషాయం. అక్కడ ఒక కిరసనాయిలు గనిగాని వున్నదేమోనని ఇప్పటికీ నమ్మకం నాకు...నీళ్లమీద మావెతరకలు తేలి కనిపిస్తాయి వదినా.

'ఇకపోతే ఉత్తరపుదిక్కునవున్న టెక్కుగది సెంచమన్నాడు; దక్షిణపువేపునవున్న పెద్దగది పడ

గొట్టమన్నాడు; గుమ్మమున్నచోట కిటికీ పెట్ట మన్నాడు; కిటికీవున్నచోటికి గుమ్మం మార్చమన్నాడు; పడగొట్టిన గుమ్మాలపైనా కిటికీలపైనా వాస్తుకి నప్పలేదన్నాడు! పాతవి విరిచి పొయిలో పెట్టాం; కొత్తవి కొన్నాం.

'బ్లాకులోకూడా సిమెంటు దొరకని రోజులవి'

'ఇంచుమించు పాతయిల్లు పడగొట్టి కొత్త యిల్లు కట్టామనుకో.

'అప్పాలప్పాల్లో కొట్టు మూశాంకదా.

'ఇల్లు గడవక అయిదారు వందలు అప్పు చేశాం పైన.

'వాస్తు పూరాగా తెలిసినవాడికి మళ్ళీ— వాడు–ఆ గడ్డపాడు–ఎంత శాస్త్రీయంగా కొంప ముంచాడనుకున్నావు? దానికి జమామకింద పంచెం చాపూ మాటవరసపోర్గా పట్టుకుపోయాడు పైపెచ్చు.

'అప్పుడు ఆ రిక్షాలకని తణఖా పెట్టి తెచ్చిన ఋణం ఈనాటికీ తీరలేదు. తణఖా లేకుండా తెచ్చిన ఋణం అయిదారువందలు తీర్చాడు అన్నయ్య ఇంత వరకూ.

'వాస్తు మహిమ! కొండనాలిక్కి మందు వేస్తే ఉన్న నాలిక ఊడి చక్కాలోయేలా వున్న దిప్పుడు.

'నేను చన్నీళ్ళు జల్లుతో వేస్తున్నా. 'అన్నయ్యా— ఏమిటీ చాదస్తం? మద్రాసులో చూడు...లక్షాధి కార్లున్నారు...లక్ష్మీపుత్రులు...గాలి వెలుతురూ— అంతే చూసేది...ఈ వెన్నుపోట్లూ, రోడ్డుశూలలూ, మట్టి మశానమూ, వల్లకాడూ పటనపురమూ. ఇవన్నీ మనకే పట్టేది' అన్నాను. వింటేనా?'

మెదలకుండా ఊరుకుంది జానకమ్మ. కిష్టయ్య నమ్మకాలు మహాప్రమాదకరమయినవని ఆమెకి తెలును.

'గొప్పగా దేవుణ్ణి తలుచుకుని నిప్పులో వేలు పెడితే కాలకమానదు పదివా...

'కమ్మపోతే పోయింది మార్య నమస్కారాలు చెయ్యాలంటే ఏలా?

'కర్మ...తెలిసిచేసినా తెలియకచేసినా ఫలితం చెల్లించ రుద్దుతాడు భగవంతుడు.'

కిష్టుడుకి దేవుడంటే నమ్మకంలేదనీ, నాస్తికుడనీ అంటారందరూను, జానకమ్మ సమేతూ— కాని ఇదిగో...ఈ ఆపత్తులన్నీ దేవుడు విధించిన శిక్షలే నంటాడు కిష్టయ్య.

జానకమ్మకి ఆవలింత లొచ్చినై. ఈలోపున ఒక చిన్న చీటీమీద ఇద్దరాసాముల పేర్లు రాసుకుని సిద్ధం చేసుకున్నాడు కిష్టుడు. ఒకడు రూపాయిన్నా, ఒకడు రెండు రూపాయిల చిల్లరా ఇవ్వాలి కిరాణా కొట్టు వాడకంకింద. నంగనాచులల్లే మాట్లాడరు. మన్నాడు దోమాడకదలా ఎక్కడున్నా పట్టుకోవాలి వాళ్ళని.

కాని దొచ్చెంత కాలిపేమటుకు బొగ్గవుతుంది?

ఆ రాత్రి నిద్రపట్టలేదు కిష్టయ్యకి.

* * *

పరుసకి మాణిక్యంగారి సమరథం వచ్చింది— పెక్కి వెళ్ళింది.

వాళ్ళకేదో దుర్భావన కొట్టిందనే అంటు న్నాడు సంసిద్ధంగారు.

అలా చెబుతోనే, వ్యవహారం చెడకుండా పరుం దాటు చేసేందుకు సతమత మవుతున్నట్టు అభిన యిస్తున్నాడు.

పగదివట్టూ ఉండాలి, నాతపెట్టినట్టూ ఉండాలి. బిడ్డను గిల్లమాగిల్లాలి, ఉయ్యాల ఊపనూ ఊపాలి.

చూడగా చూడగా, ప్రస్తుతం కొట్టు తెరి చేందుకు కావాలిసిన మూడునాలుగు వందలకి తోడు ఇంకొక వెయ్యిరూపాయిల అవసరం ఈ కుటుంబానికి కనిపించాలని ఈయనగారు కాయకష్టాలా తంటాలు పడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకో మరి?

పోనీ ఆ కొట్టువిూదనే కావలిసిన పైకం రుణమియ్యరాదా అని కిష్టయ్య స్వయంగానూ, రాయబారాలూ నడిపీ ప్రయత్నించి చూచాడు.

దానిమీద తణఖా బరువు క్రమేపీ ఎక్కువ కావడం ఆయనకే లాయకీకదా. అందుకేగా తణఖా పత్రం తన పేర బదలాయించుకున్నాడు. అంత అప్పు తీరేనా పెట్టేనా? కొనకెట్లాగూ ఆ కొట్టూ స్థలమూ ఆయన పాలబడేదేగా.

కాని, ఆయన పట్టు, అని ఇప్పుడే తెగ నమ్మించి దఖలు పర్చుకోవాలని. ఆమాటయినా అక్షరాలా అనడు ఎక్కడా; జానకమ్మ చాలా.—కిష్టుడు చాలా అనిపించాలి; అదీ ఆయన ఎత్తు.

అది పారలేదు.

తరవాత మార్కండేయుల్ని తరిమాడు తణఖా బాకీమాట ఏమిటని—జానకమ్మకి గాబరాగా వుంది.

కిష్టయికి కబురొచ్చింది. రామ పొమ్మన్నాడు. ఇప్పుడమ్మేదిలేదని ఢంకా బజాయించి చెప్పేశాడు. ఏమి చేసుకుంటావో చేసుకోమన్నాడు.

జానకమ్మనీ నంగినంగిగా మాట్లాడవద్దన్నాడు. నిష్కర్షగా చెప్పెయ్యమన్నాడు.

ఆ స్థలం క్రయంగాకుండా చేస్తున్నది వీడేనని నరసింహంగారికి గట్టిగా ముద్రపడిపోయింది. ఒకళ్లిద్దరిదగ్గర కిష్టయి అన్నాడుకూడా. ఏమని? 'ఈ నరసింహంగారు చప్పిగి పెట్టినా ఆ కొట్టూ స్థలమూ ఇప్పుడు అమ్మముగాక అమ్మము' అని.

మొట్టమొదట వీడి భరతం పట్టాలనుకొన్నాడాయన.

హేమాహేమీలు పక్కకి తొలుగుతారాయనకి. ఆయనతో కయ్యానికి కాలు దువ్విన వాళ్లని శంకరగిరి మన్యాలు పట్టించిన సందర్భాలు జానకమ్మ ఎరుగును. ఎందు కితగాడు ఆయన్ని రెచ్చగొడుతున్నాడు? ఏదో కాళ్లావేళ్లాపడి బతిమలాడుకొని, నాలుగు రోజు లాగమని ప్రసన్నుణ్ని చేసుకోరాదా?

కాని కిష్టయి అంత తెలివి తక్కువ వాడేమీ కాదు. ఏమీ ఆధారం లేకుండా అతగాడు నరసింహంగారితో కుస్తీపట్లకి దిగడం లేదు. ఎందుకు ఆయనిట్లా తనమీద పట్టించాడా అని దర్యాప్తు చేశాడు ఇటీవల.

కీలకం దొరికింది. కిష్టవతారమని డి.యి.వో ఆఫీసులో గుమాస్తా మొన్న బస్సుస్టాండులో యాదృచ్ఛికంగా అవుపించి ఓ చిన్నరహస్యం చెవిలో వూదాడు. అమట్ను ధైర్యం వుంజుకున్నాడు కిష్టుడు.

* * *

కిష్టుడు వ్రాసిన ప్రొనోటు బాకీకని రిజిస్టరు నోటీసు వచ్చింది.

దానికి సమాధాన మివ్వలేదు కిష్టయ్య.

నోటీసు వచ్చిందని జానకమ్మకి చెప్పలేదు.

ఆ రాత్రి నరసింహంగారు జబర్దస్తీగా కలుపుకున్న అమ్మత్తం వివరణ వచ్చింది.

జానకమ్మ ఊ కొడుతూ అందుకొంది.

ఎన్ని ముడనష్టాలు పొగుపడితే ఇంత ఐశ్వర్యం ఆయన చుట్టూ పేరుకుంది!

అవతల వీధిని రాయుడుగారి అర్ధాంమేడ... ఇరవై వేలు చేస్తుంది...విరుడు స్వాధీనం చేసుకున్నాడీయన. దానికి పేరుపురుగు నాలుగువేల ప్రామిసరీ నోటుతో ప్రారంభమయి, చక్రవడ్డీలతో బలిసి అంతింతై, ఆఖరికి దాన్ని మింగి చక్కావూరుకుంది.

రావికుంటలో అదిగో ఆ రామయ్యతాత పొలం...పదిహేను ఎకరాల ఖండిక...మక్కె తమైన మాగాణి... మొన్న మొన్న క్రయం రాయించుకున్నాడు. ఆ రామయ్యతాత కూతుళ్ల పెళ్లిళ్లు ఘనంగా చేశాడని ఇప్పటికీ చెప్పుకుంటారు. అందుకని అప్పట్లో వ్రాసిన తణఖా దస్తావేజా ఎంత చిన్నదో ఎవరికీ తెలియదు... ఆ తణఖాదస్తావేజా తిరగ రాయగా రాయగా......ఇప్పటికి.....అదిగో ఆ రామయ్యతాత మనమడి హయాం వచ్చేసరికి...పండి పక్వానికొచ్చింది.

ఆ క్రొండ్రు కాస్తా గుటుక్కున మ్రింగాడీయన పిప్పరబంటి బిళ్ళల్లే!

ఇలా ఒకటేమిటి? ఋణమూ, మధుమేహమున్నవాడి వ్రణమూ మాన్పపట్టవు...అలాఅలా సెల వేస్తూ పోతాయంతే.

ఎంతమంది నెత్తిన చేతులు పెట్టలేదీయన? ఇదుగో ఇప్పుడు మన 'టరన్' వచ్చింది—అన్నాడు కిష్టయ్య.

గుడి మ్రింగేవాడికి నందిపిండి పడియంట.

చిత్రం—ముదనష్టాలు కలిసినకొద్దీ నరసింహం గారికి ధనదాహం ఎక్కువయింది. నడమంత్రపు సిరి నరాలమీద కురుపులంటారు. తెగ సలుపుతుంది.

అసలు తీక్షి గుడ్డా గూడూ మిసహాయించి గుట్టకింద పోగుపడిన ఏ ఆస్తివిగా ఆస్తి అయినా సరే...దాని చరిత్ర కుళ్ళగించి చూస్తే పడిపోయిన జీవితాల గోడలు...కరుడుగట్టిన కన్నీటి అగాధాల గాథలు...పెళ్ళలు పెళ్ళలుగా బయటపడతయ్యంటాడు కిష్టడు.

చీమలు పుట్టలు పెడితే పాములు దూరతయ్యందులో అంటాడు. కాని పుట్టలు పెద్దవైతే చీమలే పాములకింద మారతాయని ఒప్పుకోడు.

కిష్టయిది అదో గుంటలెక్క.

కష్టపడి సంపాయించుకుని, కాపీనంగా బ్రతికి, నెత్తురూ చీమూ కూడబెట్టినట్టు, కాస్త కాస్త వెనకేసి, ఆస్తులు పెంచినవాళ్ళ 'లేర్‌టా' అంటే తెల్లబోతాడు కిష్టడు.

లంకలో పుట్టినవాళ్ళంతా రాక్షసులే వాడికి.

జానకమ్మ సావధానంగా వింది.

ఈ కిష్టయ్య నరసింహంగారిని గురించి ఇంతింత సమాచారం సేకరిస్తున్నాడు, దేనికని? ఇంతింత ద్వేషం పెంచుకుంటున్నాడు తగునా?... జానకమ్మకి విపరీతంగా భయం పుట్టింది.

ఏదో అనుమానం కుదిపేసినట్టయి—

'కిష్టయ్యా' అని ఒక్క అరుపరిచింది.

'నువ్వుగాని నరసింహంగారిమీద ఏమీ దవుర్జన్యం చెయ్యబోవడంలేదుగదా?'

తేలికగా నవ్వేశాడు కిష్టడు.

'అదేంలేదు వదినా...ఆయనంటే నాకు కక్షగా వున్నమాట నిజమే. కాని ఆయనమీద నాకున్న పగ తీరనివగ...తీరదు...దవుర్జన్యానికి దిగితినా మరు క్షణం జైల్లో ఉంటాను. నాకు తెలీదూ?... ఆయనమీద పగ సాధించడమే ముఖ్యమైతే అదో లెక్కలోది కాదనుకో...కాని, ఆ తరవాత మిమ్మల్ని బ్రతకనిస్తాడా? అంచాత, ఆయన జోలికిపోను నేను. నువ్వు నిశ్చింతగా వుండు.'

అమ్మయ్య.. జానకమ్మ గాఢంగా ఊపిరి తీసుకుంది.

*　*　*

తరవాత కిష్టయ్య రెండుమూడు రోజులు ఇంటి ఛాయలకే రాలేదు.

పిప్పాయిని పంపింది జానకమ్మ.

బస్సుస్టాండులో లేడు

జానకమ్మకి ఆందోళనగా వుంది.

ఇన్నాళ్ళూ ఆతగాడు దవుర్జన్యాలకి పాల్పడడు కదా అని భయపడింది; ఇప్పుడు అతనిమీద దవుర్జన్యం జరగలేదుకదా అని విలవిల లాడింది.

కాని ఒకనాడు లాకుల కెసుపని వండుకొని ఆవుపించాడనీ, ఒకరాత్రి గోరీలదొడ్డిదగ్గర రోడ్డు మలుపులో వొంటెనపిట్టగోడమీద నిదరపోతుండగా చూచాననీ పక్కింటి భావనారాయణ చెప్పగా వింది. నిశ్చింతగా వుంది.

*　*　*

నాలుగోనాడు రాత్రి—

తలుపు గొట్టినట్టయి, కళ్ళు నలుము కొంటూ గెడతీసింది వరును.

కిష్టయ్య లోపలి కొచ్చాడు.

కళ్లల్లో ఊపిరి పెట్టుకున్నాడు.

బొట్టు రేగివుంది.

జానకమ్మా పిల్లలూ అంతా బిలబిలలాడుతూ లేచి వచ్చేశారు.

తెలతెలవారుతోంది.

కిష్టయ్య నవారుమంచంమీద కూలబడ్డాడు.

అందరూ చుట్టూ మూగారు —

'వినండి...ఎవరూ ఏమీ ఖంగారు పడవద్దు' అన్నాడు.

విశ్వాన్ని పిలిచి మూడువందల రూపాయిల కట్ట చేతిలో పెట్టాడు.

'ఇది పట్టికెళ్లి పురుషోత్తంగారి హోల్‌సేల్ కొట్లో జాబితా ఇచ్చాగాని ఆ మేరకి కొనుక్కు తెచ్చుకో సరుకులు...చిల్లరగా ఎలా అమ్ముకుంటే లాయకీవో ఆయనే చెప్తాడు...రేపటినించీ కొట్టు తెరు...తెలిసిందా?

'నువ్వు స్కూల్‌ఫైనల్ ప్యాసయినా ఇప్పట్లో డవాలీబంట్రోతు ఉద్యోగమేనా దొరకదు.. అథవా ఏ గుమాస్తాగిరీ అయినా దొరికినా ఆ ముష్టి మూటపాతికా పుచ్చుకుని లింగూలిటుకూమంటో నువ్వు దేశాలు పట్టిపోతే...ఇక్కడ...ఈ పిల్లలంతా ఏమయి పోయేట్టు? అంచాత...చదువు మాను. తెలిసిందా?'

నోట్లు లెక్కపెడుతో, ఎక్కడిదీ డబ్బు అన్నట్టు చూచింది జానకమ్మ.

'ఈ డబ్బు నేనేమీ దొంగతనం చెయ్యలేదు. శ్రీనివాసయ్యరు కాఫీహోటల్లో ఏణ్ణర్థం పనిచేస్తానని కంట్రాక్టు వ్రాసిచ్చా...మూడువందలు ఏడ్వా న్సిచ్చాడు—అదీ కథ.

'ఇక పోతే ఈ వూరికి కాలేజీ సాంక్షనయింది వదినా. కాలేజీ మన స్థలం పక్కనే పడుతుందట. ఇంకా ఎవరికీ తెలియదనుకో...కిష్టమాచార్లు చెప్పాడు నాకు...మన స్థలం వెయ్యిగజాలుంది... కాలేజీ పడిందంటే గజం పాతిక రూపాయిలు పలుకు తుంది...కొట్టు మిగుల్చుకున్నా మన అప్పులన్నీ తీరగా డబ్బు పుష్కలంగా చేతికొస్తుంది...నరునికి ఘంటిసముద్రమే వస్తుంది...తాడూ బొంగరంలేని చట్కారీ సమంధాలు చూడవద్దు.

'నరసింహంగారు కాలేజీ కమిటీలో మెంబరు... ఈ రహస్యం ఆయనకీ తెలుసు...అది మభ్యపెట్టి... ఆ స్థలం తురతుర క్రయం రాయించుకుని, గజం ఏ మూడువో నాలుగువో లెక్కకట్టి, మన చేతిన చేతులుపెట్టి, అది భుక్తం చేసుకుందామని చూస్తున్నాడు దుర్మార్గుడు.

'అది కుదరకుండా చేస్తున్నావని నా మీద కక్ష.

'అంచాత నే నివ్వాలిసిన ఎనిమిది వందల ప్రోనోటు బాకీకీ నామీద దావా వేశాడు...నీతో చెప్ప లేదు బెంబేలైపోతావని...అది మునసబుకోర్టులో ఎక్సపార్టీగా డిక్రీ అయిందిలే. నామీద వారంటు పుట్టింది.'

'వారంటే?'

జానకమ్మ కొయ్యబారిపోయింది.

పిల్లలు అదేమిటో అర్థంకాక ఒకళ్లమొహా లొకళ్లు చూచుకున్నారు

'ఆ...అరెస్ట్ వారంటు.. తాగలేక పిల్లి బొర్ల దోసుకుందట...నన్ను కటకటాల వెనక్కి నెడితే నీ మెడలు వంచవచ్చుననుకుంటున్నాడు వాడు... కావాలంటే దావా వేసుకోపీ.. అది తేలేసరికి కాలేజీ పడపోపడుతుంది...మరేమీ ఫరవాలేదు...ఈలోపుగా కొట్టుమీద అమ్మకాలు సాగితే ఇల్లు ఎత్తిపోతుంది కదా.

'విశ్వాయికీ కొట్టుమీద అనుభవముంది ఇది వరలో.

'ఈ రెండు రోజులూ ఇంటికి రాలేదు నేను అరెస్టు చేస్తారని...అక్కడా అక్కడా దాక్కున్నా ననుకో...కాని ఎన్నాళ్లని దాగను? పిడుగుకి గొడు గడ్డమా?'

'అయితే నిన్ను జెయిలుకి పంపి మే మిక్కడ కులాసాలో కూచోమా?'

జానకమ్మకిదంతా ఏ పాపఫలమో అని కోతగా వుంది లోపల.

'అదిగో, ఆ నీళ్ళు గారిపోవడమే వద్దు...ఏమీ భంగారు లేదు-జెయిలన్నావా? ఇదిగో మన ఈ అద్దె కొంపకన్న గట్టిగానే వుంటుంది...చెక్కతలుపులికి బదులు ఊచలతలుపులు...వసీపోటా ఉండదు... ఇంత తిననూ, పండుకోనూ...ఐలాదూరు తిరగ నివ్వరు...ఏదో నా కంచం నేను కడుక్కోవాలి... నా బట్ట నేను ఉతుక్కోవాలి అంతే...దివ్యదకోరంగా వుంటుందిలే...ఓ యబ్బో ఇల్లాంటివి చూశాలే వదినా...మూడు నెలలు...కాదంటే ఆరు నెలలు కూచుంటా...నువ్వుమాత్రం మెత్తబడేవుసుమ్మా,వదినా... స్తలంమాట...వాడి మంత్రం పారనివ్వకు అంతే...'

జైలంటే అతని వర్ణన విడ్డూరంగా వుంది జానకమ్మకి.

'ఇక నేను వెళ్ళి పోలీసుస్టేషన్లో హాజరయి పోతాను మరి...తప్పించుకుంటూ దొరికినట్టయినా, లాఠీలతో బాత్తారు వాళ్ళు.


'వెడుతున్నా వదినా-జాగర్త.'

హుటాహుటిని నడిచిపోతున్నాడు కిష్టయ్య.

జానకమ్మ గుమ్మందగ్గర్నే నిల్చుంది.

'ఎంత దురవస్థ వచ్చింది నాయనా నీకు... నాకోసం...నా పిల్లలకోసం ఎన్నిపాట్లు తెచ్చిపెట్టాను నీకు?...లోకం 'కులద్రోహుడు' అంటుంది నిన్ను.'

పైటకొంగుతో కళ్ళొత్తుకుంది జానకమ్మ.



ఇత్యర్థక నామ్నీకరణం, కాంక్షార్థక నామ్నీకరణం

శ్రీ చేకూరి రామారావు

విషయార్థక నామ్నీకరణాలుగా ప్రతిపాదితమైన 'అని' 'అటం' 'అది' శబ్దాలు ఇతర నామ్నీకరణాల్లో కూడా ఉపయుక్తమవుతయ్యని మొదటి వ్యాసంలో చెప్పబడింది. వాటిల్లో 'అని'కున్న ఇతర ప్రయోజనాలనుగురించి చర్చించటం ఈ వ్యాసోద్దేశం.

ఒక వక్త ప్రయోగించిన భాషాంశాలను అదే వక్తగాని, మరో వక్తగాని ఇతరులకు నివేదించే అవసరం భాషావ్యవహారంలో సర్వసామాన్యం. అందుకు భాషలు వేరువేరు పద్ధతులు అవలంబిస్తై. అనువదించదలచుకున్న భాషాంశానికి సంస్కృతంలో 'ఇతి' శబ్దాన్ని సంధిస్తారు. ఈ నామ్నీకరణానికి పేరు ఈ శబ్దంనుంచే వచ్చింది. తెలుగులో 'ఇతి'స్థానంలో 'అని' అని ప్రయోగిస్తాం. ఇతర ద్రావిడభాషల్లో కూడా 'అని'కి సరూపమైన పదమే ఇట్లాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. తమిళంలో అది 'ఎన్ఱు' అనే రూపంతోనూ, కన్నడంలో 'ఎందు' అనే రూపంతోనూ ఉంటుంది. తెలుగులో లాగానే ఆ భాషల్లోకూడా ఈ రూపాలకి ఇత్యర్థబోధతోపాటు విషయార్థబోధకూడా ఉంది. ఈ రకమైన తులనాత్మక పరిశీలన విస్తృతంగా జరిపితే ప్రాచీన ద్రావిడంలో వాక్యనిర్మాణానికి సంబంధించిన విశేషాలు బయటపడవచ్చు. కాని ప్రస్తుతం ఈ వ్యాసపరిధి పరిమితి వర్ణనాత్మక పరిశీలన మాత్రమే.

ఈ ఇత్యర్థక నామ్నీకరణం ఇతర నామ్నీకరణాలకన్నా కొన్నివిషయాల్లో భిన్నమైంది. మిగతా నామ్నీకరణాలు కొన్నిరకాల వాక్యాలకే సాధ్యమవుతై. ఇత్యర్థకానికి ఈఅంక్ష వర్తించదు. ఏ వాక్యమైనా ఇత్యర్థక నామంగా వర్తించవచ్చు. అసలు వాక్యమే కానక్కర్లేదు. వాక్యాంశమూ కావచ్చు. పదమూ కావచ్చు, పదాంశమూ కావచ్చు. మహావాక్యమూ కావచ్చు. అంటే ఈ ఇత్యర్థక నామ్నీకరణానికి పరిమితి లేదు. ఇంకో విశేషమేమంటే ప్రపంచంలో మానవ వ్యవహారంలోఉన్న ఏ భాషైనా దీనికి విషయమే. ఇతర నామ్నీకరణాలు భాషలో ప్రతిపాదించబడిన అర్థప్రధానాలు. ఇత్యర్థక నామ్నీకరణానికి భాషే విషయం. ఇంతకు పూర్వపు వ్యాసాల్లో చర్చించిన విషయార్థక, సందేహార్థక నామ్నీకరణాలకి భాషలో ప్రతిపాదితమైన విషయం (information ప్రధానం. ఈ నామాలు విషయగ్రహణ, విషయసేకరణ సంబంధి ధాతువులతో ప్రయోగ యోగ్యాలు. ఇత్యర్థక నామం శబ్ద కర్మ ధాతువులతో ప్రయోగ యోగ్యం. 'అడుగు' 'అను' 'చెప్పు' 'వ్రాయు' 'విను' మొదలైన ధాతువులు శబ్దకర్మ ధాతువులు. ఇత్యర్థకనామం ప్రశ్నార్థక వాక్య గర్భితమైనప్పుడే 'అడుగు' ధాతువు సమాపక క్రియగా రాగలదు. 'అడుగు' అంటే తదర్థకమైన 'పృచ్ఛించు' 'ప్రశ్నించు'వంటి ధాతువులుకూడా గ్రాహ్యాలే. 'అడుగు' ధాతువు ప్రశ్నార్థక శబ్ద కర్మ ధాతువు. మిగతా శబ్దకర్మ ధాతువుల కీనియమం లేదు ఉదాహరణ కీకింది వాక్యాలు గమనించండి.

(59) మాట్లాడే భాషకు వ్యాకరణం ఎట్లా రాస్తారు? అని పండితులు అడుగుతారు.

(60) వ్యాకరణంలేని భాషే ఉండదు (అని, అంటారు భాషా శాస్త్రజ్ఞులు.

వాక్యం (59) లో 'అడుగు' స్థానంలో ఏ శబ్దకర్మ ధాతువునైనా ప్రయోగించవచ్చు. కాని

వాక్యం (60) లో ప్రశ్నార్థకేతర శబ్దకర్మ ధాతువులే ప్రయోగార్హాలు. వాక్యం (60) లో 'అను' ధాతు నిష్పన్న క్రియా రూపపరకమైన 'అని' కి వికల్పాన్ని సూచించటంకోసం బ్రాకెట్లలో ఉంచబడింది. ఇత్యర్థక శబ్దం చేర్చిన విధ్యర్థక వాక్యంలో కొన్ని మార్పులు జరుగుతై. ఇత్యర్థక శబ్దపరక విధిని పరోక్షవిధి అనవచ్చు గాని అందులో కొన్ని చిక్కు లున్నై. విధిని మరొకరిద్వారాచేస్తే పరోక్ష విధి అనవచ్చు. కాని ఒకే వ్యక్తి తను ఇచ్చిన విధి (Command) ని తానే విధి గ్రహీతకు కాని మరొకరికిగాని వేరొక సమయంలో గుర్తు చెయ్యవచ్చు. నివేదించవచ్చు. అప్పుడు అది విధి నివేదన అవుతుంది. ఈ రెండు సందర్భాల్లోను విధ్యర్థక వాక్యానికి 'అని' చేరుతుంది. పరోక్షవిధిలో 'అని'కి ముందున్న వాక్యంలోనేగాక ఆ వాక్యం నామంగా ప్రవర్తించే వాక్యంలోనూ క్రియ విధ్యర్థకం కావాలి. విధి నివేదనలో అది అవిధ్యర్థకం కావాలి. ఉదాహరణకి ఈ కింది వాక్యాలు గమనించండి.

(61) పిల్లలని త్వరగా అన్నం తినమని చెప్పు.

(62) ఊర్మిళని ఊరినుంచి వెంటనే రమ్మని రాశాను.

వాక్యం (61) లో 'అని'కి ముందూ, తర్వాతా విధ్యర్థక క్రియలే ఉన్నై. దీన్ని పరోక్ష విధి అనవచ్చు. వాక్యం (62) లో చివరిక్రియ ('అని' కి తరవాత క్రియ) అవిధ్యర్థకం. దీన్ని విధి నివేదన అనవచ్చు. ఈ పై వాక్యాల్లో ఇంకా గమనించవలసిన విశేషాలున్నై. అవి ఇవి : 1. 'తినమని', 'రమ్మని' అనే రూపాల్లో మకారాగమం. 2. 'పిల్లలని', 'ఊర్మిళని' అనే రూపాల్లో ద్వితీయా విభక్తి ప్రత్యయం.

మకారాగమాన్ని సాధించటానికి రెండు మార్గాలున్నై. ప్రాచీన భాషలో 'ము'వర్ణకం విధి బోధకం. ఆధునిక భాషలోకూడా దాన్నే గ్రహించి 'అని' పరమైనప్పుడు తప్ప మిగతా అన్నిచోట్లా ఆ ప్రత్యయానికి లోపం చెప్పుకోవటం ఒక పద్ధతి. అప్పుడు ముపర్ణకం మిగిలినచోట పరరూప సంధివల్ల అంత్యస్వరలోపమూ, సమస్వరసూత్రం వల్ల క్రియాపదంలోని ప్రథమేతర 'ఉ'వర్ణానికి 'అ'వర్ణాదేశం చెప్పుకోవచ్చు. 'కటి', 'కలటి', 'వడుటి', 'మటి' మొదలైన ప్రత్యయాలు చేరినప్పుడు సమస్వర సూత్రంవల్లనే ధాతువులోని ప్రథమేతర 'ఉ' వర్ణాలు 'అ' వర్ణాలవుతై. పై ప్రత్యయాల అంతంలో 'టిత్తు' సమస్వరతను సాధించటానికే. అంటే బాలవ్యాకరణ పద్ధతిలో ఆధునిక భాషలో 'ము' ప్రత్యయాన్ని 'ముటి'గా విధించుకొని ఉద్దిష్ట రూపాన్ని సాధించుకోవచ్చు. స్పష్టతకోసం రూప నిష్పత్తిని కింది విధంగా చూపించవచ్చు.

తిను + ముటి + అని —> తినము + అని —> తినమని దీర్ఘాంతైక స్వరయుతధాత్వాదేశ రూపాలదీర్ఘ స్వరానికి ముప్రత్యయం పరమైనప్పుడు స్వర హ్రస్వీకరణం, మకారద్విత్వం ప్రాచీన భాషలోనూ ఉన్నై. [చూ. బాలవ్యా. క్రియ. సూ. 61]. అవే ఆధునిక భాషకూ వర్తించుకోవచ్చు. అప్పుడు రూపనిష్పత్తి ఇట్లా చూపించవచ్చు.

రా + ముటి + అని —> రా + ము + అని —> రమ్మని.

ఈ పద్ధతి ప్రాచీన వ్యాకరణానుసారి, భాషా పరిణామ సూచి. కాని ఈ పద్ధతిలో లోపమల్లా ఒకటే. కేవలం 'అని' కి ముందు మాత్రమే కనిపించే మకారంకోసం మధ్యమపురుష ఏకవచన ప్రత్యయంగా 'ముటి' ని విధించుకోవటం, మళ్లీ దానికి లోపం చెప్పుకోవటంలో ప్రక్రియాలాఘవం కనిపించదు. విధ్యర్థక క్రియారూపానికి 'అని' పరమైనప్పుడు 'మ'కారంకాని, 'అమ్' శబ్దంకాని ఆగమం అవుతుందని చెప్పటం తేలికైన పద్ధతి. ఈ ప్రక్రియలలో ఏదో ఒకదానిని ఎన్నుకోవటం వ్యాకర్తల దృష్టిభేదాన్నిబట్టి ఉంటుంది.

ఇక పిల్లలి'ని' 'ఊర్మిళ'ని' అనే శబ్ద రూపాల్లో ద్వితీయా విభక్తి గురించి: (61) (62) సంఖ్యగల వాక్యాల్లో 'పిల్లలు' 'ఊర్మిళ' అనే నామాలు 'తిను', 'వచ్చు' అనే ధాతువులనుంచి

ఏర్పడిన క్రియలకు కర్తృపదాలు. 'అని' యోగంతో అవి కర్మబోధకాలవుతై. కాని అట్లా అనటంతో ఒక చిక్కుంది. కర్మ అంటే ఏ క్రియకు? అనే ప్రశ్నకు వ్యాకర్త సమాధానం చెప్పాలి. ఆ వాక్యాల సమాపకక్రియలకు కర్మ అనలేం. ఎందుకంటే అవి శబ్దకర్మ ధాతువులు. పైగా 'అని' అనుప్రయుక్తమైన మొత్తం వాక్యం ఆ ధాతువులకి కర్మ కాగలదు కాని అందులోని పృథక్పదం కాదు. ఇంకో పద్ధతి ఇత్యర్థకమైన 'అని'కే పైన పేర్కొన్న నామాల్ని కర్మలుగా భావించటం. కాని 'అని'కి అను ధాతువుతో రూపసంబంధం ఉన్నప్పటికీ దాన్ని క్త్వార్థకంగా గ్రహించక అవయవి సూచకం (Construction Marker) గా నిర్దేశించాం కాబట్టి అదీ సరిపడదు. ఏదెట్లా ఉన్నా ఈ ద్వితీయావిభక్తియోగానికీ, 'అని'కీ దగ్గరి సంబంధం ఉన్నట్లు కనిపిస్తున్నది. దీన్ని సాధించటానికి సంతృప్తికరమైన ప్రక్రియ ఏదీ ఈ వ్యాసకర్తకింకా గోచరించలేదు.

ఇక్కడ ఇంకో చిన్నప్రక్రియావిశేషం కూడా ఉంది. (61) (62) సంఖ్యగల వాక్యాలలో సమాపక క్రియాపదాలైన 'చెప్పు', 'రాశాను' అనే క్రియలు అముఖ్యకర్మ పదాపేక్షకాలు. ఎవరికి అన్న ప్రశ్న వేసుకుంటే సమాధానంగా వచ్చే 'పిల్లలకి' 'ఊర్మిళకి' అన్న పదాలే ఈ పై క్రియలకు అముఖ్యకర్మలు. ఈ పదాలు పై వాక్యాల వెలుపలి నిర్మాణం (surface structure) లో కనిపించకపోయినా లోపలి నిర్మాణం (deep structure) ఉన్నయ్యని ఊహించుకోవాలి. అవి కొన్ని సందర్భాల్లో వెలుపలి నిర్మాణంలోకి వస్తయ్యని ఈ వ్యాసం తరవాత భాగంలో తెలుస్తుంది. ఈ అముఖ్య కర్మపదాల సంయోగంలో 'అని' నామ్నీకరించిన విధ్యర్థక వాక్యాల కర్తృపదాలైన మధ్యమ పురుష సర్వనామాలకు లోపం వస్తుంది. అముఖ్య కర్మపదాలూ, విధ్యర్థక వాక్యాల కర్తృపదాలూ ఒకే వ్యవహర్తని (ఇక్కడ శ్రోత) సూచిస్తై గనక రెండూ కలిసి ఒకే పదంగా ఏర్పడతై. అర్థావబోధ కవసరంలేని పునరుక్తిని తొలగించటం ప్రయోజనం కావచ్చు.

ఇంగ్లీషులో direct indirect speech అని రెండు రకాల వాక్యాలున్నై. direct sqeech లో వక్తవాచకం యథాతథంగా అనూదితం. Indirect speech లో కొంత మార్పు జరుగుతుంది. రాతలో direct speech కి quotation marks పెడతారు. Indirect speech లో 'that' అనే శబ్దంతో clause ఆరంభిస్తారు. Direct speech లోని వక్తను సూచించే ఉత్తమ పురుష సర్వనామానికి బదులు Indirect speech లో ప్రథమ పురుష సర్వనామం ఉపయోగించబడుతుంది. తెలుగులో ఈ రకమైన వాక్యవిభాగం లేదని తెలుగు భాషలో కృషిచేసిన భాషాశాస్త్రజ్ఞులు కొందరు అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు ప్రొఫెసరు భద్రిరాజు కృష్ణమూర్తిగారు 'Telugu has no indirect (or reported) speech of the kind found in English in clauses connected by 'that' to the main clause' అని రాశారు.[1] కాని తెలుగులో కొన్ని వాక్యాల్లో ఈ రకమైన విభాగం చేయవచ్చునని తోస్తున్నది. 'అని'కి ముందున్న వాక్యం విధ్యర్థకమైనప్పుడూ, అవిధ్యర్థకమైతే ఆ వాక్యంలో వక్తృబోధకపదం ఉత్తమపురుషలో ఉన్నప్పుడూ తెలుగులో direct and indirect speech విభాగం చెయ్యటానికి వీలున్నది. ఇంతకుముందు ఉదాహరించిన (61) (62) సంఖ్యగల వాక్యాలను indiret speech కి ఉదాహరణలుగా గ్రహించవచ్చు. ఆ వాక్యాల్లో ఇత్యర్థక నామాలు విధ్యర్థక వాక్యాలనుంచి నామ్నీకృతాలు. ఆ వాక్యాలు direct speech లో ఇట్లా ఉంటై.

(63) పిల్లలకి 'మీరు త్వరగా అన్నం తినండి' అని చెప్పు.

(64) ఊర్మిళకి 'నువ్వు ఊరినుంచి త్వరగా రా' అని రాశాను.

విధ్యర్థక వాక్యాలు ఇత్యర్థక నామాలుగా ప్రవర్తించినప్పుడు direct speech లో గమనించాల్సిన విశేషాలు కొన్ని ఉన్నై. direct speeb లో కర్తృపదాలు మధ్యమపురుష సర్వనామాలు indirect

---

1. Bh. Krishnamurti & P. Sivanada Sarma, A Basic Course in Modern Telugu, Hyderabad, 1968-Page 173.

speech లో కనిపించని 'చెప్పు' 'వ్రాయు' ధాతువుల అముఖ్య కర్మలు direct speech లో తమ సహజ రూపంలో కనిపిస్తై. Indirect speech లో లోపించిన విధ్యర్థక క్రియల ఏకవచన బహువచన భేదం direct speech లో ప్రత్యక్షమవుతుంది. Indirect speech లో కనిపించే 'ను' కారాగమం direct speech లో ఉండదు. ఈ రెండు రకాల వాక్యాలకీ ఒకేరకపు లోపలి నిర్మాణం (deep structure) ఉందనుకుంటే (ఉందనటమే సమంజసం) direct speech లోపలి నిర్మాణానికి ఎక్కువ సన్నిహితం అవవచ్చు.

ఇంతకుపూర్వం (61) (62) సంఖ్యగల వాక్యాల్లో కనిపించే ద్వితీయావిభక్తి ప్రత్యయాన్ని పరిశీలించటానికి రెండుపద్ధతులు సూచించబడినై. ఇప్పుడు మూడోపద్ధతిని గురించికూడా ఆలోచించవచ్చు. వాస్తవీకరించిన విధ్యర్థకవాక్య కర్తృపదం, ఈ వాక్యం నామంగా ప్రవర్తించే వాక్యంలోని సమాపక క్రియతో అన్వయించే అముఖ్య కర్మ ఒకే మనిషిని సూచిస్తే, అముఖ్యకర్మపదం కర్తృపదాన్ని తొలగించి ఆస్థానాన్ని ఆక్రమించు కుంటుంది. ఆ ప్రయత్నంలో అముఖ్యకర్మ తన కారకాన్ని మార్చు కుంటుంది. అంటే 'కు' విభక్తి 'ను' విభక్తిగా మారుతుంది. ఈ పద్ధతి అయినా ఈ వాక్యాల్లో జరిగే వ్యాకరణకార్యాన్ని పూర్తిగా నిరూపిస్తున్నట్టు అగపడదు. ద్వితీయావిభక్తి ప్రత్యయంగా కనిపించే 'ను' శబ్దం ఏ క్రియతో అన్వయిస్తుందో ఈపద్ధతి లోనూ అస్పష్టమే. ఇంకా ఎక్కువ పరిశోధన జరిగి తేనేగాని దీనికి ఒక సుష్ఠుమార్గం కనిపించదు.

Direct speech కీ Indirect speechకీ భేదం కనిపించే ఇంకోచోటు ఉదాహృత వాక్యంలో వక్తృబోధక పదం ఉత్తమ పురుషలో ఉన్నప్పుడు ఉదాహరణకు ఈ కింది వాక్యాను direct speech కి లక్ష్యాలుగా గ్రహించవచ్చు.

(65) 'నాది ప్రజల వుద్యమం' (అని) అన్నారు గురజాడ అప్పారావుగారు.

(66) 'మా కవిత్వాన్ని వచన కవిత్వం అని అనవీయం' (అని) అన్నారు దిగంబరకవులు.

పై వాక్యాల్లో వక్తృబోధకపదాలు ఉత్తమ పురుషలో ఉన్నై. వాక్యం (65)లో అది ఏకవచనం లోనూ, (66) లో బహువచనంలోనూ ఉంది. ఈనేను, మేము శబ్దాలకి బదులు indirect speechలో 'తను', 'తము' శబ్దాలుఉంటే (65) (66) సంఖ్యగల వాక్యాలు indiect speech కిలాగా ఉంటై.

(67) తనది ప్రజల వుద్యమం (అని) అన్నారు గురజాడ అప్పారావుగారు.

(68) తమ కవిత్వాన్ని వచన కవిత్వం అని అనవీయం (అని) అన్నారు దిగంబర కవులు.

(65) (66)సంఖ్యగల వాక్యాల్లో 'నేను,' 'మేము', శబ్దాల విశేషణరూపాలైన 'నా' 'మా' శబ్దాలను ప్రయోగించింది ఉదాహృత వాక్యంలోని వక్త. (67) (68) సంఖ్యగల వాక్యాల్లో 'తను' 'తము' విశేషణరూపాలైన 'తన', 'తమ' శబ్దాలను ప్రయోగించింది వాక్యం అనువదించిన వక్త. ఇంగ్లీషులో ఈ సందర్భంలో 'తను' 'తము' శబ్దాలస్థానంలో ప్రథమ పురుషసర్వనామరూపాలను ప్రయోగిస్తారు. తెలుగులోకూడా ఈ శబ్దాలను ఉత్తమపురుష సర్వనామాలకు కాకుండా ప్రథమపురుషసర్వనామాలకు ఆదేశమైన రూపాలుగానే గ్రహించవచ్చు.

ఉదాహరణకు ఈకింది వాక్యాన్ని గమనించండి.

(69) ఆయన 'తన' స్వార్థంకోసం ఈపని చెయ్యలేదు.

ఈ పై వాక్యంలో ఇత్యర్థక నామం లేనేలేదు. అయినా 'తన' అనే శబ్దప్రయోగం ఉంది. ఈ పై వాక్యాన్ని 'తన' శబ్ద ప్రయోగంలేకుండా అనాలంటే ఈకిందివిధంగా ఉంటుంది.

(70) ఆయన ఆయన స్వార్థంకోసం ఈ పని చెయ్యలేదు.

వాక్యం (70) లో 'ఆయన' అనే శబ్దం పునరుక్తమైంది. వాక్యం (69) లో పునరుక్తమైన 'ఆయన' శబ్దానికి 'తన' ఆదేశం అయింది. ఇప్పుడు ఈ ఆదేశకార్యాన్ని ఈవిధంగా సూత్రీకరించుకోవచ్చు. ఒక వాక్యంలో రెండుపదాలు ఒకేమనిషినిగాని, మనుషుల్నిగాని సూచించినప్పుడు అందులో ఒక పదానికి

ఏకవచనంలో 'తను', బహువచనంలో 'తము' శబ్దాలాదేశాలవుతై. అంటే నామ పునర్గ్రహణంలో వచన భేదానుసారిగా 'తను' 'తము' అనేరూపాలు వస్తున్న మాట. ఈ శబ్దాలు ప్రాచీనభాషలో 'తాను' 'తాము' అనే రూపంతో ఉంటై. 'ఆత్మార్థం బోధకంబగు నామాస్మదర్థాభిధాయియు నగు'(ప్రౌఢవ్యా. శబ్ద. సూ. 78) అనే ప్రౌఢవ్యాకరణ సూత్రం ఆధారంగా 'తా' శబ్దమును దానియొక్క రూపములును తెనుగున 'నేను, అతడు' అనునట్టి యర్థములలోఁ బ్రయోగింపబడినవి'[2] అని శ్రీ జోగి సోమయాజులుగారు ప్రమాదవశాన రాశారని తోస్తున్నది.

పైన పేర్కొన్న సూత్రానికి లక్ష్యంగా నన్నయ్యగారి భారతావతారికలోనుంచి 'తన కిష్టుఁడు నీ సహాధ్యాయుడునైనవాడు' అనే ప్రయోగం ఇచ్చి 'తనకున్—నాకు' అని ప్రౌఢవ్యాకర్త అర్థవివరణ చెయ్యటం కూడా పొరపాటువల్లనే. నన్నయ్యగారు తమ్ము గురించి ఎప్పుడూ ప్రథమ పురుషలోనే చెప్పుకొన్నారు. ఆ తరవాత పద్యంలోనే 'నానా రుచిరార్థసూక్తినిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహాభారత సంహితారచన బంధురుడయ్యె' అని ప్రథమ పురుషలో ఉంది. ఈ పై ప్రౌఢవ్యాకరణసూత్రానికి వ్యాఖ్యలో శ్రీ భాష్యకారాచార్యులుగారు 'నా శబ్దమునకుఁ బునర్గ్రహణమునఁ దా శబ్ద మెప్పుడును బ్రయోగింపఁబడదు'[3] అని అనటం సమంజసంగా ఉంది. 'తాను' శబ్దాన్ని గురించి Arden చెప్పిన ఈకింది విషయాన్ని కొద్ది మార్పులతో అంగీకరించవచ్చు.

'The reflexive pronoun తాను (Except when used in the plural number instead of వారు) can only be used in reference to the subject of a principal verb in the third person; and whenever such a reference is required to be made, తాను should always be used'[4] అని Arden తన వ్యాకరణంలో రాశాడు. Arden రాసిన పై వాక్యంలో Subject అనకుండా Repetition of a noun అనటం ఉచితం. అందువల్లనే తెలుగులో నామ పునర్గ్రహణం అనటం.

విషయార్థక నామంలాగే ఇత్యర్థకనామాన్ని కూడా విశేషణంగా మార్చి శబ్దార్థక శబ్దాల ముందు ప్రయోగించవచ్చు. ఇత్యర్థకనామం శబ్ద ప్రధానమైంది అనటానికి ఇదొక ఆధారం. మాట, పదం, వాక్యం మొదలైనవి శబ్దబోధక శబ్దాలు. 'అని'కి ఉన్న విశేషణ రూపాన్ని గురించి విషయార్థక నామీకరణాన్ని గురించి చర్చించేటప్పుడు చెప్పుకున్నాం. ఇక్కడా అదే ప్రయుక్తం. ఉదాహరణకు వాక్యం (65) ని ఈ విధంగా మార్చవచ్చు

(71) 'నాది ప్రజల పద్యమం' అనే వాక్యం అన్నారు గురజాడ అప్పారావుగారు.

(65) (71) సంఖ్యగల వాక్యాలు సమానార్థకాలుగా గ్రహించవచ్చు.

ఈ 'అని' శబ్దానికున్న భిన్నప్రయోజనాలవల్ల ఒకోసారి కొన్ని వాక్యాలు భిన్నార్థబోధ చెయ్యవచ్చు. ఉదాహరణకి ఈ కింది వాక్యం గమనించండి.

(72) అతను 'నేను ఎల్లుండి వస్తాను' అని మీతో అన్నాడా?

ఈ పై వాక్యానికి రెండర్థాలున్నై. (73) (74) సంఖ్యగల వాక్యాలలో ఆ అర్థాలు స్పష్టమవుతై.

(73) అతను 'నేను ఎల్లుండి వస్తాను' అనే మాట మీతో అన్నాడా?

(74) అతను 'నేను ఎల్లుండి వస్తాను' అనే విషయం మీతో అన్నాడా?

వాక్యం (73) లో 'అతను' 'నేను' అనే శబ్దాలు ఒకే వ్యవహర్తను సూచిస్తై. వాక్యం (74) లో భిన్న వ్యవహర్తలను సూచిస్తై. ఇంకో రకంగా చెప్పాలంటే 'వస్తాను', 'చెప్పాడు' అనే క్రియలు వాక్యం (73) లో ఏకకర్తృకాలు, (74)లో

---

2. గంటి జోగిసోమయాజి, ఆంధ్రభాషా వికాసము, విశాఖపట్టణం. 1947 పేజీ 484.

3. భాష్యం వేంకట నరసింహ భాష్యకారాచార్యులు, త్రిలింగలక్షణశేషము అను ప్రౌఢ వ్యాకరణము—తత్వబోధినీవ్యాఖ్యాసమేతము, శ్రీ విలాస ముద్రణములు, ఇచ్ఛాపురం, 1963—పేజీ 139.

4. A. H. Arden, A progressive Grammar of the Telugu Language, The Christian Literature Society, Madras, 1955—Page 88.

భిన్నకర్తృకాలు. ఇట్లాంటి భేదంవల్లనే 'అని'కున్న భిన్న ప్రయోజనాల్ని పృథక్కరించాల్సి వచ్చింది.

వాక్యం (73) లో అస్మదర్థక శబ్దానికి బదులు ఆత్మార్థకశబ్దం ప్రయోగిస్తే 'మాట' అనే శబ్దానికి బదులు 'విషయం' అనే శబ్దం ప్రయోగించవచ్చు అంటే Indirect speech లో ఉన్న అనూదిత వాక్యాన్ని విశేషణంగా మారిస్తే విషయం అనే శబ్దానికి ముందు ప్రయోగించవచ్చు. ఉదాహరణకు ఈ వాక్యం గమనించండి.

(75) అతను తను ఎల్లుండి వస్తాను అనే విషయం నాతో అన్నాడా?

ఈ పై వాక్యం ఆధారంగా ఇంకో విషయాన్ని ప్రతిపాదించవచ్చు. Indirect speech లో ఉన్న వాక్యంలో 'విషయం' అనే మాట చేర్చవచ్చు, Direct speech లో వీలుండదు. అందువల్ల Indirect speech లో 'అని'కి ముందున్న వాక్యం ఇత్యర్థకనామం అనకుండా విషయార్థక నామంగా గ్రహించటమే సముచితంగా కనిపిస్తున్నది. అంటే Direct speech కీ Indirect speech కీ ఉన్న భేదం ఇత్యర్థక నామీకరణానికీ, విషయార్థక నామీకరణానికీ ఉన్న భేదంలాంటిదే. ఈ ప్రతిపాదనలో ఉన్న సాధకబాధకాలను గురించి ఈ వ్యాసకర్త ఇంకా లోతుగా పరిశీలించలేదు. ప్రస్తుతానికిది సూచనప్రాయమే. ఇంగ్లిషులో కూడా 'That' అనే శబ్దమే Indirect speech లోనూ, విషయార్థక నామీకరణం (Factive nominalization) లోనూ ప్రయోగించటం ఈ ఊహకు మరో ఆధారం.

ఈ వ్యాసం మొదట్లో శబ్దప్రధానమైన ఇత్యర్థక నామీకరణానికి వాక్యసంఖ్యాపరిమితిగాని దీర్ఘపరిమితిగాని లేదని చెప్పబడింది. అంతేకాదు. అనూదిత శబ్ద సముదాయం కాని వాక్య సముదాయంకాని ఫలాని భాషే కావాలన్న నియమంకూడా లేదని చెప్పబడింది. ఇది ఇంగ్లిషులో అయినా ఇంతే, తెలుగులో అయినా ఇంతే. బహుశా ప్రపంచభాషలన్నిట్లోనూ ఇంతే కావచ్చు. కాని indirect speech లో ఈ స్వేచ్ఛ లేదు. Indirect speech లో 'అని' కి ముందున్న శబ్ద సముదాయం అంతర్నిర్మాణం (internal structure) ఉన్న వాక్యమే కావాలి ఆ వాక్యమైనా అనువక్త (reporter) భాషలోనే ఉండాలి. ఇంగ్లిషులోకూడా ఇట్లాంటి నియమమే వర్తిస్తుంది. అందువల్ల ఇంగ్లిషులోనూ, తెలుగులోనూ indirect speech లోని గర్భవాక్యాలను విషయార్థక నామాలుగానే గుర్తించటం సమంజసం. ఇంగ్లిషులోనూ తెలుగులోనూ indirect speech విషయప్రధానం, direct speech శబ్దప్రధానం బహుశా direct speech, indirect speech భేదం ఉన్న భాషలన్నిటికీ ఈ సూత్రీకరణ వర్తించవచ్చు.

4. కాంక్షార్థక నామీకరణం

'అని'కున్న ఇంకో ప్రయోజనం కొన్నివాక్యాల్ని కాంక్షార్థక నామాలుగా మార్చటం. ఈ నామీకరణానికి 'వలయు' అనే అనుబంధక్రియఉన్న వాక్యాలే విషయాలు. ఆధునికభాషలో 'వలయు'కు వ్యస్త ప్రయోగంలేదు మధ్యంతక్రియల తరవాతనే ప్రయోగించబడుతుంది. వ్యవహారంలో 'వలయు'కు 'ఆలి' కొందరి భాషలో 'ఆల' అనే శబ్దం ఆదేశం అవుతుంది తమిళంలో 'వలయు'అనే అర్థంలో 'వేండుం' లేక 'వేణుం' అనే శబ్దం స్వతంత్రక్రియగానూ, అనుబంధక్రియగానూ ఉపయోగిస్తారు. 'వలయు'కు కాలబోధలో 'వచ్చు', 'ఉండు' ధాతువులు కాలవాహకాలుగా వస్తాయని పూర్వం చెప్పబడింది. ఈ నామీకరణానికి కాలబోధ లేకుండా 'వలయు' ధాతువు సమాపకక్రియగా అంతంలో వచ్చే వాక్యాలే విషయాలు. ఆ వాక్యాలకు 'అని' చేర్చటంవల్ల కాంక్షార్థకనామం ఏర్పడుతుంది. ఈ నామం 'ఉండు' 'కలుగు', పుట్టు'వంటి ధాతువులకు కర్తృపదంగా వ్యవహరించబడింది. ఉదాహరణకు ఈ కిందివాక్యాల్ని పరిశీలించండి.

---

5. ఈ వ్యాసాల్లో 'కర్త' అనే పదం Subject అనే అర్థంలో ప్రయోగించబడింది. ఈ పదం భాష వెలుపలి నిర్మాణానికి (Surface structure) సంబంధించింది. నిజానికి కర్త అనే పదం 'Agent' అనే అర్థంలో వాడటమే సమంజసం. Agent అనే పదం భాషలోపలి నిర్మాణానికి (Deep structure) సంబంధించిన పదం అంటే Agent, Subject అనే మాటలు సమానార్థకాలు కావు. 'చేత వర్జితంబు కర్తకగు. ధాత్వర్థ వ్యాపారాశ్రయంబు కర్తనాబడు.' (బాలవ్యా. కారక. సూ. 3) అనే సూత్రంలో కర్త Agent అనే అర్థంలోనే వాడబడినట్లు కనిపిస్తున్నది.

(76) నాకు వ్యవసాయం చెయ్యాలని ఉంది.

వాక్యం (76) లో ఉంది అనే క్రియకు 'అని'కి పూర్వమున్న వాక్యం కర్తగా వ్యవహరిస్తుంది. ఈ వాక్యం వక్తకున్న కోరికను సూచిస్తున్నది. అందుకే దీన్ని కాంక్షార్థకనామ్నీకరణం అనటం. వాక్యం (76)లో 'చెయ్యాలి' అనే క్రియాపదానికి కర్తృపద మైన 'నేను' శబ్దం లోపించింది. కాని లోపలి నిర్మాణంలో ఈ శబ్దాన్ని ఊహించాలి. ఈ పై వాక్యాన్ని ఈ విధంగా విశ్లేషించి చూపించవచ్చు.

(77) i నాకు (ఒక కోరిక) ఉంది

ii [నేను వ్యవసాయం చెయ్యాలి]

(77) ని గురించి వివరించేముందు ఇక్కడ రెండు పారిభాషిక పదాలు ప్రవేశపెట్టాల్సి ఉంది. ఇందులో (77) i ను గర్భివాక్యం (matrix sentence) (77) ii ను గర్భవాక్యం (Constituent sentence) అని అనవచ్చు. గర్భివాక్యం గర్భవాక్యాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. ఈ సందర్భంలో మొదటి వ్యాసంలో ప్రవేశపెట్టిన అవయవి–అవయవం అనే పదాలమధ్య సంబంధం గుర్తు తెచ్చుకో తగింది. గర్భివాక్యంలో కాంక్షించే వ్యక్తి గర్భవాక్యంలో కర్త ఒకేమనిషిని సూచిస్తే గర్భివాక్యంలో 'ఒక కోరిక' స్థానంలో గర్భవాక్యానికి 'అని' చేర్చి ప్రయోగించవచ్చు. అట్లా చేర్చినప్పుడు గర్భవాక్యంలో కర్త లోపిస్తుంది. ఈ ప్రక్రియాగతి (Grammatical Process) ని ఈ కింది విధంగా మూడు దశల్లో వివరించవచ్చు.

(78) i నేను+కు- [ఒక కోరిక] - ఉంది

[నేను వ్యవసాయం చెయ్యాలి]

ii [నేను]+కు- [నేను] వ్యవసాయం చెయ్యాలి అని-ఉంది.

iii +కు-నేను ☐ వ్యవసాయం చెయ్యాలని ఉంది.

నేను + కు = నాకు

(78) i, ii ల లో బాణం గుర్తులతో సూచించిన విధంగా ఆదేశకార్యం జరుగుతుంది. ఈ ఆదేశ కార్యానికి ఏకరూపత (Identity) నియమం. (78) iii లో బాణం గుర్తుతో సూచించిన విధంగా శబ్దాల స్థానాల్లో మార్పు జరుగుతుంది. (78) i లో సూచించిన ఆదేశం జరగగానే గర్భవాక్యానికి 'అని' చేరుతుంది. (78) ii లో గర్భివాక్యంలో 'నేను' శబ్దం గర్భవాక్యంలో తనతో ఏకరూపత ఉన్న 'నేను'ను తొలగించి ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ ఆదేశ కార్యఫలితంగా 'కు' వాక్యాదికి వచ్చింది. ఇది భాషాపద్ధతికి విరుద్ధం కాబట్టి (78) iii లో సూచించిన 'కు' శబ్దానికి స్థానచలనం జరగటం తప్పనిసరి. ఈ రకమైన ప్రక్రియాగతి మిగతా నామ్నీకరణాలకి కూడా చూపించవచ్చు.

ఈ పై ప్రక్రియాగతిని పరివర్తన వ్యాకరణంలో (Transformational grammar) సూత్ర పద్ధతిని సూచించాల్సి ఉంటుంది. అవి ఎన్నో రకాల వాక్యాలకు ప్రక్రియాగతిని సూచించగల సమర్థమై ఉండాలి.

ఏకరూపత ఒక నియమంగా పైన ప్రతిపాదించబడింది. ఈ ఏకరూపత లేనప్పుడు (78) లో సూచించిన ఆదేశకార్యాలు జరగవు. ఉదాహరణకు ఈ కింది వాక్యం పరిశీలించండి.

(79) మా తండ్రిగారికి–నేను వ్యవసాయం చెయ్యాలని ఉంది.

వాక్యం (79) లో గర్భివాక్యంలో కాంక్షించే మనిషిని సూచించే పదం గర్భవాక్యంలోని కర్తృపదం ఒకటికాదు. అంటే ఏకరూపత లేదు. అందువల్ల (78) ii లో సూచించిన ఆదేశకార్యం జరగటానికి వీల్లేదు.

తెలుగులో ఇంకో రకమైన కాంక్షార్థ వ్యక్తి ఉంది. వాక్యం (76) నే ఆ పద్ధతిలో ఈ విధంగా చెప్పవచ్చు.

(80) నాకు -- వ్యవసాయం చేద్దామని–ఉంది.

వాక్యం (80) 'అని'కి ముందు 'చేద్దాం' అనే క్రియా పదం ఉంది. ఆధునికాంధ్రంలో 'దాం'

ఉభయ ప్రార్థనని సూచిస్తుంది. కాని 'అని' అను ప్రయుక్తమైనప్పుడు అది ఉభయ ప్రార్థనను సూచించదు. ఉభయ ప్రార్థన క్రియకు వక్తృశ్రోతల ఏర్పాటుని సూచించే పదంమాత్రమే కర్త కాగలదు. కాని వాక్యం (80) లో అట్లాంటిది లేదు. దీన్ని వ్యాకరించటానికి కూడా రెండు మార్గాలున్నై. 'దాం'ను ఉభయ ప్రార్థన బోధకంగానే అంగీకరించి 'అని'కి ముందు ఉభయ ప్రార్థనత్వం పోతుందని చెప్పటం ఒకటి. ఉభయ ప్రార్థన క్రియగా అంగీకరించాలంటే వక్తృశ్రోతలని సూచించే ఉభయార్థక పదాన్ని గర్భ వాక్యంలో కర్తగా నిర్దేశించాలి. అందుకు వాక్యం (80) లో లోపలి నిర్మాణంలో ఆధారం కనపడదు. రెండో పద్ధతి 'వలయు'కి 'దాం'ను ఆదేశంగా చెప్పటం. అప్పుడు 'దాం'ను ఉభయప్రార్థన బోధకంగాకాక ఆదేశంలో వచ్చే శబ్దమాత్రంగానే గ్రహించాలి. ఈ ఆదేశానికి కూడా పైన పేర్కొన్న ఏకరూప విధి వర్తిస్తుంది. ఏకరూపత లేనప్పుడు ఈ ఆదేశకార్యం నిరోధిత మవుతుంది. ఉదాహరణకు ఈ కింది వాక్యం చూడండి.

*(81) మా తండ్రిగారికి–నేను వ్యాపారం చేద్దామని ఉంది.

ఈ పై వాక్యం వ్యాకరణ సమ్మతంకాదు. గర్భివాక్యంలోని కాంక్షించే వ్యక్తి, గర్భవాక్యంలోని కర్త ఒకరైనప్పుడే ఈ 'దాం' ఆదేశం అవుతుంది. ఈ ప్రక్రియాగతిని ఈ కింది విధంగా చూపించవచ్చు.

(82) [X₁] + కు – కోరిక – ఉంది
↓ ↑
[[X₂] – (కర్మపదం) – క్రియ [వలయు → దాం]]
$X_1 = X_2$

X1 X2 ఒకటే అయినప్పుడు పైన బాణం గుర్తుతో చూపించిన ఆదేశకార్యాలు జరుగుతై. 'అని' చేర్చటంవల్ల ఉత్పన్నమయ్యే ఇతర నామాలకు లాగే ఈ కాంక్షార్థక నామాన్ని కూడా విశేషణంగా మార్చి 'కోరిక' అనే పదం ముందు ప్రయోగించవచ్చు ఉదాహరణకు,

(83) నాకు వ్యాపారం చెయ్యాలనే కోరిక ఉంది.

'అని' ఇంతవరకు విషయ, ఇతి, కాంక్షార్థాల్లో నామీకరణ రకంగా పరిశీలించబడింది. 'అని' చేర్చిన గర్భవాక్యాలు గర్భివాక్యాలకు హేత్వర్థంలో విశేషణాలుగా ప్రవర్తించటం గమనించవచ్చు. ఉదాహరణకు ఈ కింది వాక్యాలను గమనించండి.

(84) అత్తగారు పెత్తనం చేస్తున్నదని కోడలికి కోపం వచ్చింది.

(85) దొంగలెప్పుడు వస్తారో అని జనం వాళ్లు భయపడతారు.

(86) వ్యాపారం చెయ్యాలని మా ఊరు వెళ్లాను.

ఈ పై వాక్యాల్లో అని'కి పూర్వం వాక్యాలు 'ఎందుకు' అనే ప్రశ్నకు సమాధానాలు. (84) లో విషయార్థక నామం, (85) లో సందేహార్థక నామం, (86) కాంక్షార్థకనామం హేత్వర్థంలో వాక్య విశేషణాలుగా ప్రయోగించబడినై. క్రియా విశేషణానికి, నామానికి లోపలి నిర్మాణంలో ఉన్న పోలిక సందేహార్థక నామీకరణాలను చర్చించినప్పుడు పేర్కొనబడింది. క్రియా విశేషణం, అనేపదం adverb అనే ఇంగ్లీషు మాటకు సమానార్థకం. adverbs ని Pridicate adverbs (ఆఖ్యాత విశేషణాలు) Sentential adverbs (వాక్య విశేషణాలు) అని విభజించవచ్చు. ఈ adverbs ని లోపలి నిర్మాణంలో నామపదాలుగనే గ్రహించాలని ఇటీవలి భాషా శాస్త్రజ్ఞులు ప్రతిపాదిస్తున్నారు. అందుకే తెలుగులోకూడా ఆ సామ్యం కనిపిస్తున్నదని పై నామాం ప్రవర్తన తెలియపరుస్తున్నది.

చాలీచాలని మెట్లు

శ్రీ పరిగి రాధాకృష్ణ

ఇక్కడ
మందహాసానికి మరుగున మూగబాధ
మంచితనం ముసుగులో మాలిన్యం
చల్లగాలినే చొరనీయని
గుబురులాంటి జీవితంలో
చీకటి తీర్చుకున్న ఆకలి!
మేధలో పండిన ప్రతి ఊహకి
జీవితంలోకి దిగడానికి
చాలీచాలని మెట్లు.
ప్రతి బలహీనతకీ బలమైన ఆసరా.
మనసు వంకరలు తిరుగుతున్న
మహా ప్రమాదం.
వెలుగునీ వెన్నెలనీ ఎవరు ద్వేషిస్తున్నది?
వెగటునీ వేసటనీ ఎవరు పోషిస్తున్నది?
ప్రతిభావాన్నీ మలుస్తున్న జీవితానుభవం
ఏడ్పులో చమత్కారాన్నీ
నవ్వులో దైన్యాన్నీ
మేళవిస్తున్న దృశ్యం కళ్లముందు!
ప్రతిఊహా అందమయింది కాదు.
ప్రతిచేతా స్వార్థరహితమూ కాదు.

2

మధురమైన ఊహ
మాటల్లో వంకర తిరిగి
అపార్థానికి దారితీస్తే

అందానికి మసిపూస్తే
తన విస్సహాయతకు
విసుగు పోతాడు మనిషి.
కన్నీళ్ల కార్చి
కారుణ్యాన్ని మెప్పించాలనుకుంటాడు.
గానుగెద్దులా
జీవితం చుట్టూ తిరిగే తనకి
మోక్షంలేదని మథన పడతాడు.
మాటకు కట్టుబడి మసలుకోలేని తన
మనస్సును శపిస్తూ కూచుంటాడు.
ఏ దృశ్యాన్ని చూసినా అప్పుడు
రంగులన్నీ అలుక్కుపోయినట్టు కనిపిస్తాయి.
ఏ వస్తువును తాకినా
కాలుస్తున్న అనుభూతి కలుగుతుంది.

3

బ్యాంక్ క్యాషియర్
చేతి వేళ్ల కదలికలా
రంగురంగు విద్యుద్దీపాల కాంతిలా
మహాకవి వాల్మీకి శబ్దంలా
రవిశంకర్ సితార్ వాద్యమాధురిలా
రవివర్మ చిత్రంలోని సొగసులా
జీవితం పూలు పూచి
నిత్యవసంతం కావాలని వాంఛిస్తాను
కానీ
వత్తు నడకలా
కొవ్వొత్తి కాంతిలా
అల్పకవి ప్రయోగించే బూతుమాటలా
తీతువు కూతలా
అంతుబట్టని ఆధునిక వర చిత్రంలా
బతుకు తయారవడం చూసి

నివ్వాలపాకం చేస్తాను
ఏడవలేక నవ్వుతాను.
ఏవో శబ్దాలు బాధలు బరువులు
నన్ను క్రుంగదీస్తాయి.
అర్థమయీకాని బ్రతుకు తెరువులు
కలవరపెడతాయి.
దారి పక్కనే హైన్యం ఒళ్ళు విరుచుకుంటుంది
దారి పక్కనే దైన్యం మన్ను గరుస్తుంటుంది
దగాపడిన మంచితనం కళ్ళు తుడుచుకుంటుంది.
దెబ్బతిన్న అభిమానం బుసలు కొడుతుంది
నాగరికత పుట్టించే అపశ్రుతుల సంగీతం
బలహీనతల బ్రతుకు వలయానికి
బంగారు లైనింగుందని భ్రమింపచేస్తుంది.
అంకెలగారడీ ఆనందాన్నివ్వదు.
తప్పు తెలిసినా రుజువు దొరకదు.
అందరూ అవునంటుంటే
అవునేమోననుకుని తలూపడం
అలవాటైపోయింది.

4

వరాలుపొందే ఉద్రేకాన్ని
చైతన్యమని భ్రమించినంతకాలం
నిజమైన సంగీతానికీ మూలుగుకీ
తేడా తెలుసుకోలేనంతకాలం
ఆశకీ అత్యాశకీ నడుమ
రేఖ గీసి మసలుకోవడం
నేర్చుకోనంతకాలం
నమ్మినదానికోసం
నిలబడలేక నిలకడలేక
నీళ్ళ నములుతూ కూచున్నంతకాలం
ఈ అయోమయం తప్పదు.
ఈ త్రిశంకుస్వర్గం మనిషిని వదలదు.
జీవితం రాగరంజితంకాదు.

సాహిత్య ప్రయోజనము

శ్రీ కాళూరి హనుమంతరావు

సాహిత్య ప్రయోజనమేమిటి? అన్నది తరచుగా వినబడే ప్రశ్న. అసలు ఏ కళకైనా, శిల్పానికైనా, శాస్త్రవిజ్ఞానికైనా ప్రయోజనమేమిటి అన్నవి తీగకదుపుతే డొంక అంతా కదిలే అనుస్యూత ప్రశ్నలు.

ఆరిస్టాటల్ మహాశయుడు శాస్త్రవిజ్ఞానం వల్ల ప్రపంచానికేమీ ప్రయోజనం ఉండదని అన్నాడు. కారణం—మేఘములు, ఎండ, వాన, పిడుగులు, మెరుపులు, భూకంపములు మొదలైన వాటి శాస్త్రవిజ్ఞానం అంతా తెలిసికొన్న వెనుక, ఆ విజ్ఞానంతో తృప్తిపడవలసిందేతప్ప వాటిని మనం సమయానుకూలంగా చాలినంతగా వచ్చేటట్లు చెయ్యడంగాని, అక్కరలేని వాటిని నివారించడంగాని చెయ్యజాలముకదా! కనుక శాస్త్రవిజ్ఞానానికి వస్తురూపమైన ప్రయోజనం ఉండదు అని ఆయన అన్నాడు మహామేధావి అయిన ఆరిస్టాటల్‌కి ఆ కాలంలో అట్లా తోచింది.

కొద్ది శతాబ్దాలకు క్రితంవరకూ శాస్త్రవిజ్ఞానములకు సంఘంలో సముచిత స్థానం ఉండేదికాదు. ఆ రోజులలో విజ్ఞానం అంటే సాహిత్యం, వేదాంతం వ్యాయం, (శాస్త్రీయ పద్ధతిలోలేని) వైద్యం—ఇవే. క్రమంగా శాస్త్రవిజ్ఞానం వృద్ధిచెంది, మధ్యయుగంలో సముచిత స్థానాన్ని పొందుతూవచ్చి, త్రివిక్రముని వలె ఇంతింతై అంతంలై ఈ నాటికి సర్వ ప్రపంచాన్నీ ఆవరించి సకల విజ్ఞానాధిపతి ఐ కూర్చొన్నది. ఇప్పుడు సాహిత్య వేదాంతాది విజ్ఞానములు శాఖోపశాఖ బృంహితమైన ఈ శాస్త్ర విజ్ఞాన వటవృక్షం క్రింద సేద తీర్చుకొంటూ తమ ఉనికిని సమర్థించుకొంటున్నాయి.

కనుక ఒక విజ్ఞానంయొక్క ప్రయోజనమన్నది అంత తొందరగా నిర్ణయించ జాలినదికాదు. కాలం గడచగా ప్రయోజనాలు మారుతూ ఉంటాయి. ఒకప్పుడు నిష్ప్రయోజనకరమనుకొన్నది ఇంకొకప్పుడు ప్రయోజనయుక్తం కావడం, ఒకప్పుడు మహా ప్రయోజనమును సాధించిన విజ్ఞానం కాలగతిచే నిష్ప్రయోజనం కావడం జరుగుతూ ఉంటుంది. ఉదాహరణకు చాలాకాలంక్రితం మనదేశంలో వైదిక వ్యాకరణవిజ్ఞానానికి ఎక్కువప్రయోజనముండేది. సరిఅయిన స్వరములతో మంత్రాలలోని అక్షరాలను ఉచ్చరించడం చాలా ముఖ్యంగా ఉండేది. వైదిక కర్మలు క్షీణించిన ఈనాడు ఆ విజ్ఞానమంతా అనుపయుక్తమయింది. ఇట్లే ఒకప్పుడు వేదాంతాది సర్వశాస్త్రాలకూ ఆధారభూతమై తర్కశాస్త్రం ముఖ్యమై ఉండేది. ఇప్పుడా ప్రాచీన విజ్ఞాన ప్రాముఖ్యంపోయి తర్కశాస్త్రప్రాధాన్యం అడుగంటింది. ఇదేవిధంలో ఈనాడు మహాశాస్త్రాలుగా ఉంటున్న కెమిస్ట్రీ, ఫిజిక్సు మొదలైనవి కూడా బహుకాలానంతరం నిష్ప్రయోజనములై అన్యశాస్త్రాలకు తావియ్యవచ్చును. శాస్త్రవిజ్ఞానం బహువేగంతో మారుతున్నది. ఐదారు సంవత్సరాల క్రితం అచ్చయిన శాస్త్రగ్రంథం ఈనాడు ప్రాతబడిపోతున్నది. కనుక ఒకప్పుడు మహావిజ్ఞానంగా తర దాల్చబడి ఈనాడు క్షీణించిన తర్క వైదిక వ్యాకరణాది శాస్త్రాలవలె ఈనాటి ఫిజిక్సు, కెమిస్ట్రీ మొదలైన శాస్త్రవిజ్ఞానం కూడా బహుకాలానంతరం క్షీణించిగాని, మారిపోయిగాని అన్యశాస్త్రవిజ్ఞానానికి చోటివ్వవచ్చునని ఊహించవచ్చును. ప్రపంచంలో విజ్ఞానం అన్నది కాలగతినిబట్టి మారుతూ ఉంటుంది.

మధ్యయుగంలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ మొదలైన శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందపోనప్పుడు, ఆయా శాస్త్రజ్ఞులు కేవల విజ్ఞాన తృష్ణతో పరిశోధనలు చేసి సత్యాన్వేషణను చేశారేతప్ప, ఆ విజ్ఞానంవలన ప్రజలకు ఈనాడు మనకి కనిపిస్తున్నన్ని ప్రయోజనాలు ఏర్పడుతాయని వారు ఊహించలేదు. క్రమంగా శాస్త్రవిజ్ఞానంవలన ప్రజలకు అనేక ప్రయోజనములు చేకూరుతూవచ్చాయి. అయినా ఒక శాస్త్రవిజ్ఞానంయొక్క విలువను తద్విజ్ఞానం దృష్ట్యే నిర్ణయించడమే పరిపాటిగా వస్తున్నది తప్ప, దానివలన ఏర్పడగల ప్రయోజనాన్నిబట్టి కాదు. ఉదాహరణకు వుడ్‌వర్డ్ అనే ఒక రసాయన శాస్త్రజ్ఞుడు స్ట్రిక్నీన్ అన్న పదార్థాన్ని సింథసైజ్ చెయ్యగా ఆ పరిశోధనకు అతనికి నోబెల్ బహుమానం లభించింది. శాస్త్రవిజ్ఞాన దృష్టిలో Strychnine Synthesis చాలా గొప్ప పరిశోధన. కాని ఈ పరిశోధనకు లౌకికమైన ప్రయోజనం లేదు. ముషిణి పిక్కలలో నుండి స్ట్రిక్నీన్‌ను సులభంగా తయారు చేసుకొనవచ్చును దీనిని కృత్రిమంగా తయారు (synthesise) చెయ్యవలసిన ఆవశ్యకత లేదు. ప్రయోజనం లేక పోయినా శాస్త్రవిజ్ఞానదృష్టిలో strychnine synthesis యొక్క ప్రాముఖ్యాన్నీ మహత్వాన్నీ గుర్తించి ఆయనకు నోబెల్ బహుమానం ఇవ్వడం జరిగింది. కనుక ఒక విజ్ఞానంయొక్క ప్రాశస్త్యాన్ని దానివల్ల చేకూరే లాభాలనుబట్టికాక, విజ్ఞాన దృక్పథంలోనే సమీక్షించడం యుక్తం.

నేడు శాస్త్రవిజ్ఞాన పరిశోధన ద్వివిధంగా ఉంటున్నది—Pure research. Applied research అని. ప్రజల అవశ్యకాలను గురించి జరిగే పరిశోధన Applied research ప్రయోజనానపేక్షమైన కేవల సత్యాన్వేషణం Pure research. రెంటికీ సమ ప్రాధాన్యం ఉంది. కాగా, ఈ నాటి Pure research వలన ముందు ముందు ఈ నాడు ఊహించజాలని ప్రయోజనాలు సమకూరవచ్చును ఒకప్పుడు ప్రయోజనాన్ని ఉద్దేశించకుండా చేసిన శాస్త్రపరిశోధనవలన నేడు మనం ప్రయోజనాలను పొందుతున్నాము ఉదాహరణకు పెనిసిలిన్ నేడు చాలా ఉపయుక్తంగా ఉంది. కాని పెనిసిలిన్ అన్యపరిశోధన సమయంలో అకస్మాత్తుగా కనుగొనబడినట్టిది. ఇట్టివి ఎన్నో ఉదాహరించవచ్చును. ఇవి అనుపయుక్తములని ఆ నాటి శాస్త్రజ్ఞులు వీటిని విడిచి పెట్టిఉంటే ఈ నాడు వాటి ప్రయోజనాన్ని మనం పొందగలిగి ఉండే వాళ్లం కాదు కేవలం వారి ఉద్దేశంలో ప్రయోజనకరములైన విషయాలపైనే మన పూర్వ శాస్త్రజ్ఞులు పరిశోధనలు జరిపి ఉంటే శాస్త్ర విజ్ఞానం చాలా వెనుకబడి ఉండేది. కనుక ఒక విజ్ఞానంయొక్క విలువను నిర్ణయించడానికి వెంటనే తత్కాలంలో దానివలన ప్రయోజనం ఉంటుందా అని చూడకూడదు. విజ్ఞానం విలువ నిర్ణయించడానికి విజ్ఞాన దృక్పథమొక్కటే సరి అయినది.

భౌతిక విజ్ఞాన ప్రయోజన నిర్ణయానికే ఇట్లా దూరదృష్టి ఆవశ్యకమై ఉండగా, మానసికమైన సాహిత్యంయొక్క ప్రయోజన నిర్ణయానికి ఇంకెంతటి విశాల దూరదృష్టి ఆవశ్యకమో ఊహించవచ్చును. సృజనాత్మక సాహిత్యం ద్వివిధంగా ఉంటుంది. రచయిత తన చుట్టూ ఉన్న మానవజీవితాలను పరిశీలించి వాటిని సాహిత్యంగా రచిస్తూ ఉంటాడు. ఇది మొదటి విధం. రెండవ విధమైన సాహిత్యంలో రచయిత తన వ్యక్తిగతమైన భావాలనే రచిస్తాడు.

ఏ సాహిత్యానికైనా బలీయమైన ఒక వాస్తవికత ప్రాయికంగా ఆధారంగా ఉంటుంది. ఏ సాహిత్య స్రష్ట నిరాధారంగా సాహిత్యాన్ని ఊహించలేడు. నిశ్చల హ్రదంవంటి కవి మనస్సులో ఒకానొక వాస్తవికానుభూతి సంచలనాన్ని కలిగించి భావతరంగాలను కొనసాగింపజేస్తుంది. కవి మనస్సులో భావతరంగాలను ఉద్భవింపజెయ్యడమే వాస్తవిక సంఘటనయొక్క పని. తర్వాత ఇంక అతని మనస్సులో చెలరేగిన భావపరంపరే అతని రచనకు ఆధారమవుతుంది.

నవలలు, నాటకములు, కథలు— ఇవి మానవ జీవితాలను చర్విత్రాత్మకంగా చిత్రిస్తాయి. కనుక ఇవి ప్రాయికంగా తత్కాల సమకాల మానవజీవితాలను ప్రతిబింబిస్తూ ఉంటాయి. కాని కవిత్వం వీటి

కన్నా ఈషద్భిన్నమైనది. కవి మనస్సులో ఉదయించిన భావోద్విగ్నత కావ్యరచనకు హేతువు. ఆ ఉద్విగ్నతకు హేతువు సాంఘికమైనా కావచ్చును. వ్యక్తిగతమైనా కావచ్చును. షేక్స్పియర్ తన వ్యక్తిగతమైన భావాలనే సానెట్లలో రచించాడు. ఆధునికాంధ్ర కవులలో శ్రీ శ్రీ గారు సాంఘిక కవి. కృష్ణశాస్త్రిగారి కావ్యభావాలు వ్యక్తిగతమైనవి. శ్రీ శ్రీ గారు కూడా కొన్నిఖండకావ్యాలను వ్యక్తిగత భావాలతో రచించారు. వేమన్న సాంఘికకవి. పోతన్న వ్యక్తికవి. శాస్త్రపరిశోధనలో Pure research కీ, Applied research కీ తుల్యప్రాధాన్యం ఉన్నట్లే కావ్యభావన సాంఘికమైనా, వైయక్తికమైనా కావ్య దృష్టిలో మాత్రమే కావ్యంయొక్క విలువను నిర్ణయించాలి.

కాని ఇటీవల మన దేశంలో సాంఘిక కవిత్వానికే సమాదరణ లభిస్తున్నదితప్ప వైయక్తికభావాలు అపేక్షించబడడంలేదు. సాంఘిక జీవితాన్ని చిత్రించి, సాంఘికాభ్యున్నతికి తోడ్పడని కవిత్వం నిష్ప్రయోజనమన్న ధోరణి అంతటా వినవస్తున్నది. ఈ దృష్టితోనే నేటి సాంఘిక కవిత్వం—ఎలెక్షన్లువస్తే కవిత్వం, గగారిన్‌చచ్చిపోతే కవిత్వం, చంద్రుడిమీదకు రాకెట్ వెళ్తే కవిత్వం, పూనాలో భూకంపం మీద కవిత్వం, గోదావరి వరదలువస్తే కవిత్వం, వరదలు తగ్గిపోతే కవిత్వం, చేనేతమీద కవిత్వం, పశువుల పెంపకంమీద కవిత్వం—ఈ తీరున ఉంటున్నది. వీటిమీద కవిత్వం వ్రాయకూడదని కాదు. దేనిని గురించయినా కవిత్వం వ్రాయవచ్చును. కాని ఈ సాంఘికకవిత్వపు రొదలలో సాంఘికంకాని కవితాగానాన్ని ప్రజలు వినిపించుకొనడం లేదని సందేహం కలుగుతుంది.

నిరంతర యుద్ధాలలో, రాజకీయసమస్యలలో సతమతమవుతున్నా కృష్ణదేవరాయలు కవులను పోషించి తాను స్వయంగా గొప్పకవియై కవిత్వాన్ని విస్తరింపజేశాడు. ఆ నాడు సంఘ జీవనంలో స్థిరత్వం లేదు. ఎప్పుడూ శత్రుభయమే. నాటి ప్రజల జీవితాలలో మన జీవితాలలోని సమస్యలను మించిన సమస్యలే ఉండేవి. అయినా నాటి ప్రజలు రసజ్ఞులు, సాహిత్యాభిమానులు. కనుకనే ప్రబంధాలనూ భారత భాగవతాది మహాకావ్యాలనూ సమాదరించారు.

నేడు సాధారణంగా సాహిత్య విమర్శన సరి అయిన పద్ధతిలో జరగడం లేదు. సాహిత్య సమీక్షలు నేడు సాంఘిక రాజకీయ ప్రభావాల సుదీర్ఘ వర్ణనలతో ప్రారంభింపబడుతూ ఉంటున్నాయి. ఈ ప్రభావాలు గొప్పగానో కొద్దిగానో ప్రతి కవిలోనూ ఉంటాయి కాని ఇవి ప్రధానం కావు. కవుల భావాలు ప్రధానమైనవి. పైగా, మితిమీరిన ఈ సాంఘిక దృక్పథం కవులకు మనం ఇవ్వవలసిన విలువలని తారుమారు చేస్తూ ఉంటుంది.

ఉదాహరణకు ఆధునికాంధ్ర సాహిత్యాన్ని భావకవిత్వ యుగము, ప్రజాకవిత్వయుగము అని విభజించి ఈ యుగాలకు యుగకర్త లెవరు అని నేడు విమర్శకులు చర్చించి నిర్ణయిస్తూ ఉండడం చూస్తున్నాము. దీనివలన పాఠకుల దృష్టి భావకవులమీద, సాంఘిక కవులమీద మాత్రమే లగ్నమయింది. కవి అయిన ప్రతివాడూ భావకవో ప్రజాకవో అయితీరవలసిన దుస్స్థితి ఏర్పడింది. అట్లా కాని కవులు ప్రజల చూపులకు ఆనక తిరోహితులై పోయారు. ఇట్లా తిరోహితులైన కవులలో ముఖ్యులు కీర్తిశేషులు వేలూరి శివరామశాస్త్రి గారు. 'అగ్ని', 'మాతృహృదయము', 'విష్కాసనము', 'కుక్కపిల్ల', 'నాగటిచాలు'వంటి అత్యుత్తమ ఖండకావ్యాలను రచించిన వేలూరి శివరామశాస్త్రిగారు కవితాగుణాన్నిబట్టి ఆధునిక కవులలో అగ్రగణ్యులలో ఒకరని చెప్పక తప్పదు. కాని ఆధునిక కవుల ప్రసిద్ధ కావ్యసంకలనసంపుటిలో వీరి ఖండకావ్యం ఒకటీ చేర్చబడలేదు. ఆధునిక కవిత్వంమీద రచితములైన మహావిమర్శనగ్రంథాలలో వీరి కవిత్వం గురించి ఒక్కవంకి అయినా వ్రాయబడలేదు. ఎంత అన్యాయం ఇది! అయినా, 'కుత్స్యాః స్యుః కుపరీక్షకైర్నమణయోయై రర్ఘతఃపాతితాః' అన్న

భర్తృహరి వివరాన్ని స్మరించి ధైర్యం వహించవలసి ఉంటుంది.

తెలుగులో భావకవితోద్యమానికి సాంఘిక కారణాలు లేవు. తెలుగు కవులు ఇంగ్లీషు కావ్యాలను చదివి వాటిని అనుకరించడమే ప్రథమ హేతువు. ప్రతిభాశాలులైన కవులు భావకవిత్వం వ్రాయడం చేతనూ, ప్రజలు సమాదరించడంచేతనూ భావకవిత్వం ఒక యుగమై పోయింది. తురకల దండయాత్రలు సాగుతున్న సమయంలో గొప్ప ప్రబంధాలు వెలసి ప్రబంధయుగమయింది. స్వకుటుంబం దారిద్ర్యంతో క్రుంగుతూ ఉండగా పోతన్న 'వైకుంఠ చింతా వివర్జితచేష్టుడై' భాగవతం రచించాడు. ఈయనలో సంఘదృష్టి శూన్యం కదా! కనుక కవిత్వాన్ని సాంఘికదృష్టితో విమర్శించడం పొరపాటు. కవి చెప్పిన భావమేమిటి? అది జీవితపు ఎంతటి లోతులోనుంచి వెలువడింది? అని పరిశీలించడమే సరిఅయిన కవితా విమర్శన విధానం.

సాహిత్యమంతా తాత్కాలిక సంఘాభ్యున్నతికి ఉపయుక్తమై తీరాలనడం ఇందాకటి శాస్త్రపరిశోధనల విలువలవెలుగులో పరిశీలిస్తే చాలా హ్రస్వదృష్టి అని తేలుతుంది. మానవునిలోని మానవత్వాన్ని పెంచే దోహదం, మానవ మనస్సులను ఏకం చేసే స్నేహద్రవ్యం సాహిత్యం. ప్రపంచంలో ఎన్నో మతాలు ప్రబలి మనుష్యులను ఉత్తేజపరిచి క్షీణిస్తున్నాయి. ఒక్కొక్క విజ్ఞానం మానవుల బుద్ధిని ప్రకోపింపజేసి క్షీణించి, అన్యవిజ్ఞానానికి చోటిచ్చి తొలగిపోతున్నది. ప్రపంచంలో అన్నీ మారుతున్నాయి. కాని శాశ్వతమైనది, స్థిరమైనది, సార్వజనికమైనది సాహిత్యం. ఇది సర్వమతాలకూ, సకల శాస్త్రాలకూ అతీతమైనది. మానవుడినీ మానవుడినీ సహితంచేస్తుంది కనుక సాహిత్యమని సాహిత్యపద వ్యుత్పత్తిని చెప్పుకొనవచ్చును.

ఇటువంటి మహాప్రయోజనం కల సాహిత్యాన్ని అల్పమైన తాత్కాలిక సంఘ ప్రయోజనానికిమాత్రమే ఉద్దేశించాలనడం దేవుడు ప్రత్యక్షమయితే మోక్షం కోరుకొనకుండా మూడురూపాయలనోటు ఇమ్మని అడగడం వంటిది. తిథి వార నక్షత్ర వర్జ్యాలు చెప్పే పంచాంగం గొప్ప గ్రంథమనీ, వాటిని చెప్పవు కనుక రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలనీ అనడం వంటిది.



గ్రంథ విమర్శలు

దైవమిచ్చిన భార్య

[నవల రచన : శ్రీ చలం; ఎమెస్కో పాకెట్ బుక్ ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్‌డిస్ట్రిబ్యూటర్సు రాష్ట్రపతి రోడ్ సికింద్రాబాద్, వెల రూ. 2-0-0 పేజీలు 168.]

ఆంధ్ర సాహిత్యంలో శ్రీ చలం ఆర్జించుకొన్న స్థానం అచంచలమయింది. రెండు దశాబ్దాలు ఆంధ్రుల్ని, ముఖ్యంగా యువతీయువకుల్ని, యువ మనస్తత్వంకలవారిని ఉర్రూత లూగించిన సాహితీ స్రష్ట శ్రీచలం. శ్రీచలం సాహిత్యం చదవటం తప్పని, ఆ సాహిత్యంవల్ల యువతరం పతనమవుతుందనీ, ఆ సాహిత్యం దేశానికి అరిష్టమనీ, మరెంతో బాధపడ్డ సనాతన సంప్రదాయాచార సిద్ధాంత శృంఖలాల బంధీకృతులు భావించారు. ప్రబోధించారు. ప్రచారం చేశారు. అయితే వీలు దొరికినప్పుడల్లా దొంగచాటుగా ఆ నవలలు ఎవరికీ తెలియకుండా చదువుకొన్నారు. వంటగదుల్లో, బియ్యం డబ్బాలలో, టేబిల్ డ్రాయర్ మూలల్లో దాచుకొని పార్కు బెంచీలలో, రైళ్లల్లో, హోటల్ మూలల్లో, ఎక్కడంటే అక్కడ, భయంగా, నిర్భయంగా బాధతో, సంతోషంతో, రహస్యంగా, స్వేచ్ఛగా చాలామంది ఈ సాహిత్యం చదువుకొన్నారు. శ్రీ చలం సాహిత్య లోకానికి రాజపోషకులు విద్యార్థులే అంటారుగానీ, అదంతా పూర్తి సత్యం కాదని ఆ అన్నవారికీ తెలుసు.

శ్రీ చలం సాహిత్య ప్రభావంతో రచయితలు రచయిత్రులు అయిన వారు ఆంధ్రదేశంలో అనేకులున్నారు. శ్రీ చలం నమ్మి, ప్రచారం చేసిన సిద్ధాంతాలకు ఒక వరవడి వుంది. ఒక వ్యవస్థ వుంది. ఒక సమూహిక సమారాధన వుంది. ఒక చైతన్యం వుంది. ఒక School of thought వుంది. బుచ్చిబాబు, శ్రీమతి లత, శ్రీ చలం ప్రభావంతో కొంత వరకు రచనలు చేశారు. ఇంకా ఎందరో ప్రసిద్ధులూ అప్రసిద్ధులూ ఆ సాహిత్య ప్రభావంలో రచింప గలిగారు.

ఆంధ్ర సాహిత్యంలో ఇంతకు పూర్వం కవయిత్రులూ, రచయిత్రులు బహుస్వల్పంగా వున్నారు. ఈనాడు ఇందరు రచయిత్రులున్నారంటే దానికి కారణం శ్రీ చలం అని అనుకోవటంలో ఏమాత్రం తప్పులేక పోవచ్చు. స్త్రీ స్వేచ్ఛను ప్రబోధించిందీ సాహిత్యం. స్త్రీ హృదయం తెలుసుకోవటానికి, తెలియచెప్పటానికి ప్రయత్నం జరిగింది. పురుషుడయినవాడు దూరంనుంచి దగ్గర్నుంచి, స్త్రీ అంతర్యం చూచి, తెలుసుకొని, భావించి కల్పించటంకంటే, స్త్రీ తన వ్యక్తిత్వం ప్రకటించుకొనటానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో శ్రీ చలం సాహిత్యం ప్రోత్సాహమిచ్చింది. శ్రీ చలం సాహిత్యం లేకపోతే ఆంధ్రదేశంలో, తెలుగులో, ఇంతమంది స్త్రీలు రచనలుచేసే అవకాశం అంతగా వుండేది కాదు. శ్రీ చలం తన సాహిత్యంతో ఆంధ్రదేశాని అలంకరించటమేకాదు; మరింత సాహిత్య సృష్టికి ప్రోత్సహించిన వ్యక్తి. ఆంధ్ర నవలా సాహిత్యం పరోక్షంగా శ్రీ చలం భిక్ష.

డిటెక్టివ్ సాహిత్యం వచ్చింతర్వాత శ్రీ చలం సాహిత్యం ముమ్మరంగా చదవటం తగ్గిపోయింది. స్త్రీల రచనలు, కొంతవరకూ ఆడువారి అంతర్యం బ్లాక్‌మెయిల్ చేస్తున్న ధోరణిలో వస్తున్న రచనలు ప్రచారం పొందుతున్న సమయంలో శ్రీ చలం రచనలు చదవటం కొంతలో కొంత తగ్గింది. అయితే ఒక మహాప్రవాహంవచ్చి, తగ్గిపోయింతర్వాత తేట తేరిన జలప్రవాహం సామాన్యమయిందీ, వాస్తవమయిందీను. శ్రీ చలం సాహిత్యపు వరద తగ్గిపోయింతర్వాత మిగిలిన రూపం, ఆ సాహిత్య చిరంజీవత్వం నిర్ణయిస్తుంది. ఈ సాహిత్యానికి చరిత్ర సిద్ధి వుంది. భవిష్యత్తు ఆదరిస్తుంది.

శ్రీ చలం వచనశైలి తిరుగుతుంది. అంత చక్కని శైలివున్న ఆంధ్ర నవలా రచయితలు ఇంకెవరున్నారంటే వెతుక్కోవటంతప్ప వెంటనే వెంటనే చెప్పటం కుదరదు. ఈ సాహిత్యంలో నవలలే కాదు కథానికలు, కథానికలేకాదు నాటికలు, నాటికలేకాదు మ్యూజింగ్స్, అంతేకాదు లేఖాసాహిత్యం, ఒక్కటేమిటి శ్రీ చలం ఏమి వ్రాసినా అది సాహిత్యం. శ్రీశ్రీ మహాప్రస్థానానికి శ్రీ చలం వ్రాసిన ప్రస్తావనప్రాయమయిన పలుకులు ఎవరు మరచిపోగలరు. అవి వచనమో, వచనపద్యమో, కథో, కావ్యమో ఇదమిత్థంగా ఎవరు తేల్చి చెప్పగలరు!

శ్రీ చలం వస్తుతః ఆవేశి అని చెప్పవచ్చు. అంతేకాదు. 'విప్లవకారుడు, తిరుగుబాటుదారుడు'. సంప్రదాయాలమీద శ్రీ చలం కలం అంకుశం. శ్రీ చలం జీవించే మహాగ్నిశిఖ ఆ శిఖ పాతను కాల్చింది. క్రొత్తను వెలిగించింది. శిథిలజీవితాలకు కాంతిమయ మార్గం చూపించి. సాహిత్యంలోనూ, సమాజ జీవితంలోనూ భవిష్యత్తును ప్రదర్శించింది. అది ఆరిపోని అగ్నిజ్వాల. ఆంధ్రసాహిత్యం ఉన్నంతవరకూ ఉండగల దీప్తి!

శ్రీ చలం స్వీకరించింది ఆంధ్రసమాజం. బూజుపట్టిన, బూజుదులుపుకోవటానికి చేతులులేని సమాజం. మారుమూలల్లో, పురుషుల ఆధిపత్యంక్రింద, అనాగరకత అట్టడుగున, దైన్యత లోగిలిలో, క్రూరత హస్తాలలో మూర్ఖంగా వెకిలిగా, నిర్వాణమై, తెలివిమాలి వ్యథ చెందుతున్న స్త్రీ హృదయార్తికి ఆ సాహిత్యం వేకువ వేగుచుక్క. నవయుగోదయం శ్రీ చలం నవలాసాహిత్యం మూలంగా ఆంధ్రదేశంలో తెచ్చినంత భావవిప్లవం మరే నవలా రచయిత తేలేదేమో అనిపిస్తుంది.

'దైవమిచ్చిన భార్య'లో రాధాకృష్ణ, పద్మావతి చిన్నతనంలోనుంచీ స్నేహితులు. పద్మావతికి పెళ్ళయిపోయింది. అయినా, వాళ్ళిద్దరికీ శారీరక సంబంధం వుంది. రాధాకృష్ణకు బలవంతంగా పెళ్ళి జరిగింది. అయినా, పద్మావతిని మర్చిపోలేక పోతాడు. సంబంధం తెగిపోదు. చాలా వెకిలిగా ప్రవర్తిస్తాడు. ఇద్దరికీ ఎడబాటు కలుగుతుంది పద్మావతికి పెళ్ళిఅయి భర్తవల్ల పిల్లలు కలుగుతారు. రాధాకృష్ణకు పెళ్ళిఅయి భార్యవల్ల సంతానం కలుగుతుంది. మలయాళదేశంలో పద్మావతి రాధాకృష్ణ కలుసుకొంటారు. ఇక్కడ శరీరకంకాని ప్రేమ జీవితం వుంది ఆ పైన రాధాకృష్ణ చేతుల్లో పద్మావతి చనిపోతుంది. రాధాకృష్ణకు పద్మావతి, అలా ఎందుకు చెప్పాలి పద్మావతికి రాధాకృష్ణ అని చెప్పవచ్చు. రచయిత శ్రీ చలం స్త్రీ కాదుగా, అందువల్ల రాధాకృష్ణకు పద్మావతి సంఘం ఇచ్చిన భార్య కాదు కానీ దేవుడిచ్చిన భార్య. అందుకే 'దైవమిచ్చిన భార్య' అనేది నవల పేరు. 'దైవమిచ్చిన భర్త' అని రచయిత ఎందుకన లేదూ? రాధాకృష్ణను దైవమిచ్చిన భర్తగా పద్మావతి అనుకోలేదు. పద్మావతిని దైవమిచ్చిన భార్యగా రాధాకృష్ణ అనుకొన్నాడు. రాధాకృష్ణలో రచయిత శ్రీ చలం అంతర్యం నిక్షిప్తమయివుంది.

చాటుమాటుగా ఆ స్త్రీ పురుషులిద్దరూ కలుసుకొనటంలో సహజత కనిపిస్తుంది. ఒకరికోసం మరొకరు కుమిలి పోవటం, వ్యథ చెందటం సహజంగానే వుంటుంది. ఉత్తరాలు వ్రాసుకోవటం, ఉత్తరాల కోసం తపించి పోవటం, ఉత్తరాలలో హృదయాలు నింపటం సహజంగా వుంటాయి. శకుంతలగానీ, శకుంతల తండ్రిగానీ సమాజంలో ఉన్న మనుష్యులకు ప్రతిబింబాలువంటి వాళ్ళని అందరూ ఒప్పుకొంటారు. సావిత్రి చెప్పిన ప్రతివాక్కు ప్రత్యక్షరం జీవితానికి ప్రత్యక్ష వ్యాఖ్యానం.

పద్మావతి అన్నలు ఇద్దరూ రెండు పార్టీలు అయి, ఒకరు రాధాకృష్ణను సమర్థించటం సహజమేమో ఆలోచించాలి. రాధాకృష్ణ అంత వెర్రిగా ప్రవర్తించటం వాస్తవంగా జరుగుతుందా అనేదీ గమనించాలి. పద్మావతి భర్త అంత వ్యవహారం సహిస్తాడా అనేదీ తర్కించాలి. స్త్రీ అంతగా బరితెగించి ప్రవర్తిస్తుందా అనేదీ విచారించాలి.

కొంత ప్రదర్శనా, కొన్నిసంఘటనలూ, కొంత కథాభాగం, సహజంగాలేదూ, అసహజంగావుందీ అని ఎవరయినా అనటానికి అవకాశం లేకపోలేదు. అయితే శ్రీ చలం తీవ్రవాది. కథా, విప్లవాత్మకమయింది. చెప్పదల్చుకొన్న విషయమూ, సర్వులూ ఏకకంఠంతో అంగీకరింపదగిందికాదు. అందువల్ల ఎక్కువమందిని ఒప్పించటంకోసం, నవల చిత్రించిన తీరులో కొంత అసహజత కనిపించే అవకాశం లేకపోలేదు.

శ్రీ చలం నవలలో ఏదీ ఉత్కృష్టమయింది కాదు. ఏదీ దానిఅంతట అదే సర్వసమగ్రమయిన నవలకాదు. ఏదీ ప్రత్యేకంగా లోకానికి మిగిలిపోదు. అయితే చలం సాహిత్యం అంతా ఒక్కటయి, అందులో రచయిత స్థాపించిన నూత్నత ఆ రచనలకు భవితవ్యం ఇస్తుంది. ఏ ఒక్కరచనలోనూ సంపూర్ణతలేదు. అన్నిరచనలూ కలిపి, ఒక సమగ్ర చిత్రణగా భావించి, ఆభావంతెచ్చే భావవిప్లవంకోసం శ్రీ చలం సాహిత్యం భవిష్యత్తుకు ఉంటుంది. శ్రీ చలం రచనలకంటే శ్రీ చలం భావతీవ్రత లోకానికి మిగులుతుంది.

రచయిత సృజించిన జీవితంకంటే చిత్రించిన జీవితంలో నిక్షిప్తం చేసిన సిద్ధాంతం మిగులుతుంది. రచయిత రచనలకంటే, రచయిత హృదయం చరిత్రలో పాఠకులకు మిగిలి వుంటుంది.

శ్రీ చలం సాహిత్యం కథకోసం చదవనక్కరలేదు. సమాజచిత్రీకరణకోసం చదవనక్కర లేదు. పాత్ర చిత్రణకోసం ఆశింపనక్కర లేదు. అయితే రచయిత చెప్పాలనుకొన్న భావచైతన్యంకోసం చదవాలి. అందుకోసం ఆ రచనలు బ్రతికి వుంటాయి.

ప్రేమ, కాదంటే శృంగారం, కాదంటే కామం, కాదంటే శారీరక సంబంధం, కాదంటే, పిచ్చిమాటల్లో దాంపత్యబంధం, కాదంటే, వీటి అన్నింటి సమాహారరూపం, మాత్రం శ్రీ చలం నవలలు ప్రదర్శిస్తాయి కానీ, పూర్ణ జీవితాన్ని చూపించవు. రెండువైపుల పదునున్న ఆ సమాహారరూపం సాక్షాత్కారం అవుతుందికానీ, పాత్రలూ, కథా, సమాజం అంతా గౌణం. ప్రధానం ఆ సమాహార రూపం.

ఈ సాహిత్యం అంతటిలో రచయిత సృష్టించిన పాత్ర, స్త్రీ-కామమోహిత అయిన స్త్రీ-తల్లికాదు, చెల్లికాదు, అక్కకాదు. మరేవిధాకాదు, భార్యకూడా కాదు, శారీరక సంబంధంలో భగవంతుడి దర్శనం కలిగించే స్త్రీ. ఈ స్త్రీ మూర్తి ఇతరేతర అనేక రూపాలకు ఆద్యరూపం అని రచయిత భావం కావచ్చు.

యౌవనంలో, యౌవనంతో, కాంక్షతో, పురుషుడి సమీపంలో, మదిరామత్తనేత్రాలలో ,ఒయారంగా, సోలిపోతూ, తూలిపోతూ, వాలిపోతూ, ఆనంద-ఆనందమే పరబ్రహ్మ రూపంగా, శృంగారంగా, అందంగా, హృదయం దాచుకొంటూ వ్యక్తంచేస్తూ అదీ అవ్యక్తంగా వుంచుతూ వుండే స్త్రీ మూర్తి శ్రీ చలం సాహిత్యంలో కనిపిస్తుంది. కానీ, ఎండు డొక్కలతో, అన్నమో రామచంద్రా అని అలమటించిపోతూ, పాలులేక, పిల్లవాడు ఏడుస్తుంటే ఏం చేయాలో దిక్కు తెలియక, చింకి బట్టలతో చితికిన శరీరంతో, ఎండిపోయిన గుండెతో, ఆర్థికంగా, సామాజికంగా పతనమయిపోతున్న స్త్రీ, శ్రీ చలం సాహిత్యంలో కనిపించదు. ఈ రచయితకు ఆ స్త్రీ మూర్తి అక్కరలేక పోయింది. గోపీచంద్ సృష్టించిన 'వెంకటచలం పాత్ర' ఆ దృష్టితో శ్రీ చలం చూపనికోణం చూపుతుంది.

సృష్ట్యాదినుంచీ మానవుడి నిరంతర ప్రయత్నం స్త్రీని అర్థం చేసుకోవాలని. ఎంత అర్థమయిందో అంత అర్థం కాకుండా మిగిలిపోతుంది. స్త్రీ సంపూర్ణంగా అర్థమయింది అని ఎవరయినా అనుకొంటే అది పొరపాటే అవుతుంది. అర్థమయింది అనిపించవచ్చు. ఆభాసం! పురుషుడికి స్త్రీ పరిపూర్ణంగా అర్థం కాలేదు. కాదు. అయితే, సృష్టి అర్థరహితం కావచ్చునేమో! స్త్రీకే స్త్రీ అర్థంకాదు. దేవుడు పురుషుడని అనుకొంటే దేవుడికీ

స్త్రీ అర్థం కాలేదని ఎక్కడో చదివిన గుర్తు. దేవుడు సృష్టించిన స్త్రీ దేవుడికే అర్థం కాలేదుట. అయితే చాలామంది రచయితలు స్త్రీని అర్థం చేసుకోటానికి, ఆ బాటమీద చాలదూరం నడిచారు. శ్రీ చలం, ఆ మార్గగాములలో, ఆంధ్ర రచయితలు అందరికంటే ముందు కనిపించవచ్చు. దేవుణ్ణి చూడాలనుకోవటం ఎంత వెర్రో, స్త్రీ పరిపూర్ణతను అర్థం చేసుకోవాలనుకోవటం అంత వెర్రి! అసాధ్యం! రాధాకృష్ణ ఈ నవలలో పద్మావతి తనకు అర్థమయింది అనుకొన్నాడు. అందుకే అంతచావు చచ్చాడు. అంతేకాదు. పద్మావతి భర్త తనకు అర్థమయిం దీమె అనుకొన్నాడు. అందుకే అన్ని దుస్సంఘటనలు చూచికూడా ఆమెను దూరం చేసుకోలేకపోయాడు. కష్టం కలిగిస్తే రాధాకృష్ణకు కలిగించాలనుకొన్నాడుగానీ, పద్మావతికి కాదు.

నేటి వివాహ వ్యవస్థ బలహీనంగావుందని, ఇలా కాదు ఉండవలసిందీ అని రచయిత అభిప్రాయం. అందరూ కాకపోయినా, కొందరయినా ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తారు. ఈ వ్యవస్థ మారాలి. అదీ అంగీకరించవచ్చు. అయితే మరో మార్గం చూచుకోకుండా ఉన్న మార్గంలో ముళ్ళు పాతుకోవటం శ్రేయస్కరమా? కాదు. శ్రీ చలం మరో మార్గం అందరూ అంగీకరించగలిగింది, పోనీ కొందరయినా ఒప్పుకోగలిగింది చూపలేదు.

వావివరుసలు లేకుండా, ఏ స్త్రీని ఏ పురుషుడయినా అనుభవించవచ్చుననే ప్రాక్తన మానవుడి స్థితి నుంచి, స్త్రీకోసం, యుద్ధాలు జరిగి, ఓడిపోయి, గెలిచి, నాగరికత వృద్ధిపొంది, పరిణామాలు సంభవించి, చివరికి ఒక adjustment, ఒక రాజీ రూపంగా ఈ నాటి వివాహవ్యవస్థ రూపుదిద్దుకొంది. ఈ వ్యవస్థ కొన్ని పదులశతాబ్దాల పరిణామం. ఇది సవ్యంగా ఉందని కొన్ని శతాబ్దాల పూర్వం ఒక నిర్ణయమయింది. ఆ నిర్ణయం, ఆ Convention ఇవాళ ఇష్టంకాకపోతే. మార్చుకోవచ్చు అది తప్పని ఎవరూ అనరు. అయితే కొత్త విధానం రూపు దిద్దకుండా పాత నిర్ణీత పథం తృణీకరించటం న్యాయమేనా?

వాడి, నాకు, అనుకోవటం కామం అయితే కామంలోంచే ప్రేమ పుడుతుంది. ప్రేమ అనేది సచ్చిదానందరూపంగా వుందా? స్త్రీ పట్ల శారీరకమైన కాంక్షలేని ప్రేమ వుందా? లేదని ఎట్లా అనటం? అయితే శ్రీ చలం సాహిత్యంలో స్త్రీ శారీరక కాంక్షలేని ప్రేమలేదనే ధ్వని కలుగుతుంది. ఈ 'దైవమిచ్చిన భార్య'లో ఎక్కడో పడవల్లో వెళ్ళి కొండమీదికి చేరి, జీవితపు రెండోభాగం ప్రారంభంలో మాట్లాడుకొన్న రాధాకృష్ణ పద్మావతుల మధ్య కామవికారంలేదు ప్రేమవుందీ అని ఎవరయినా అంటే బాగుంటుంది, ఉండాలనే ఆశ పడవచ్చుకానీ, అది కామవాంఛలోనుంచి పుట్టిన ప్రేమకాదా? అవును! కామవాంఛాగతమైన ప్రేమే! శారీరకసంబంధం లేకపోవచ్చు. అందువల్లే శ్రీ చలం సాహిత్యం అంతటిలో శారీరకసంబంధంఉన్నా లేకపోయినా ప్రేమఅంటూవుంటే అది కామ కారణంగా కలిగేదే అని పాఠకులు గ్రహిస్తారు. అయితే ప్రేమ అనేది ప్రత్యేకంగా కామంవంకే పరిమితమయిందా?

నీ భర్తను వదిలెయ్, నాతో వచ్చెయ్ అన్నట్లుగా రాధాకృష్ణ మాట్లాడుతాడు. నేను రాను, వస్తే మనిద్దరిమధ్య ప్రేమ తగ్గిపోతుంది అన్నట్లుగా మాట్లాడుతుంది పద్మావతి. అక్కడే పద్మావతి అర్థంకాదు. అంతమాత్రానికే ప్రేమ తగ్గిపోతే, అది ప్రేమే అవుతుందా?

ప్రేమ విషయంమీద వాళ్ళిద్దరూ చాలా వాదోపవాదాలు చేసుకొంటారు. ప్రత్యక్షంగా చదవాలంటే 'దైవమిచ్చిన భార్య' చదవాలి. పిల్లలమీద ప్రేమ, అయితే వాళ్ళ గోల అక్కరలేదు కొందరికి. అలాగే స్త్రీ!

తెలుగులో వచ్చే చాలా నవలలు చదివి ఆలోచించనక్కరలేదు. శ్రీ చలం రచన ఏదీ చదివినా ఆలోచించి తీరాలి. ఎన్నో రచనలు చదివి హాయిగా మర్చిపోవచ్చు. శ్రీ చలం రచన ఏది చదివినా, మర్చిపోదామన్నా ఎవరూ మర్చిపోలేరు. ఈ సాహిత్యం పాఠకుల్ని వెంటాడుతుంది. ఊపిరి సలుపుకోనీయకుండా బాధిస్తుంది.

ఆంధ్ర సాహిత్యంలో శ్రీ చలం ఒక పరిపూర్ణ రచయిత. రచయిత అనటంకంటే కవి అంటే మరింత స్పష్టంగా వుంటుంది. ఈ మధ్య కాలంలో ఆంధ్ర పాఠకులు శ్రీ చలం సాహిత్యం అంతగా చదివి వుండరు. ఈ సాహిత్యం చదవకపోతే, ఆంధ్ర సాహిత్యంలో ఒక ముఖ్యభాగం చదవకుండా వదిలిపెట్టిన వాళ్ళవుతారు పాఠకులు. చదివి తీరవలసినది శ్రీ చలం సాహిత్యం.

రత్నకంబళం

[నవల: రచయిత్రి: శ్రీమతి రేవనూరి శకుంతల. ప్రతులకు ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ ఎమెస్కో పాకెట్ బుక్. వెల: రూ 2—00 పేజీలు 160.]

ఎమెస్కో పాకెట్ బుక్స్ వస్తున్న విధంగా మామూలు ప్రింటులో ముద్రించి ఉన్నట్లయితే ఈ నవల ఇన్ని పేజీలకు పెరిగివుండేదికాదు.

యం. శేషాచలం అండ్ కో., యం. శేషాచలం అండ్ కంపెనీ అనీ, సికిందరాబాదు, సికింద్రాబాదు, సికింద్రాబాద్ అనీ, మచిలీపట్టణము, మచిలీపట్నణం, మచిలీపట్నం అనీ...ము దిస్తున్నారు......ఇటువంటివి రాకుండా చూస్తే బాగుంటుందని 'రాగంలో రంగులు' 'భారతి'లో సమీక్షిస్తూ చేసిన సూచన ప్రకాశకులు స్వీకరించటం ముదావహం.

శ్రీమతి రేవనూరి శకుంతల 'హౌసెస్ పాగర్' కథల సంపుటి 'భారతి'లో సమీక్షిస్తూ పరిచయంలో 'శ్రీమతి భానుమతీ రామకృష్ణగారు' అని వ్రాసి, ఈ రచయిత్రిని పరిచయంలోనే 'శ్రీమతి శకుంతల' అని వ్రాయటం అనుచితం.........వ్యక్తి వ్యక్తికీ వ్యక్తిగా విలువలు నిర్ణయించే వ్యత్యాసపు పద్ధతి ప్రకాశకులు మార్చుకొంటారని పాఠకులు ఆశిస్తారు, అని వ్యక్తంచేసిన అభిప్రాయం ప్రకాశకులు స్వీకరించటం సంతోషం కలిగిస్తుంది.

బలరామయ్యకు ముగ్గురు పిల్లలు రఘు పెద్దవాడు. ఆనంద్ రెండోవాడు. కమల చిన్నది. రఘుకు చదువు అబ్బలేదు. మాతామహుడి ఆస్తికి హక్కుదారుడయ్యాడు. డబ్బు ఉన్నవాళ్ళు పాడయి పోదలుచుకొంటే ఎన్నివిధాల పాడయిపోవచ్చో అన్ని విధాలా పతనమయ్యాడు.

ఆనంద్, తండ్రి దారిద్ర్యానికి వారసుడయ్యాడు. రెడ్డి సహాయంతో డాక్టర్ అయ్యాడు జగన్నాథరావు స్వార్థంతో కూడిన మంచితనంవల్ల ఉన్న యింటి అల్లుడయ్యాడు.

కమలకు సత్యమయంలో రెండో పెళ్ళి వ్యక్తితో వివాహం అయింది. కొడుకు పుట్టాడు. కృష్ణ భర్త గతించాడు. ఇన్స్యూరెన్స్ డబ్బుతో, ఇల్లు అమ్మితే వచ్చిన ధనంతో కొడుకును ఆనర్సు చదివించింది. కొడుకు వేసిన అపనింద భరించలేక ఆత్మహత్య చేసుకొంది.

నవలారచనలో ఈ 'రత్నకంబళం' శ్రీమతి రేవనూరి శకుంతల ప్రథమ ప్రయత్నం కావచ్చు. రత్నకంబళం అంటే జీవితం అని రచయిత్రి అర్థం చెప్పటానికి చేసిన ప్రయత్నం మొదట్లోనే కనిపిస్తుంది.

కవితాహృదయం ఉన్న రచయిత్రి, ఎక్కువగా ఊహాలోకాలలో విహరించేసే రచయిత్రి, 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అనకుండా కొంతంత దిగివచ్చి, ఈ రచయిత్రి ఇతర రచనలలో తక్కువగా కనిపించే సహజత ఈ నవలలో ఎక్కువగా కనిపించేట్టు రచన చేయుటం చూచి పాఠకులు ఆనందిస్తారు.

బలరామయ్య ప్రత్యేకవిషయానికి అమితంగా కమిలిపోవటం, ఏ పరిస్థితుల్లో అయినా ఎంత డబ్బు యినా ఇస్తాననే రాఘవరెడ్డి అధికంగా సహాయం చేయటం, ఆనంద్ తన కూతురును పెళ్ళాడితే చాలునని జగన్నాథరావు అంతగా ప్రాధేయపడటం, కోపంరూపం దాల్చిన పద్మనాభం కమలపైన అవ్యాజంగా కరుణ కలిగి తన అసిస్టెంటుగా నియమించుకోవటం, కొంత అసహజంగా ఉన్నట్లు కని

పించినా, అటువంటి మనుష్యులూ లోకంలో ఉండవచ్చుననే సమాధానం బలంగా నమ్మితే లోపం లేనట్లే అనిపించవచ్చు.

అయితే ఒక్క సుగుణం. ఈ రచయిత్రి లోకంలోని కఠిన వాస్తవాలు దర్శించే దృష్టి అలవర్చుకొన్న స్థితి వ్యక్తమయింది కాబట్టి ముందు ముందు రానున్న రచనలలో మరింత సహజ ప్రకృతి సందర్శనతోపాటు చిత్రణకూడా జరుగుతుందని ఆశించవచ్చు.

వృద్ధులైన పురుషుల పాత్రలు మూడు. బలరామయ్య కన్నబిడ్డల అభ్యుదయం కాంక్షిస్తూ, అది ఎక్కడ వ్యత్యస్తం అవుతుందోనని బాధపడుతూ కన్ను మూశాడు. రాఘవరెడ్డి బలరామయ్య కుటుంబం ఆదుకొనే మంచి మనస్సు కలవాడు. కమల పెళ్ళికి ఖర్చు అంతా భరించాడు. ఆనంద్ చదువుకు డబ్బు ఇచ్చాడు. అంతకుమించి ఆ పాత్రకు వ్యక్తిత్వం లేదు. జగన్నాధరావు, తన కూతురుకు మంచి భర్త లభ్యం అయితే, అతను ఇల్లరికం వస్తే బాగున్నని ఆశించి నెరవేర్చుకొన్న సాహితీ ప్రియుడు. అంతకంటే ఆ పాత్ర ప్రాధాన్యం లేదు.

వృద్ధఅయిన స్త్రీ పాత్ర సుభద్రమ్మ. ఆమె గంపగయ్యాళి. అత్తలు కోడళ్ళనుపెట్టే ఆరళ్ళు సుభద్రమ్మకు బాగా తెలుసు కొడుకుపై వాత్సల్యం కలిగి, అతని హృదయంలో మరో స్త్రీ సజీవంగా వుంటే సహించలేని స్త్రీ హృదయుంగల వ్యక్తి. ఉన్నంతలో ఈ పాత్ర అంధ్రదేశంలోని అత్తలకు కొంతలోకొంత రూపకల్పన. స్త్రీ హృదయం చూపే పాత్ర!

యువకులయిన పురుషపాత్రలలో ముఖ్యమైనవి రఘు, ఆనంద్, వేణు, కృష్ణ.

రఘు డబ్బును అయాచితంగా పొంది, దాన్ని నిలుపుకోవటంచేతగాక, సన్యాసి అయిన వ్యక్తి పేకాడాడు, తాగాడు, వ్యభిచరించాడు. (ఒక్కవేళ్ళలోనే) రేసుల్లో పాల్గొన్నాడు. చివరకు పాంతకుడయ్యాడు–అపైన మరేమో అయ్యాడు. రఘు పాత్ర హృదయం కదిలిస్తుంది కరిగిస్తుంది

ఆనంద్ బుద్ధిమంతుడు. బాగా చదువుకొన్నాడు. కవిత్వం రాశాడు. కవితా హృదయం ఉన్నవాడు డాక్టర్ అయ్యాడు. ఎప్పుడూ కలిసి వచ్చిన అదృష్టం కాలదన్నుకోలేదు. ఆనందంగా ఉన్నాడు. అయితే పాఠకులకు ఉత్సాహం, తాత్కాలికమయిన ఆనందం కలిగిస్తాడుగానీ, హృదయాలలో నిలవడు.

వేణు రెండో పెళ్లిచేసుకొన్న వ్యక్తి. తల్లికీ భార్యకు మధ్య తగాదాలు తీర్చలేక సతమతమయ్యే సామాన్య సంసారి. పాఠకుల హృదయాలలోని ప్రతిబింబంవంటి పాత్ర.

కృష్ణ తల్లిచావుకు కారణం కావటంకంటే మరెందుకూ ఉపయోగపడని పాత్ర!

యువతులయిన స్త్రీ పాత్రలలో ముఖ్యమైనవి. మనోరమ, స్నేహలత, కమల.

మనోరమ వైద్య విద్యార్థిని. ఆనంద్‌ను పెళ్ళాడ గలిగింది. కలిగిన బిడ్డకు సుమారాణి అని పేరు పెట్టుకుంది. యువతుల్లోవుండే కాల్పనిక లక్షణానికి ఉదాహరణగా చెప్పదగిందీ పాత్ర.

స్నేహలత వేశ్య. అందం చందం, డబ్బూ దర్పం ఉన్నవాళ్ళను వలచి వలపించుకొని, జీవితం ముఖ్యంగా లైంగిక జీవితం అన్నికోణాలనుంచి, అనుభవించటం అలవర్చుకొన్న నేర్పరి. రఘు ఈమెవల్ల పతనమయ్యాడు ఆమె ఇతనివల్ల బ్రతుకు తెల్లవార్చుకొంది. అందువల్ల రఘు భవిష్యజ్జీవితమే మారిపోయింది. స్నేహలత ఆంగిక సౌందర్యం తృప్తి తీరా వర్ణింపబడింది. ఎంత అందమయింది స్నేహలత! ఈ పాత్ర యువకులకు చాలా ఉత్తేజకరంగా వుంటుంది. రక్తమాంసాలతో జీవించిన పాత్ర!

కమల నవల అంతటిలో పాఠకులకు ప్రశ్నగా వుండేపాత్ర! ఆమె పెళ్ళి ఎలా అవుతుందా అని తండ్రి పడిన బాధ పాఠకులకు కలిగి ప్రశ్నలాగా నిలుస్తుంది. రెండో పెళ్ళివాణ్ణి చేసుకొన్నప్పుడూ ప్రశ్నే! అత్త చేతిలో అవస్థలుపడి, ప్రశ్నే! భర్త గతించి విధవ అయినా ప్రశ్నే! కొడుకును చదివించుకొనే ప్రయత్నంలో బాధలు పడుతూ ప్రశ్నే! మరణించీ ప్రశ్నే!

కమల నవల ప్రారంభంలో అవివాహితగా, తెలివైన యువతిగానే కనిపిస్తుంది. భార్యగా అమితమైన ఓర్పు ప్రదర్శిస్తుంది. విధవగా చాలా కష్టాలు ఎదుర్కొంటుంది ఆమె నవల ఆదిమధ్యాంతాలలో పాఠకుల సానుభూతి సంపాదించుకొంటుంది.

అయితే ఆమెనుగూర్చి కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. భర్తపోయి, ఒంటరిగాఅయి, అయిదువేల రూపాయిలుంటే, ఆ డబ్బు అంతా అంతత్వరగా ఎలా పాడుచేసుకొంది? అంత అజాగ్రత్తగా ఖర్చుచేసుకొంటే భవిష్యజ్జీవితం ఎలా బ్రతకాలని?

పోనీ, ఇల్లు అమ్మివేసిందంటే ఫరవాలేదు, పదివేల రూపాయిలు రెండూ, మూడేళ్లలో ఖర్చు చేసుకొంటే ముందుముందేం కావాలని? కొడుకు చదువుకోసం పరాయిపంచలో చేరిన ఆమె, ఉద్యోగంలో చేరటం తప్పేమీకాదు.

గత్యంతరంలేక, ఇల్లుమార్చి ఉద్యోగంలో చేరిన కమల, ఎవరికోసం జీవిస్తూవుందో, ఆ కృష్ణకు ఆనర్సు విశాఖపట్టణంలో చదువుకొంటున్న వాడికి, ఏలూరునుంచి ఉత్తరం ఎందుకు రాయలేదు?

రోగంతో బాధపడే భార్య, లైంగికసుఖం ఈలేని భార్యకల పద్మనాభం ఇంట్లో చేరి, ఇంట్లో మనిషిగా ఉద్యోగంలో అసిస్టెంటుగా వుంటున్న కమల, విధవఅయిన కమల, బాల్యంలోనే భర్తను కోల్పోయిన కమల, రెండోపెళ్లి వాణ్ణి చేసుకొని, జీవితం సరిగా అనుభవించని కమల, ఒంటరి కమల పద్మనాభంతో సంబంధం పెట్టుకోలేదంటే ఎవరు నమ్ముతారు. లోకంలో ఉన్న ప్రచారం కొడుకు వినటం తప్పా? విని ఎదురుపడి అడగలేక ఉత్తరం వ్రాయటం తప్పా? వ్రాసినంతమాత్రాన ఆత్మహత్య చేసుకోవటం మంచిదా? ఆత్మహత్య అక్రమసంబంధం రుజావుచేసేమార్గం కాకుండా పోతుందా?

రచయిత్రి ఈ సందర్భంలో సందిగ్ధంగా వుండిపోయినట్లు భావించుకోవచ్చు. ఆత్మహత్యలు గూర్చి అనవసరంగా వ్రాయకూడదు. ఆ పాత్ర పిరికితనం, రచయిత్రి ఆలోచనా రాహిత్యానికి అది నిదర్శనం అవుతుంది.

వృద్ధులైన పురుష పాత్రలకంటే, స్త్రీ పాత్రలూ, అంతకంటే యువక పురుష పాత్రలూ, అంతకంటే యువతుల పాత్రలూ ఈ రచయిత్రికి స్వభావసిద్ధంగా చిత్రింపగల నేర్పుంది.

తల్లి పంపే డబ్బుమీద ఆధారపడి చదువు సాగిస్తున్న కృష్ణ, తల్లితో సంబంధం వదులుకొని ఎలా చదువుకోవాలనుకొన్నాడు? ఎలా చదువు పూర్తి చేశాడు? మేనమామ పోలిక వచ్చిందనుకోవటం తప్ప మరోమార్గం వాచ్యంగా నవలలో కనిపించదు.

ఈ రచయిత్రికి లలితకళలంటే చాలా ఇష్టం. ఇంతకుముందు కథలు చదివినవాళ్లకు ఈ విషయం అవగతపూర్వకమే! ఈ నవలలో స్నేహలత బాగా పాడగలదు చక్కగా నృత్యం చేయగలదు. కమలకు సంగీతం వచ్చు. ఆనంద్ కవిత్వం వ్రాస్తాడు. బాగా పాడుతాడు.

రఘుకు పదేళ్ల జైలుశిక్ష పడేటప్పుడు నెలల పిల్లవాడుగా ఉన్న కృష్ణ ఎనిమిది తొమ్మిది సంవత్సరాలలో జైలునుంచి విడుదలపొంది వచ్చేసరికి, కృష్ణ అసర్పు పూర్తిచేసే దశకు ఎలా వచ్చాడు. కాలం విషయంలో రచయిత్రి జాగ్రత్తపడలేదు.

గుంటూరునుంచి అమరావతి పోవాలంటే — మెడికల్ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు పిక్‌నిక్‌కు పోయారు — మాచెర్లమీదుగా పోనక్కరలేదు. వాళ్లు వెళ్లింది అమరావతి పిక్‌నిక్ అనకుండా విహారయాత్ర అని ఏదో విధంగా సర్దుకొని వుండవలసింది.

నవల ముగింపు పాఠకులకు ఆనందాశ్రువులు తెప్పిస్తుంది. రఘు సన్యాసులలో కలిసిపోయి, బంధువులపట్ల ప్రేమ వదులుకోలేక తమ్ముణ్ణి చూడటానికివచ్చి, తమ్ముడు కూతుర్ని చూచి, పొంగిపోవటం, సుమారాణి పుట్టినరోజు వేడుకలో రఘుపట్ల అవ్యాజమైన అనురాగం, తెలియని బాంధవ్యం అనుభూతి పొందటం — నవల ముగింపు చాలా బాగుంది.

నవలలో కథ చాలా వేగంగా సాగుతుంది. దాదాపు పాతికేళ్ల కథ జరుగుతుంది. భాష చక్కగా ప్రయుక్తమయింది. కవితాత్మక వాక్యాలు అక్కడక్కడా గోచరిస్తాయి. స్త్రీ హృదయకౌమల్య దర్శనార్థం ఈ నవల చదవవచ్చు.

ప్రాణాంతక ప్రణయం

[నవల. రచన: శ్రీ వి. యస్. అవధాని. ఎమెస్కో పాకెట్ బుక్. ప్రతులకు ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్. వెల రూ. 2–00. పేజీలు 208.]

సృజనాత్మక రచన — అది ఏ ప్రక్రియ అయినా కావచ్చు — వాస్తవికంగా వుండాలంటే లోకంలో సామాన్యమయిన విషయం ఉదాత్తరీతిలో చిత్రింపబడితే బాగుంటుంది. కాని సమాజంలో ఎక్కడో, ఎప్పుడో, మరీ, అరుదుగా జరిగే సంఘటనలు చిత్రిస్తే సహజత దెబ్బతింటుందా? తినకపోవచ్చు.

పినతల్లి కొడుకుమీద మమకారం — వాంఛ చూపటం, సంబంధం ఏర్పరుచుకోవటం సహజం కాదని లేకపోయినా మామూలు కాదు. ఒకవేళ సంబంధం ఏర్పరుచుకొంటే అది విడ్డూరంగా వుంటుంది. వివాహవ్యవస్థ, స్త్రీ పురుష సంబంధాలు నిర్ణీతమయిన ఆధునిక యుగంలో వింతగా, క్రొత్తగా, పాశవికంగా అధర్మంగా వుంటుంది. అలాంటివి లోకంలో ఎక్కడయినా జరగవచ్చు. బొత్తుగా జరగవు అనే అధికారం — విశాల విశ్వంలో ఇన్ని విచిత్రవృత్తులుగల సమాజంలో — లేదు.

అయితే, అది సాహిత్యంలో వ్యక్తం కావచ్చునా? కానూవచ్చు. అయితే అది ఎంతవరకు స్వీకరింపదగింది, అంటే అది పాఠకుల మానసిక స్థితిమీద ఆధారపడుతుంది. ఈ నవలలో ఒక వ్యక్తి రెండో భార్య, ఆ వ్యక్తి మొదటి భార్య కొడుకుతో — వయస్సులో అతను నాలుగేళ్ళు చిన్నవాడు — సంబంధం శారీరకంగా కలిగించుకొంటుంది.

ఈ విషయం పాఠకులు ఎలా స్వీకరిస్తారో, దానిపైన నవల భవిష్యత్తు ఆధారపడుతుంది. విద్యావంతులయిన నలుగురయిదుగురు మిత్రులు ఇటువంటి నవలలు ముద్రణకే అయోగ్యం అన్నారు. ఒకరిద్దరూ సాహిత్యంలో వ్రాయకూడంది ఏముంది లెమ్మన్నారు.

సృజనాత్మక రచన విషాదాంతం అయినా చింతలేదు. దుఃఖాంతం అయినా చింతలేదు. మోదాంతం అయినా ఫరవాలేదు. ప్రమోదాంతం అయినా ఫరవాలేదు. ఆ రచన హృదయంమీద వేయగల ముద్ర ముఖ్యమయింది. హృదయంమీద ముద్ర పడాలంటే ప్రధాన పాత్ర చనిపోయి తీరాలని తప్పనిసరి ఏమీలేదు. ఈ నవల ప్రధాన పాత్ర చనిపోకపోతే విషాదం మరింత సమర్థవంతంగా తీసుకొని రాబడివుండేది. పాత్ర చనిపోయింది, మనకేం దిగులు లేదు అని హాయిగా వుంటారు పాఠకులు. పాత్ర చనిపోకపోతే, వీళ్ల భవిష్యత్తు ఏమవుతుందోనని పాఠకులు అల్లాడిపోతారు. పైగా నేరంచేసిన పాత్ర ఒకటి, మరణించిన పాత్ర మరొకటి.

భావనారాయణ కొడుకు నారాయణ. అతనికి పద్నాలుగేళ్ళున్నప్పుడు, అన్నపూర్ణ—పద్ధెనిమిదేళ్ళున్న అమ్మాయి, భావనారాయణ రెండో భార్యలాయి కాపురానికి వచ్చింది. ఒక దుర్ముహూర్తంలో అన్నపూర్ణ నారాయణను స్నానం తిప్పేట్టు చేసింది. ఆ పైన దూరంగా వుంది. అతను దగ్గరకు రావటానికి ప్రయత్నం చేశాడు. ఆమె నారాయణకు లీలావతికి పెళ్లి చేయబోయింది. కుదరలేదు. రూపాదేవితో వివాహం తప్పిపోయింది. కామేశ్వరి - అన్నపూర్ణ చెల్లెలు—అక్కదగ్గరకు రావటంతో కథ బలం పుంజుకొంది.

రూపాదేవితో సంబంధం తప్పిపోయింది. అందుకు లీలావతీ ఆమె తల్లీ కారకులు, అన్నపూర్ణ సోదరులు కారకులే! నారాయణ చిన్నాన్నా కారకుడే! అప్పటికే భావనారాయణ గతించాడు. వాంచారమ్మా కామేశ్వరీ తిరుపతికి వెళ్ళారు. ఇంట్లో అన్నపూర్ణా నారాయణా ఉన్నారు. అప్పుడే వాళ్ళు స్వేచ్ఛగా మాట్లాడుకొంది. నారాయణకు ప్రథమానుభూతి మరుపురానిదయింది. ఎవరూ అతనికి నచ్చటం లేదు. ఆ పైన జరగవలసిన అన్యాయం జరిగిపోయింది.

రచయిత, భావనారాయణ గతించిన తర్వాత, అన్నపూర్ణాకూ, నారాయణకూ క్రమసంబంధం క్రమబద్ధం చేయవలసింది. అలా చేయలేదు. అందుకు రచయిత భయం కారణం కావచ్చు. సవతి తల్లికీ కొడుక్కీ సంబంధం ఏర్పరచినప్పుడు లేని పిరికితనం ఇప్పుడెందుకు రావాలి! పాఠకులు ఏమనుకొంటారోనని. ఏమన్నా అనుకొంటే మొదటనే అనుకొంటారు. మధ్యలో మళ్ళీ ఏమీ అనుకోరు. రచయిత పాత్రగతంగా, అధర్మపు పిరికితనం ప్రచారం చేసినట్లు కనబడుతుందిగానీ, అధర్మంగా ధైర్యం అయినా, ధర్మంగా నీతి అయినా చెప్పలేదీ నవలలో అనిపిస్తుంది పోనీ, సమాజ చిత్రీకరణ అయినా జరిగిందా కథలో అంటే అదీ కుదరదు.

కొంతవరకు చక్కని పాత్రచిత్రణ, స్వభావ చిత్రీకరణ, మనస్తత్వ పరిశీలనా, రచనా సామర్థ్యం ఉన్న రచయిత పాఠకుల మూఢ్యతకు నమ్మకాలకు, మేలగ వుండని ఆతిస్వతత్వం స్వీకరించి, శక్తి సామర్థ్యాలు వమ్ము చేసుకొన్నట్లు సామభోతిని నవల చదివే కొందరయినా భావిస్తారు.

Oedipus, a king of Thebes who unwittingly slew his father and married Jocasta his mother. Oedipus complex— in psycho—analysis a complex involving a preponderating love by a person for the parent of opposite sex. * నారాయణకున్నది Oedipus complex అని సరిపెట్టుకోవటానికి కూడా పూర్తిగా ఆధారం లభ్యంకాదు. రూపాదేవిపట్ల మనస్సు పోతే, అన్నపూర్ణే నాకు భార్యగా కావాలని నారాయణ ఆరాటపడివుంటే అదే పూర్తి Oedipus complex అయివుండేది. నారాయణది నాగరకమయిన Oedipus complex

పద్నాలుగేళ్ల నారాయణ దాదాపు పదేళ్ల పూర్వం చనిపోయిన తల్లినిగూర్చి కలవరించటం వింతగా వుంటుంది తనకేమీ తెలియని తల్లిని ఎవరయినా కలవరించగలరా! సమాధానం ఫ్రాయిడ్ చెప్పాలి. ఫ్రాయిడ్ వీళ్లేదనే అంటాడు.

ఈ నవలలో ఉన్న చాలా పాత్రలు చాలా పాత్రలతో నీ బ్రతుకు మాకు తెలియదా అని అతని అక్రమసంబంధాలుగూర్చి ప్రసంగించి అవతల వ్యక్తి నోరు మూయించటం చూస్తే విచిత్రంగా వుంటుంది. ఎందుకు ఇలా రచయిత ఇన్నిసార్లు వ్రాయటం?

భావనారాయణ స్వేచ్ఛగా పెంచి నారాయణను పాడుచేశాడేమో అనిపిస్తుంది. అంతస్వేచ్ఛ తగదనిపిస్తుంది. తల్లి చిన్నతనంలో చనిపోతే వాంచారమ్మ, ముప్పై ఏళ్ళ విధవ అంటే లేకపోతే

---

* The new national dictionary—by Dr. Samuel Johnson—Published by Collins, London and Glasgow.

అతనిలో కొంత మార్పువచ్చి వుండేదేమో! అతను ఏక్సిడెంటుకు గురిఅయినప్పుడే తప్పుకు ప్రాయశ్చిత్తం జరిగిపోయిందనుకొంటారు పాఠకులు. కానీ అంతటితో పూర్తి కాలేదు

నవల చదువుతున్నంతసేపూ పాఠకులు ఒక విపరీతమయిన మానసిక అవస్థను అనుభవిస్తారు. రచయితకు భాషపైన అధికారం వుంది. కార్యకారణ సంబంధంతో కథ నిర్మించుకొనే సామర్థ్యం వుంది. మానసిక పరిశీలన చేయగల, దాన్ని రచింపగలశక్తి వుంది.

అన్నపూర్ణ, నారాయణల మానసిక సంఘర్షణ అనంతరం, కామేశ్వరి ప్రవేశం వరకు జరిగిన కథలో చాలా భాగం నవలా కళ్యైక్యం పోషించదు. అనవసరం కూడానేమో, పాఠకులకు విసుగుకూడా పుడుతుంది. చెప్పిన విషయమే చెప్పటం, పాత్రలు అనుకొన్న మాటలే అనుకోవటం, మానసిక సంఘర్షణ ఉన్న రచనలో అవసరం కావచ్చుగానీ ఇంతగా అవసరం లేదు.

పాత్ర చిత్రణ నేర్పుగా చేసే నైపుణ్యం రచయితకు వుంది. అంతేకాదు సామాన్య గృహ వాతావరణం, మనుష్యమనస్తత్వం చిత్రించే నేర్పు వుంది. ఎన్ని రచయితకుండవలసిన సుగుణాలు వ్యస్తంగా కనిపించినా సమస్తంగా ఈ రచన నిరాశనే కలిగిస్తుంది.

లీలావతి కుటుంబంవాళ్లు పాత్రలు అంత అసహ్యం ప్రకటించటం, అన్నపూర్ణ అన్నలు అంత దుర్మార్గులుగా చిత్రించటం, ఇవిగాక, డాక్టర్ శేఖరం కుటుంబం అంత ఉదాత్తంగా ఉన్నదనుకోవటంగానీ, భావనారాయణ అంత గొప్పవాడని తలంచటంగానీ పాత్రలకు సహజం అయితే కావచ్చు రచయిత అలా చిత్రించటం అసహజం. ఒక్క మంచితనం మూర్తీభవించిన మనుష్యులే లోకంలో ఎలా వుండరో అలాగే ఒక్క దుర్మార్గమే ఉన్న మనుష్యులూ ఉండరు. అందరిలోనూ మంచితనం అంతో ఇంతో పాఠకులు దర్శించేటట్టు వ్రాస్తే రచన మరింత సహజంగా వుంటుంది.

—మనోరాణి.

తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము

(రచన: డాక్టర్ కె. గోపాలకృష్ణరావు, ఎం.ఎ.,పిహెచ్.డి. రీడరు. తెలుగుశాఖ. ఉస్మానియా విశ్వవిద్యాలయము. ప్రతులకు : ఆంధ్ర సారస్వత పరిషత్తు), బొగ్గులకుంట—హైద్రాబాదు,మూల్యము: ఐదు రూపాయలు.

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి ఉత్తమ గ్రంథ బహుమానమునందుకొన్న పుస్తకమిది శ్రీ గోపాలకృష్ణరావుగారు ఉర్దూ పారశీక భాషావాఙ్మయములతో తెలుగుతోవలెనే లోతైన పాండిత్య పరిచయము కలవారు. ఏ భాషగాని మరొకదాని సంబంధము లేకుండ అభివృద్ధి కాజాలదు. అన్ని భాషలు అన్ని భాషలను ప్రభావితము చేయజాలవు. ఏ భాషా భాషీయుల ఆధిపత్యమెచట చెలామణియగునో అచటి భాషను వారి భాషకూడ పరిపాలించును. ఇప్పుడు భారతదేశములోని భాషలమీద ఆంగ్లభాషా సాహిత్యముల ప్రభావము మనకందరకు తెలిసినదే. ఇట్లే వీరికంటె పూర్వము దాదాపు ఆయిదారువందల సంవత్సరములపాటు భారత దేశమును పాలించిన మహమ్మదీయ ప్రభువుల భాషావాఙ్మయములు దేశీయములయిన భాషా వాఙ్మయములను ప్రభావితము చేసి యుండుటలో ఆశ్చర్యము లేదు. వాఙ్మయమే కాకుండ నిత్యజీవితావసరమైన భాషకూడ అట్లన్య భాషల ప్రభావమునకు లోనగును. భారత దేశమును పాలించిన మహమ్మదీయులు కొంతకాలము మన ఆంధ్ర దేశమునుగూడ సర్వాధికారములతో పాలించిరి. అట్టివారి భాష ఏవిధముగా తెనుగుమీద తన ముద్ర వేసినదో ఈ గ్రంథము బహుముఖముల పరిశీలించుచున్నది.

కవి ప్రయోగములు అను శీర్షికను నన్నయ—నన్నెచోడులు, తిక్కన, నాచనసోముడు, రంగనాథుడు, శ్రీనాథుడు, ఎక్కన, అనంతామాత్యుడు, గౌరన, నంది మల్లయ్య-ఘంట సింగయ్య, గోపరాజు, అప్పయ్య, శ్రీ కృష్ణదేవరాయలు। పెద్దన, పొరంగుతమ్మయ్య, కుమారధూర్జటి, రామరాజభూషణుడు. రంగపరాజు, కనిచౌడప్ప, సురభి మాధవరాయలు, కదరీపతి, నారాయణ కవి, తెలగనార్యుడు ధర్మన్న, వేంగళ భూపాలుడు, రామకృష్ణుడు, చిననారాయణ, విజయరాఘవ నాయకుడు, కూచిమంచిజగ్గకవి, కూర్మనాథుడు ఈ మొదలుగాగలిగిన ముప్పదియైదుగురు తెలుగు

కవుల గ్రంథములనుండి వారువా రుపయోగించిన అన్యదేశ్యములు ఉర్దూ పారశీక మాతృకములు ప్రయోగముల నేరి—వాటిని అర్థముఖముగా విచారించి వాని మూలరూపములను చూపుచు మార్పులను సూచింపుచు శ్రీ గోపాలకృష్ణరావుగారు మన ప్రాచీనకవులు ఈ అన్యదేశ్యముల నే పద్ధతిన తమ కృతులలో నుపయోగించుకొనిరో నిరూపించిరి. ఈ కవుల కృతులుకాక, మరికొన్ని శతకములను, శాసనములను, జానపదగేయములను, వచనగ్రంథములను, ప్రభుత్వమువారి చట్టములను గూడ పరిశోధించి అందం దుపయోగింపబడిన ఉర్దూ పారశీక పదములను గుర్తించిరి. మొత్తముమీద ఆంధ్ర వాఙ్మయమున మొదటినుండి ఈనాటివరకుగల ఉర్దూ పారశీకముల ప్రభావమును శ్రీ గోపాలకృష్ణరావుగారు పరిశ్రమించి పసికట్టి ఈ గ్రంథమును రచించినారు. ఒక భాషలోనుండి పదములు మరొక భాషలోనికి వచ్చునపుడు తాను ప్రవేశించు భాషయొక్క కట్టుబాట్లకు లోబడి వచ్చును. ఆ విధముగా వచ్చుట చేత మూలమునందలి శబ్దము—ధ్వని పరిణామము చెందుట గలదు. ధ్వని—పరిణామమను శీర్షికను శ్రీ గోపాల కృష్ణ రావుగా రనేక శబ్దముల పరిణామమును నిరూపించి చూపిరి. మరొకటికూడ కలదు. కొన్ని శబ్దములు తమ మూల భాషయందలి యర్థములను విడిచి క్రొత్త యర్థములతో క్రొత్తభాషలో ప్రవేశించును. దీనినే అర్థవిపరిణామమందురు. శ్రీ గోపాలకృష్ణరావుగారు ఈ దృష్టితో గూడ పరిశోధన చేసిరి.

ఒక భాషయొక్క ప్రభావము మరొక్క భాష మీద కేవలము శబ్దములు ప్రవేశించుట రూపమున మాత్రమే ఉండదు. ప్రభావమునొందు భాషయొక్క సాహిత్యము ప్రభావితమైనభాషలోని కనువాదరూపమున వచ్చును. ఉర్దూ పారశీకములనుండి అట్టి అనువాదములు మన తెలుగునకు వచ్చినవి. ప్రాచీన కాలమున రాలేదు. ఈ శతాబ్దమున అధికముగా వచ్చినవి. శ్రీ గోపాల కృష్ణరావుగారా విధముగా తెలుగున కనువదింపబడిన గ్రంథములను అనువాదము చేసిన కవులను గూర్చి విపులముగా చర్చించిరి. మూలానువాదములను పోల్చి ఉచితానుచితములను గూడ నిరూపించిరి. డాక్టరు గోపాలకృష్ణరావుగారు చేసిన విశిష్ట పరిశోధన ఫలిత మీ గ్రంథము. ఇది బహుమతి పొందగల యోగ్యత కలది. సాహిత్య విద్యార్థులు—విద్వాంసులు తప్పక జాగ్రత్తగా అధ్యయనము చేయవలసిన ఉత్తమ పరిశోధన గ్రంథమిది.

—క్షేమేంద్ర.

అ ప జ య ం

(నవల. కన్నడమూలం 'త్రివేణి' అనువాదం: శర్వాణి —ప్రతులకు: దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్స్ విజయవాడ–2. వెల: 3–00.)

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో కొంతకాలం క్రిందట ధారావాహికంగా వెలువడిన పాఠకుల మన్నన లు పొందిన 'అపస్వరం' నవలకు తరువాతి భాగం యిది.

'మీర' శామణ్ణ భార్య. ఆ దంపతులకు కలిగిన 'వీణ' అయిదేళ్ల తన ముద్దుమాటలతో, ఆటలతో అందరినీ అలరించి అకస్మాత్తుగా చనిపోయింది. ఆ దంపతులకు 'వీణ' మరణం అశనిపాతం అయింది. ఆ విచారంతో 'మీర' క్రుంగిపోయింది. శామణ్ణ ఎంతో మంచివాడు. భార్యపట్ల గౌరవమూ, ఆదరణా ఉన్నవాడు. ఆ చిన్నపల్లెటూళ్లో ఏమీ పనిలేకుండా సోమరిగా కాలం గడపడం మీరకు కష్టమైపోయింది. ఆమె 'మెడిసిన్' చదువుతానన్నది. శామణ్ణ సహృదయంతో అంగీకరించాడు. మీర తన చదువులో ఎంతో రిలీఫ్ పొందింది. చాలా వరకు తన దుఃఖాన్ని మరిచిపోగలిగింది. భర్త అంటే మీరకు ఎంతో అభిమానం ఉంది. తాను భార్యగా అతన్ని సుఖపెట్టలేకపోతున్నానని ఎంతగానో బాధపడింది. అందువల్లనే శామణ్ణదగ్గర తాను చెప్పినట్టు వింటానని మాట తీసుకుని తమ బంధుకోటిలోని సరసి అనే పిల్లను తెచ్చి శామణ్ణకు మళ్లీ వివాహం చేసింది. శామణ్ణ సరసి తత్త్వం తెలిసినవాడే అయినా మీర మాట జవదాటలేకపోయాడు. కాని తన ప్రయత్నంలో మీర ఓడిపోయింది. సరసి ఆలోచనలూ అభిప్రాయాలూ వేరు. మీర చదువు పూర్తిచేసుకుని స్వగ్రామంలో వైద్యం ప్రారంభించ

డంతో చిక్కులు బయలుదేరాయి. శామణ్ణ వీర పట్ల యింకా అభిమానం చూపించడం సరసి సహించలేకపోయింది. స్త్రీ సహజమైన ఈర్ష్య, అసూయలకు లొంగి సరసి రకరకాల మాటలతో, తన ప్రవర్తనతో శామణ్ణనూ వీరనూ హింసించడం ప్రారంభించింది. ఇక వీరకు మిగిలిందొకటే మార్గం. వేరే ఎక్కడికైనా వెళ్లిపోయి వైద్యవృత్తి నవలంబించడంతప్ప ఆమెకు మరొక దోవ లేదు. ఆమె గుండె రాయి చేసుకుని వేరొక చోటికి శాశ్వతంగా వెళ్లిపోయేందుకు సిద్ధపడింది.

ఇప్పటి రచయిత్రులు ఎంత ఆధునాతనంగా, స్పష్టంగా ఆలోచిస్తున్నారో తెలుసుకునేందుకు ఈ నవల ఉపకరిస్తుంది. సమాజంలోని స్త్రీ పురుష సమస్యలను గురించి గాఢంగా ఆలోచించే రచయిత్రి తత్వం ప్రతి అధ్యాయంలోనూ స్పష్టంగా కనబడుతున్నది. రచయిత్రి ఎక్కడా సహజత్వం చెడకుండా, నిగ్రహంతో, ఆశయాలు ప్రబోధాల పాలు మరీ విపరీతం కాకుండా జాగ్రత్తగా రచన చేసినట్లు అనిపిస్తుంది.

ఈ నవలలో వీర ప్రత్యేకించి స్మరణీయమైన పాత్ర. ఆమెలో గొప్ప భావసంఘర్షణ ఉంది తెలివితేటలున్నాయి. మనుష్యులను అర్థం చేసుకోగల నేర్పు ఉంది. ఆశయాలూ, వాటి సాధనకోసం ఆరాటం ఉన్నాయి. ఇన్ని ఉండీ ఆమె 'సరసి'ని అర్థం చేసుకోలేక 'అపజయం' పొందింది.

అనువాదం గురించి...అద్యంతమూ సరళంగా సాఫీగానే నడిచినా అక్కడక్కడ 'ప్రయాణానికి కావలసిన సిద్ధతలు చేసుకుంది...' అనానుకూల మవుతుందన్న కారణంగా', 'ఏదో క్షుల్లక కారణానికోసం,' 'అతిక్రూరి' (క్రూరురాలు అనే అర్థంలో), మహాదాని (దానగుణంగల స్త్రీ అనే అర్థంలో), వగైరా తమాషా ప్రయోగాలున్నాయి.

అపరాజిత

(కథల సంపుటి. రచన : వాకాటి పాండురంగరావు. ప్రతులకు: ఎమెస్కో పాకెట్ బుక్స్, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాదు. వెల రు. 2-00.)

శేషాచలం అండ్ కంపెనీవారు ప్రచురిస్తున్న ఎమెస్కో ప్రణాళికలో వెలువడిన కథల సంపుటి.

రచయిత చిరకాలంగా వివిధ పత్రికలలో బహుళ సంఖ్యలో రచనలుచేసి ఆంధ్రపత్రికా పాఠక లోకంలో పలుకుబడి, ప్రాచుర్యం సంపాదించినవారు. ఇంతవరకూ వారి కథలేవీ ఒక సంపుటి రూపంలో వెలువడలేదు. ఎమెస్కో వారు ఇప్పుడు ఆ లోపం తీర్చారు.

తమ 'మనవి'లో రచయిత తాము వ్రాసిన కథ లన్నిటిలోనూ తమకు నచ్చినవి ఇరవై కిమించి ఉండవని స్పష్టంగా చెప్పారు. ఆ కథలలో కొన్ని ఈ సంపుటిలో ఉన్నాయని కూడా అన్నారు. సుమారు వందాయాభై కథలు వ్రాసిన రచయిత అన్నింటిలోనూ తమకు సుమారు యిరవై మాత్రమే నచ్చాయని చెప్పడం వారి వినయసంపదకూ, 'ఇంటిగ్రిటీ'కీ ఉదాహరణ.

ఈ రచయిత వ్రాసిన కథలు పత్రికలలో వెలువడినప్పుడల్లా చదువుతూవచ్చిన పాఠకులు ఈ సంపుటి చదివి 'ఇందులోని పది కథలూ వారి రచనా ధోరణులను సంపూర్ణంగా ప్రతిబింబించే కథలు కావ'ని భావిస్తే, అందులో వారి తప్పు లేదు. బహుళ సంఖ్యలో రచనలు చేసిన రచయిత. ఒక సంపుటిగా తమ కథలను వెలువరించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఎన్నిక చేయవలసిఉంటుంది. ఈ సంపుటిలో అది కనిపించదు. ▯

సామాన్య మానవుడి కష్టసుఖాలను, సమస్యలను పరిశీలించి కథలుగా మలచడంలో ఈ రచయి

తకు ఒక చక్కని పద్ధతి ఉంది. హాస్యంతో కలిపిన కరుణ ప్రతి కథలోనూ ఉంటుంది. ప్రతి కథా పాఠకుణ్ణి కొద్దిగానో గొప్పగానో ఆలోచనకు ప్రేరేపిస్తుంది.

ఈ సంపుటిలో 'అపరాజిత', 'పరిపూర్ణ', 'వాళ్ళు ముగ్గురు', 'సీతామామి', కొంచెం గంభీరమైన కథలు. 'ఆర్. చక్రరావు', 'ఎదురీత', 'మందీ-మనొక్కడూ', 'రాకమ్మానవు హానివృద్ధులు', మరొక తరహా కథలు. వీటిలో సామాన్యమానవుడి జీవితంమీద, వర్తమానంమీద, ప్రస్తుత వ్యవస్థ మీద రచయిత చక్కని వ్యంగ్యపూరితమైన వ్యాఖ్యానం చేశారు. 'బి. హీరుడు' చక్కని వ్యంగ్య రచన. ఇది ప్రభుత్వ యంత్రాంగంమీద ఒక కుతూహలకరమైన పరిశీలన. 'కాలుకరేఖా-కళ్ళటోడు' రచననుగురించి రచయిత మాటల్లోనే చెప్పవచ్చు. 'ఇదొక కథ కాదు.' నవదంపతులమధ్య నడిచిన ఒకానొక హుషారయిన సంభాషణ.

అన్ని కథలూ రచయితలోని నిశితపరిశీలనకూ, ప్రతిభకూ, ఆలోచింపజేసే సామర్థ్యానికీ సాక్ష్యం యిస్తున్నాయి. ప్రతికథ ముందూ 'కథ వెనక కథ' ముద్రించారు. చాలా కథలు వ్రాయడం ప్రారంభించి, ముగించేందుకు నెలల తరబడి పట్టిందని రచయిత అనడం విశేషం. రచయిత, రచనా వ్యాసంగాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారని, కేవలం కాలక్షేపం కోసం మాత్రమే వ్రాయడంలేదనీ తెలుస్తున్నది. ఇది మంచి లక్షణం.

'పరిపూర్ణ' అనే రచనను గురించి ఎవరో యిద్దరు పాఠకులు వ్రాసిన మాటలు రచయిత 'కథ వెనుక కథ'లో చెప్పారు. ఆ పాఠకుల రిమార్కులో కొంత నిజం లేకపోలేదు. ఆ రచనలో స్పష్టత లేదని చెప్పక తప్పదు.

మొత్తంమీద ఆహ్లాదకరమైన రచనా ధోరణి, సునిశిత హాస్యమూ, చక్కని పరిశీలనా శక్తీ, ఈ రచనలలో ఉన్నాయి.

—పి.

వక్రగతులు - ఇతర కథలు

(రచన: శ్రీ మధురాంతకం రాజారామ్; ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో; 224 పేజీలు; వెల: రూ 2-00.)

తెలుగు కథానికలు చదివేవారికి శ్రీ మధురాంతకం రాజారామ్ సుపరిచితులే. పత్రికల్లో రాజారామ్ పేరు కనిపించగానే షడ్రసోపేతమైన విందుభోజనం చెయ్యబోతున్నట్లు సంతోషంగా చదివేవారు అనేకులున్నారు. పఠిత ఏకాగ్రత చెదరనీయకుండ పట్టి చదివించగలిగేశక్తి ఉన్నది రాజారామ్ రచనలో. తెలుగు కథానికా రచనలో తొలితరానికి చెందకపోయినా తొలితరంవారి రచనల్లోని మెళుకువలన్నీ ఆకళించుకున్నారు. కథ చెప్పటంలో ఆయన కొక సంకల్పం ఉన్నట్లు కన్పిస్తుంది. విషయం దేనికి సంబంధించినదైతే ఎన్నుకున్నారో ఆ వాతావరణానికి భిన్నమైన శైలిలో ఎప్పుడూ చెప్పరు. కథద్వారా చెప్పదలచుకున్న అంశమేదో శక్తివంతంగానే చెప్తారు. సాంఘిక ప్రయోజనాన్ని కథలద్వారా కలిగించాలని అభిలషిస్తారో లేదోగాని కొన్నికథల్లో మటుకే ఆ ప్రయోజనం కన్పిస్తుంది.

విషయం మంచిదిగదాఅనిచెప్పి తన కపోలకల్పితమైన వాతావరణాన్ని సృష్టించటానికి పూనుకోరు. ఆయన కథానికా ప్రపంచం చాల చిన్నది. సర్వసాధారణంగా ఆయన రచనకు రంగస్థలం పల్లెటూరు. నాయకుడు ఆర్థికబాధలతో బాగా చితికిపోయిన పల్లెటూరి బడిపంతులు స్కూలుమాష్టారు- లేకపోతే అదే 'స్టేటస్'ఉన్న బీద మధ్యతరగతి కుటుంబీకుడు. ఆయన కథల్లో అంత్రశ్లేషణరమైన వాతావరణ మేదీ కన్పించదు. శిల్పంలో ప్రతిభ చూపించాలని చెప్పి 'సస్పెన్స్' సృష్టించటానికి అనవసరంగా శ్రమపడరు. ఆయన కథానిక చదవటమంటే కొత్తిమిర పాదులమధ్య గట్టుమీద నడిచిపోతూ, తల వంచుకుని ఆలోచిస్తూ జీవితాన్నిగూర్చి సింహావలోకనం చేసికోవటం. ప్రకృతి చిత్రణకుగూడ అత్యధిక ప్రాముఖ్యం యివ్వరు. ఆయన రచనలో పదచిత్రాలూ తక్కువే. చిరస్మరణీయమైన వాక్యాలక్కడక్కడా ఉన్నా అవి నిర్వచనాలు కావు కథల్లో ఉపన్యాసాలు తక్కువే ముగింపులో నీతులు చెప్పరు. ఇన్నిగుణాలుండికూడ, అసంఖ్యాకమైన కథలను వ్రాసిన తరు

పాతగూడ చిరస్మరణీయమైన కథలుగా ఆయన కథల్లో చెప్పుకోదగినవి తక్కువే. ఆయన ఎన్నుకున్న యితివృత్తాలన్నీ యించుమించు ఒకేవిధమైనవి కావటంవలన జీవిత వైవిధ్యం వాటిలో కొరవడిందేమో!

'వక్రగతులు—ఇతర కథలు' అనే యీ సంపుటిలో 'మయసభ; దివ్యౌషధం; పట్నం మామయ్య; సుడిగుండం; వక్రగతులు' ఎన్నదగినవి. 'మయసభ' అనే కథలో జీవిత సౌధం మయసభలాంటిదేనంటారు. ఎక్కడ ద్వారముందనుకుంటామో అక్కడ ద్వారం లేకపోవటం ఎలాగ మయసభ విశేషమో ఏ వ్యక్తినైతే లోకం దుర్మార్గుడిగా భావించి, వెంటాడి వేధిస్తుందో ఆ దుర్మార్గుడిలో దుర్గుణాలను మించిన సద్గుణాలుండటం విశేషం. అటువంటి 'వాసు' అనే వ్యక్తి కథ. కథాకథనంలో కొంత డొంకతిరుగుడు పద్ధతి ఉన్నది కాని కథ మయసభ అనబట్టి అయినా మయం సరిపెట్టుకోవాలేమో!

'దివ్యౌషధం' కథలో అంతరంగ పరిశీలనం చేసి అసలు మనిషి జబ్బులను కుదిర్చే దివ్యౌషధమేదో కనుక్కున్నారు. అదేమిటంటే 'జబ్బు నయం చేసేదికాదు ఆరోగ్యం ఎక్కడైతే ఉండాలో అక్కడ ఉండనే ఉంది. జీవితం సాగరమైతే, శరీరమే పడవ. సముద్ర జలాలకు పడవను తేల్చివేసే శక్తి కద్దు. కాని ఎంతవరకు? పడవకు బీటలు ఏర్పడనంతవరకు! దిగులుతో క్రుంగిపోవడం, ఆందోళనతో అలమటించడం ఆరాటంతో కుమిలిపోవడం స్వార్థచింతనలతో తనను తాను సంకుచితపరచుకోవడం, కీర్తికి మురిసిపోవడంలాంటి అలతలతో, కలతలతో శరీర నౌక వికలం కాకుండ చూచుకుంటే చాలు సునాయాసంగా జీవిత సాగరాన్ని తరించవచ్చు' వైద్యులీ అభిప్రాయంతో ఏకీభవించినా, ఏకీభవించకపోయినా ఆరోగ్య సూత్రాన్ని చెప్పిన యీ మాటల్లో కొంత సత్యం ఉన్నదని అంగీకరించక తప్పదు. కన్నుల పండువైన కథాశిల్పం యీ కథలో కనిపిస్తున్నది.

చిన్నపిల్లల నెవరైనా దత్తత యివ్వగలరేమో గాని వాళ్ళ మనసుల్ని ఎవ్వరూ శాసించలేరనీ, వారి మనస్సులకూ స్వాతంత్ర్యం ఉండబట్టే అవి అంత పవిత్రంగా ఉంటాయని, అటువంటి వాళ్ళ మనస్సులను ఆకట్టుకోవటంలో పట్నం మామయ్యవంటి మంచి వాళ్ళుగూడ విఫలంకాక తప్పదనీ, సామాజిక జీవనంలోని ఓ పులుగడిగిన సత్యాన్ని యిట్టే చెప్పేశారు 'పట్నం మామయ్య' కథలో.

'సుడిగుండం' కథలో అధికార మదోన్మత్తుడైన ఆఫీసరు అందరిచేత అసహ్యించుకోబడతాడు. ఉద్యోగులందరూ అతడికి భయపడి ఎదిరించలేక ఊరుకుంటారు. కాని అతడు ఒక పెద్ద సుడిగుండంలో యిరుక్కుంటాడు. అవినీతి నిరోధకశాఖ ఉద్యోగులు అతడిని పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నారని భయపడి, నిస్సహాయుడై తన క్రింది ఉద్యోగికి తన పాపాలన్నీ ఏకరువుపెట్టుకొని పశ్చాత్తప్తుడై ఆ రాత్రే ఆత్మహత్య చేసుకొంటాడు. ఆ ఆఫీసరు అన్ని అక్రమాలు, పాపాలు చెయ్యటానికి కారణం పెద్దింటిపిల్లను పెండ్లి చేసికోవటం— ఆమెలో డాబూ, దర్పమూ, నానాటికీ హెచ్చి, వచ్చే డబ్బు చాలక భర్తను పీడించగా అందు కాతడు లొంగిపోయాడు. అంటే స్వతహాగా ఆఫీసరు మంచివాడే. అయినా అవినీతినిరోధకశాఖవారి సుడిగుండంలో యిరుక్కున్నానని ఆత్మహత్య చేసికొన్నాడు. కాని ఆ ఆఫీసరును వెంటాడినవాడు ఇన్స్యూరెన్సు ఏజంటు, ఆఫీసరుకు లంచమిచ్చి తన పనిని సానుకూలపరచుకోవాలనుకుంటున్నవాడే. ఈ కథ నడిపించిన తీరు చూస్తుంటే తెలుగుకథనడక నాజూకు నిగారింపనిపిస్తున్నది

'వక్రగతులు' కథలో మురారి గొప్పింటిబిడ్డ. మూఢనమ్మకాలకు లోనై తనను శారీరకంగా మానసికంగా హింసించుకుని తన ఆప్తులనుగూడ అలాగే చిత్రహింసలకు గురిచేస్తాడు. స్వార్థపరుల మాటలు నమ్మి మాటిమాటికీ తన ఆరోగ్యాన్నిగూర్చి భయపడి మంచంలోనే ఉండిపోతాడు. కృంగి కృశించి భార్యను హంతకురాలిగా శంకించి బాధపెడతాడు. ఆమె ఆ నిందలు భరించలేక చనిపోతుంది. ఇక మురారివంటివారి మనస్తత్వాన్ని గూర్చి 'ఇవన్నీ భయంలో పుట్టిన పాత్రలు. అనుమానాన్ని ఆహారంగా భుజించి క్షణక్షణ ప్రవర్ధమానమౌతున్న పాత్రలు. వెలుగునూ, వెన్నెలనూ విడిచిపెట్టి చీకటిలోకి పారిపోతున్న పాత్రలు—ఆఖరుకు యీ పాత్ర లేమౌతాయి?'

అన్న ప్రశ్నతో కథను మిగిలింది చదువరుల ఊహకే వదిలివేశారు. సుదీర్ఘమైన యీ కథనం విసుగని పిస్తున్నది. చెప్పే విషయానికి బలం చేకూర్చలేని బరువైన సన్నివేశాలు కథకు పేలవత్వం తెచ్చిపెట్టాయి. ప్రజాపతి; వోరులేని జీవుడు అనే మరిరెండు కథానికలు గూడ యీ సంపుటిలో చేర్చబడ్డాయి. రాజారావ్ కథానికల జాబితాలో యీ పుస్తకంలోనివే ఉత్తమమైనవని చెప్పటానికి వీల్లేదు. ఉదాహరణకు వారిటీవల వ్రాసిన 'పాలికులు కుశలమా' అనే కథ ఉత్తమ కథలలో వొకటిగా యెంచవచ్చు.

రాజారావ్ గారి కథలు ఏడింటివి. రెండు వందల ఇరవై నాలుగు పేజీలలో రెండు రూపాయలకే అందించిన శ్రీ యం. శేషాచలం అండ్ కో వారు అభినందనీయులు. ఆంధ్ర సాహిత్య అకాడమీ బహుమతిని గూడ పొందిన శ్రీ రాజారావ్ గారి కలంనుండి తెలుగు సాహిత్యానికే అలంకార ప్రాయమైన కథానికలు రాగలవని ఆశిద్దాము.

పిచ్చేశ్వరరావు కథలు

(రచన: శ్రీ అట్లూరి పిచ్చేశ్వరరావు; ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్–విజయవాడ-2; 204 పేజీలు; వెల: రూ. 3)

మంచి కథలన్నీ పాఠకులను సంతోష పెట్టలేక పోవచ్చు. మంచి కథలు కొన్ని పాఠకుడిని నిలువెల్లా కదలిస్తాయి; కొన్ని ఉత్తేజ పరుస్తాయి. మరికొన్ని కన్నీళ్లు పెట్టిస్తాయి. ఇంకా కొన్ని కఠిన వాస్తవాలను కళ్ళముందుంచి భయపెడతాయి; అతడి నిస్సహాయ పరిస్థితిని బాగా తెలిసేట్టుచేసి దుఃఖంతో గొంతు పూడుకు పోయేట్టుచేసి నిస్పృహపరచి అంతలోనే వెన్నుచరచి నిలబెట్టేస్తాయి. కాని 'మెజారిటి' పాఠకులు మెచ్చుకుంటున్న మంచి కథలివి కావు. సర్వసౌఖ్యాలూ ఉండి కొన్ని ఊహామాత్రమైన కష్ట పరంపరలకు చిగురుటాకులా వణికిపోయే మనస్సున్న గొప్పింటి బిడ్డల కథలు అంతేకాదు ఆకలి బాధలను చిత్రిస్తూ, పరిష్కారమార్గం సూచనగానైనా అందజేయక, సమాజాన్ని ఆడిపోసుకుని నినాదపూర్వకమైన కథలు. కథావస్తువుండి రచనా శిల్పం కొరవడిన రచయితలు కన్పించినంతగా, కథాశిల్పంవుండి వస్తు స్వీకరణలో విఫలవౌతున్న రచయితలు తెలుగులో అంతగా కన్పించరు. కీ. శే. అట్లూరి పిచ్చేశ్వరరావు వస్తువులోనూ శిల్పంలోనూ సవ్యసాచి. కీర్తిని ప్రోగుచేసికోవటానికంతగా శ్రమపడక పోవటాన్నీ కొన్ని మంచి కథలూ, కొన్ని కాలక్షేపంకథలూ వ్రాసి అసంఖ్యాకమైన రచనలను సంపుటాలుగా ప్రకటించి తెలుగులోని ఉత్తమ కథారచయితల బాబితాలో నిలబడటానికి ఆయనెప్పుడూ ప్రయత్నం చెయ్యలేదు. అలాగని మంచికథలే వ్రాయాలని అత్యుదాత్తమైన వస్తువుకోసం బ్రతుకంతా నిరీక్షించనూ లేదు. కథ చెప్పాలనిపించినప్పుడే ఆయన చెప్పారు. జీవితంలోని ప్రతిసంఘటనా కథారచన కర్హమైనదే. ఐతే తాను కథ వ్రాయటానికి అన్ని సంఘటనలూ ఆయనను కదలించ లేదు కథావస్తువు కన్పించగానే రమణీయమైన శైలిలో వ్రాసుకుపోయారు. రచనలో ఎక్కడా బిగువు సడలలేదు.

ఆయన వరించిన వస్తువుకు కావలసిన శైలి సునాయాసంగా లభించింది. శ్రీ పిచ్చేశ్వరరావు స్వీకరించిన కథావస్తువునుమాత్రం ఆయనకంటే మంచి శైలిలో తెలుగులో మరెవ్వరూ వ్రాయలేరు. ఓ మంచి కథకుడి కింతకుమించిన చరితార్థత, సార్థకత మరేముంటుంది. ఆయన స్వీకరించిన ఇతివృత్తాన్ని యేవగించుకునేవారున్నా, ఆ విషయాన్ని ఆ శైలిలో తప్ప వ్రాయటానికి వీల్లేదని గుర్తించి తీరతారు.

'పిచ్చేశ్వరరావు కథలు' అనే యీ సంపుటంలో మొదటి కథలు 'జీవచ్ఛవాలు'; 'చిరంజీవి'; 'గడవనిచిన్న' అనే కథలు గుండెలు చీల్చుకొచ్చి, అద్భుతసత్యాలను కళ్లకు కట్టించేవి. తెలుగులోని అత్యుత్తమ కథల లెక్కలోనికి వీనిని తీసికొనవచ్చు. జీవచ్ఛవాలు అనే కథ అమెరికన్ జీవిత సరళినిగూర్చి తీవ్రమైన విమర్శ అమెరికాదేశమంటే ద్వేషంచేత పిచ్చేశ్వరరావీ కథ వ్రాశారని తోచదు. సామ్రాజ్యవాదపు ధనపిశాచం పేదవాడి నెలా పీల్చి పిప్పి చేస్తున్నదో వివరించబోతూ, అమెరికాదేశాన్ని గూర్చి–స్వేచ్ఛాప్రియులైన ప్రజాస్వామ్యదేశాలవారు ఎలాంటి భ్రమలు పెట్టుకొంటున్నదీ, ఆ భ్రమలను విచ్ఛిన్నం చేస్తూ అమెరికన్ సెయిలర్ 'డిక్'వారి జీవితసరళిని నగ్నంగా వర్ణించి, ఆ పేదజీవితంపట్ల విహ్వలభావాన్ని ప్రకటించి, నైరాశ్యం తనను ఏవిధంగా చావుకు పురి

కోల్పిందో, ఆత్మహత్యకు భయపడి బ్రతికున్నన్నాళ్ళు తిని, త్రాగి అనుభవించి ఏ క్షణంలోనైనా చావు నెదుర్కోవలసివస్తుందని తెలిసీ నేవీలో చేరినట్లు బాధామయమైన తన జీవితకథ వినిపిస్తాడు 'జీవచ్ఛవాలు' అన్న కథలో.

'జీవచ్ఛవాలు' కథలోని సత్యంతో ఏకీభవిస్తూనే శ్రీ కొడవటిగంటి 'ప్రజాస్వామ్య దేశాలలోని దారిద్ర్యం బాధాకరమైతే కేపిటలిస్టు దేశాలలోని దారిద్ర్యం ఎన్నోరెట్లు బాధాకరమైనది' అని చెప్తారు. ఈ సంభాషణల్లో జీవం, 'నేవీ' జీవితదృశ్యాలూ, వక్రమార్గం పట్టించి నిజాన్ని మసిపూసి మారేడుకాయ చెయ్యబోయిన ప్రజాస్వామ్యదేశాలలోని సుబ్రహ్మణ్యంవంటి అమాయకుల భావాలను మాంచి ఒడుపుతో కథగా వ్రాసేశారు శ్రీ పిచ్చేశ్వరరావు. ఈ కథలో స్వాతంత్ర్యదేవత విగ్రహ ప్రశంసను గూర్చి చిత్రమైన సత్యాన్ని బయటపెట్టారు రచయిత. స్వాతంత్ర్యదేవత విగ్రహశిల్పి ఆగస్ట బార్తోల్డీ అమెరికా దేశీయుడు కాడట. ఫ్రెంచివాడు. అతడు తన తల్లిని చూసి ఆ శిల్పం చెక్కి అమెరికా ఎంతో గొప్పదనుకుని దాన్ని సమర్పించాడంటారు. సరిగ్గా యీ విషయాన్ని నిజం చేస్తున్నట్లు ఆ విగ్రహం బెడ్లో ద్వీపంమీద అమెరికాలో అడుగుపెడుతున్న వాడికి ఎదురుగానూ, అమెరికాదేశంవైపుకు వీపు తిప్పినట్లుగానూ ఉంటుందట. 'Statue of liberty' ని చూచి యీ విధంగా చమత్కరించటానికి గొప్ప ప్రతిభ కావాలి. శ్రీ పిచ్చేశ్వరరావుగారికి ఆ ప్రతిభ పుష్కలంగా ఉన్నది.

'చిరంజీవి' కథలో చిరంజీవి మిలిటరీ ఉద్యోగి. అన్యాయం ఎక్కడున్నా ఏ రూపంలోఉన్నా ఎదిరించి తీరవలసిందే! అందు కెన్ని కష్టాలు వచ్చినా భరించటం అతని సహజగుణం. ఖైదులో ఉండటానికైనా తుపాకీగుండు తింటానికైనా సిద్ధమే. 'ఇనుం లాంటి ఒళ్ళుందని మెదడుకు తుప్పు పట్టించుకో వద్దని' చెప్పి మిలిటరీ యోధు లందరిలోనూ చైతన్యం తెస్తాడు. I don't think a soldier can think' అనే వ్యంగ్యోక్తిని తొలగించి ఐకమత్యమే బలంగదా అని గొర్రెలమందల్లా అనుకరించ వద్దంటాడు చిరంజీవి. బ్రిటీషు సైన్యంలో చేరినంత మాత్రాన సోదర ప్రజలనే కాల్చటానికి సిద్ధంగా లేమని జవాబుచెప్పి దేశభక్తిని ప్రకటిస్తాడు.

పదిమందికోసం పాటుబడి తుపాకి గుండుకు బలియై, ఆపరేషను చేశాక విఫలమై చనిపోతాడు. కాని చిరంజీవి చనిపోలేదు. జాతీయ 'నేవీ'లోని ప్రతియోధుడూ చిరంజీవిగా మారాడని ముగిస్తారు రచయిత. తెల్ల సైనికులపై జాతీయ యోధులంతా తిరుగుబాటు చేయగా తెల్లవాళ్ళు పారిపోయి, పోయి సముద్రంలోకి పోయారని 'సింబాలిక్'గా వాళ్ళు దేశం విడిచి పోయారంటారు. తెలుగు సాహిత్యంలో యిది విశిష్టమైన కథానిక.

దేశం స్వాతంత్ర్యం సంపాదించుకున్నాకగూడ వేలాది జీవులింకా 'గడపని నిప్పు'లోనే బ్రతుకుతున్నారు. అందులో పిన్నీగూడ నొకతె. ఆమె ధూళిలో పడిపోయిన మల్లెచెండు. ఎన్నో దేశాల బూటు కాళ్ళ క్రింద నలిగిపోతున్న అభాగ్యురాలు. ఆకలిమంటతో ఆమె పతితయై దీనంగా బ్రతుకుతూంటుంది. ఆమెలో అంతర్యంలోకి లోతుగా చూసుకునే తత్వం బాగా ఉన్నది. ఆమె వెర్రి పిచ్చిది. అందుకే దుష్టులందర్ని చూసి జాలిపడుతుంది. ఆమె ఏ దుర్మార్గాన్నీ వ్యతిరేకించదు. అందుకే 'ఆటం కనుక్కున్న వాళ్ళతో బాంబులుచేసి అమాయకుల్ని చంపొద్దనీ, విమానాలమీద యెగిరే వాళ్ళతో బాంబులు విసరొద్దనీ, ఓడలు నడిపే వాళ్ళతో సముద్రాన్ని మందు గనుల మయం చేయొద్దనీ, రైళ్ళు నడిపే వాళ్ళతో 'మిలిట'రీని చేరెయ్యొద్దనీ చెప్పదు.'

'ఓటిచ్చి కుర్చీలమీద.. కూర్చొబెట్టిన వాళ్ళతో అందరికీ పొట్టలు నిండేవరకు ఉపన్యాసాలు మానమనీ, అందరి బిడ్డలకు చదువు అందే వరకూ ఉపన్యాసాలు చెయ్యొద్దని చెప్పలేదు' ఇంతటి మహోన్నత వ్యక్తి వ్యక్తిత్వం తెలిసికోవటంకోసం 'గడపని నిప్పు' అనే కథ తప్పక చదవాలి.

'కోరినవరం' అనే కథలో సర్వాంతర్యామికి ప్రార్థన వినిపిస్తారు. సర్వాంతర్యామియైన వానికి ప్రార్థన గీతాలతో పనేముంది గనుక. అది నిరుపయోగమని నిరూపిస్తారు. 'అగస్టు 15' అనేది అధివాస్తవిక రచన. ఇటువంటి రచనలను ఆనందించటానికి ఆంధ్రలోకం అలవాటుపడలేదు. అతి

వాస్తవిక రచనలన్నింటికి మల్లే ఈ రచనలో గూడ ఆవేశంతో గుండె పోటు కదిలితే అటు మాటల్లో పెట్టడానికి రసానుగుణంగా చేసిన ప్రయత్నం కన్పిస్తుంది. 'వెర్రి కాదు వేదాంతం!!' అనే కథ మెట్ట వేదాంతాన్ని వ్యతిరేకిస్తూ, నిన్నలో బ్రతికే వారికీ, నేటి పరిస్థితిని విస్మరించి రేపటికోసమే అర్రులు జాచేవారికి చెంప పెట్టు పెడుతుంది. వర్తమానాన్ని విస్మరించి వల్ల కట్ల వేదాంతంకాదు వెర్రి అని తీర్పు చెప్తుంది.

ఈ సంపుటంలోని రచనలలోవేగాక తెలుగు సాహిత్యంలోనే వ్యంగ్యాన్నాశ్రయించిన ఉత్తమ కథానికలలోనే విశిష్టమైన స్థాయికి చెందినది, 'డొంకల వంకల మనసులు'. స్వార్థబుద్ధితో సంచరిస్తూ ప్రతిపనీ ప్రజాసేవలో ముడిపెట్టే సీతారామయ్య వంటి వేరుపురుగుల చర్యలను విమర్శిస్తే వారిని 'డొంకలవంకల మనసులు' అంటుంది లోకం? ఇదేమి చిత్రం! సునిశితమైన వ్యంగ్యానికీ, ప్రజాసేవకులుగా చలామణిఅయ్యే పెద్దమనుష్యుల చర్యలలో దాగిఉన్న స్వార్థాన్ని చక్కగా వెల్లడిస్తున్నది ఈ రచన. 'శాస్త్రి' రచనలో శాస్త్రి రచయిత రచనల్లో చెప్పిన సంస్కరణకూ బ్రతుకుతూన్న విధానానికీ ఏమాత్రం సంబంధం లేనివాడు ఇటువంటి మహానుభావులు కోకొల్లలు మన సాహిత్యవీథుల్లో. 'సబద్ధం'అనే రచన గొప్ప 'సెటైర్'. 'గేట్‌వే ఆఫ్ ఇండియా'ను అందరూ భారతదేశపు సింహద్వారం అంటారు. ఈ ద్వారాన్ని మూసేందుకు వీల్లేదు; తెరిచేందుకూ వీల్లేదు ఇలాంటివి సబద్ధాలంటే బొంబాయి నగరంలోని ఒకగొప్పక్లబ్‌లో మెంబరు కావాలంటే అబద్ధం చెప్పడం 'క్వాలిఫికేషన్'. నిజం చెపితే ప్రతిమాటకూ పది రూపాయల జరిమానా విధిస్తారట. ఇలా ఉంటాయట గొప్పవాళ్ళుగా చెలామణి అయ్యేవారి క్లబ్ జీవితాలు.

'ఒక అనుభవం'; 'కథకుడు' అనేవి రైలు ప్రయాణాల అనుభవాల్ని కథలుగా మార్చుకొన్నవి. పదిమందికోసం పాటుపడేవాడినిరైల్లోనయినాసరే అర్భకుణ్ణిగాచేసి నొక్కేస్తారు.

'విముక్తి' కథ తెలంగాణాలో స్వాతంత్ర్యోద్యమాన్ని అంటే విముక్తి సమరాన్ని వర్ణిస్తూ, ఒక గ్రామంలోని జీవిత దృశ్యాలను సంపుటిగా అందిస్తుంది. 'గడచిన దినాలు' పేదల పల్లెటూళ్లలో అపేక్షలుంటాయని చెప్పుకునే కథలలోబాటు పురుషులు కోపోద్రిక్తులై అతిచిన్నకారణానికీ భార్యలను చావచితక కొట్టేవారనే సత్యాన్నికూడ నమ్మాలంటారు. అయితే యివి గడచిన దినాలే లెమ్మని ధైర్యమూ చెప్తారు.

'బ్రతకటం తెలియనివాడు' అనే కథలో నిజానికై నిలబడిన ప్రతివాడూ ధర్మంకోసం కష్టాలకు వెనుదీయనివాడినీ ఈ లోకం బ్రతకటం తెలియని వాడు అంటుంది, అసలు బ్రతకటమంటే యేమిటన్న ప్రశ్నను రేకెత్తిస్తారు.

ఈ విధంగా వ్రాసుకుంటూపోతే ఈ సంపుటిలోని కథలన్నీ విశిష్టమైనవే కీర్తినాకాంక్షించి వ్రాసినవికాక జీవిత దృశ్యాలను చూచి కదలిపోయి, ఆత్మసంక్షోభాన్ని అందరికీ అందివ్వాలనే చేసిన ప్రయత్నానికి సంబంధించినవి. ప్రతికథా ఆ కోణంనుండిచూచి వ్రాసిన కళాఖండం.

ఈ కథల వైశిష్ట్యాన్ని గూర్చి శ్రీ కొడవటిగంటి కుటుంబరావు వ్రాసిన చక్కని విమర్శ కూడ కథకుడిగా విశ్వేశ్వరరావు అనే పరిచయంగా వేశారు. అది చదివితే విశ్వేశ్వరరావు వ్యక్తిత్వం తెలుస్తుంది. ఈ కథల వెనుకనున్న ఆతని అంతర్యపు ఔన్నత్యం తెలుస్తుంది. కథల్ని కాచి వడబోసిన శ్రీ కొడవటిగంటి దృష్టిలో కనీసం నాలుగైదు ఉత్తమ తెలుగు కథానికా సాహిత్యంలో శాశ్వతంగా నిలువగలిగినవిగా ఉన్నాయి. ఈ మాట సత్యమని ఈ పుస్తకం చదువగానే అనిపిస్తుంది. ఇన్ని మంచి కథలలో ఆ నాలుగైదు ఏవి అనే ప్రశ్న మొలకెత్తుతుంది ఎవరి అభిరుచి ననుసరించి వాళ్లే సమాధానం చెప్పుకోవచ్చు.

—శ్రీ రామమోహనరాయ్.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd, by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.

Bharati   August 7 th 1968   Regd. No. M. 1856

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/–	రు. 150/–
2 లేక 3 వ కవరు పేజి ...			
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/–	రు. 125/–
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/–	రు. 100/–
అర పేజి	...	రు. 65/–	రు. 55/–
పావు పేజి	...	రు. 40/–	రు. 35/–

ప్రత్యేక స్థానములకు 25 అదనం.

సం॥ నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12–0–0
6 మాసముల చందా	...	రు. 6–0–0
విడి ప్రతి	...	రు. 1–0–0

మేనేజరు, భారతి.

ముద్రాసు–1.